
సత్యోదయము
శ్రీరామచంద్రజీ

# సత్యోదయము


రచయిత:

**శ్రీ రామచంద్రజీ**

అధ్యక్షులు:

శ్రీ రామచంద్ర మిషన్

ప్రథమ ముద్రణ -3000 ప్రతులు, 1968

ద్వితీయ ముద్రణ - 3000 ప్రతులు, 1976

రివైజ్డ్ ఎడిషన్ - 4000 ప్రతులు, 1983

ప్ర చు ర ణ :

శ్రీరామచంద్రమిషన్,

ప్రచురణ శాఖ,

షాజహాన్‌పూర్ (యు. పి.)

ఇండియా

వెల రు. : 8-00

విక్టరీ ప్రెస్, విజయవాడ వారిచే ముద్రితము

## అంకితము

నా

ఆధ్యాత్మిక సహోదరుఁడును

కీర్తిశేషుఁడు నయిన

'శ్రీ రామేశ్వర ప్రసాద్‌జీ మిశ్ర' కు

# ప్రకాశకుల విజ్ఞప్తి

ఆధ్యాత్మికానుభవములను సులభసాధ్యము కావించిన శ్రీరామచంద్రజీ మహాత్ములు ఆధ్యాత్మిక తృష్ణగలవారి సౌకర్యార్థము రచించిన గ్రంథములలో నిది ప్రధానమైనది. ఇది వారిచే నాంగ్లమున "**Reality at Dawn**" అను పేర రచింపఁబడి, 1954 సం॥న మొట్టమొదటిసారిగా ప్రచురింపఁబడినది. అప్పటినుండి దీనికి హిందీ, తమిళ, కన్నడ భాషలలో అనువాదములు వెలసినవి. కాని, యింతవఱకును తెలుఁగు భాషలో నిది వెలువడలేదు. చాల కాలముగా నున్నట్టి ఈ కొఱతను తీర్పు ప్రయత్నమునకు ఫలముగా వెలువడిన తెలుఁగు అనువాద గ్రంథమగు 'సత్యోదయము' ఆంధ్ర పాఠకలోకమునగల ఆధ్యాత్మిక తృష్ణను తీర్చగలదని విశ్వసించుచున్నాము.

ప్రచురణ శాఖ,
శ్రీ రామచంద్రమిషన్.

శ్రీ రామచంద్ర మిషన్, షాజహాన్‌పూర్, ప్రచురణ విభాగము సూపరింటెండెంటు వారు "సత్యోదయము" సవరణ ప్రతిని ప్రతిపాదించిరి. స్క్రూటినీ కమిటి, జోన్ I అవసరమని తోచిన కొన్ని సవరణలను చేసినది.

స్క్రూటిని కమిటి
శ్రీ రామచంద్ర మిషన్
జోన్ I

# అనువాదకుని వినతి


ఆధ్యాత్మిక రంగమున భారతదేశము ప్రపంచపటమున నొక విశిష్టస్థాన మాక్రమించియున్నదనుట సర్వవిదితము. ఈ దేశమున అనాది నుండియు మానవుని ఆధ్యాత్మిక పురోగతి కొఱకు అనేక మార్గము లన్వేషింపఁబడి, మహాపురుషులచేత విశదీకరింపఁబడి అనేకోద్గ్రంథములు రచింపఁబడియున్నవి. ఆత్మ సాక్షాత్కారమునకు ద్వారనేక యోగపద్ధతులు నిర్దేశించియున్నారు ఆ యోగ పద్ధతుల ననుసరించి ఉన్నతోన్నతాధ్యాత్మిక స్థితుఁను అనుభవమున సాధించుచు సాక్షాత్కారమును పొందుట సంసార బంధనము లందు చిక్కియున్న సామాన్య మానవులకు నేటి పరిస్థితుల దృష్ట్యా దుస్సాధ్యమగుచున్నది. ఇటువంటి పరిస్థితులలో నున్న జిజ్ఞాసువులకు మిక్కిలి సులభముగాను, అతి త్వరతగతిని ప్రాణాహుతి ద్వారా పరిపూర్ణానుభవమును కలిగించు నూతన రాజయోగ విధానమును సహజమార్గమను పేర షాజహాన్ పుర వాస్తవ్యులగు శ్రీరామచంద్రజీ 'Reality at Dawn' అను గ్రంథము నందు వివరించియున్నారు. ఇట్టి మహోత్కృష్ట విషయములు తెలుఁగు వారిలో ఆధ్యాత్మిక పిపాసువులగు

వారికి అందుబాటులోనికి తీసికొని రావలెనను ప్రయత్న ఫలమే ఈ 'సత్యోదయ' మను గ్రంథము.

అనువాదకార్య మొక అసిధారావ్రతము. దానిని నిర్దుష్టముగా నిర్వహించవలెనను ఆకాంక్ష ఏ మాత్రము నెఱవేటి యున్నను శ్రమ ఫలించినట్లే.

ఈ అనువాద కార్యమును పూర్తి చేయుటయందు అన్ని విధముల నాకు సహకరించిన చి॥ ఇ. రుక్మాంగదకు నా ఆశీస్సులు. తక్కువ కాలములో నిర్దుష్టముగాను, చక్కగాను ముద్రించి ఇచ్చిన వివేకానంద ప్రింటర్స్ వారికి నా కృతజ్ఞతలు.

ఇట్లు,
యన్. కుమారస్వామి,
ప్రెసెప్టర్.



సమర్థగురుమహాత్మా శ్రీరామచంద్రజీ
ఫతేగడ్ (U. P.)

# ముందు మాట

ఈ చిన్న గ్రంధము నందు చర్చించిన విషయమును గూర్చి నా యభిప్రాయమును తెలుపుటకు పూర్వము ఈ గ్రంధకర్తను గూర్చి కొన్ని మాటలు వ్రాయుటకు నుత్సహింతును. ఈ గ్రంధకర్త మహాత్మ రామచంద్రజీ "శ్రీరామ చంద్ర మిషను"నకు అధ్యక్షులు. వారు అన్ని రకములైన ప్రాపంచిక బాధలు, బాధ్యతలతో కూడియున్న గృహస్థ జీవనమును గడుపుచున్నారు. వారు బొత్తిగా నిరాడంబరమైన వేషములో సున్నితమైన దేహముతో నుందురు. ఏదేనొక నిర్ణయమునకు వచ్చుటకు మునుపు విషయములను సన్నిహితముగా పరిశీలించు నా సహజమగు అలవాటు కారణమున అయనను ఐదేళ్ళపాటు నేను సూక్ష్మముగా పరిశీలించితిని. వారి యందు నాకు మహోన్నత అత్మానుభవము సాధించిన వ్యక్తిలో కనపడెడి సుగుణములన్నియు కలవను నమ్మకము కలిగినది. నా అభిప్రాయములో వారి అధ్యాత్మిక సిద్ధులు అరుదైనవని పేర్కొనినప్పటికిని అందు అతిశయోక్తి లేదు. వారు రాజయోగ పద్ధతిని మార్పుచేసి, సహజ మార్గమనెడి పేరున ప్రవేశ పెట్టిరి. అది అందరికీ సులువుగా అందుబాటులో నున్నది.

సహజ మార్గ విధానమును అనుసరించి వారు పూర్వము

రచించిన "Efficacy of Rajyoga" రాజయోగ ప్రభావము అను గ్రంథము ఆ విధానమును విపులముగా చర్చించును. ఈ పద్ధతిలోని ప్రత్యేకత అభ్యాసియందు యోగశక్తిని ప్రసారితము చేయుట అని చెప్పబడుచున్నది. దీనివలన అతని అంతరంగ క్లిష్టతలు నిర్మూలింపబడి, చక్రములు పరిశుద్ధి పరచబడి, తేజోవంతము కావింపబడును. ఇందు మూలమున అతని దారి సుగమమగును. నేనీ మాట లేల వ్రాసితిననగా ఎల్లప్పుడును మనము చేపట్టిన విధానము యొక్క ప్రభావమును, మార్గదర్శకుని శక్తి సామర్థ్యములను ముఖ్యమయినవి. వీటిని ఎన్నుకొనుటలో పొరబడినచో నిరుపయోగములయి పోవును. ఈ విషయమును నొక్కి చెప్పవలసిన అవసరము లేదు.

ఈ పుస్తకము రాజయోగము మీద ఒక సంక్షిప్త గ్రంథము. ఆధ్యాత్మికతపై అభిరుచికల వారందరు శ్రద్ధతో చదువదగినది. రాజయోగము యొక్క ముఖ్య లక్ష్యము గొప్ప పురాతన మహర్షుల బోధనలలో చిత్రించిన సత్యమును తనకు తానుగా అనుభవమున సాధించుటయే. ఆ బోధనలను కేవలము మౌఖికముగా వల్లించుటగాని, అవి సత్ప్రవర్తనా సూత్రములని నమ్ముటగాని మనలను ఎచ్చటికి కొనిపోజాలదు. కాని వాటిలోని సత్యమును తనకు తానుగా అనుభవమున సాధించి ఆ బోధనలను తన జీవన నియమములుగా రూపొందించుకొనుటలో ఎవడైనను కృతకృత్యుడైనచో గొప్ప

వ్యత్యాసము అందు కలదు. ఇది అత్యంతోన్నతమైన ఆధ్యాత్మిక అభివృద్ధిని సాధించుటకు అతనికి సహాయ పడును. అట్టి వ్యక్తి పొందెడి శక్తులు అపరిమితములు. కాని అతడే వాటి యందు ఉదాసీనత వహించి యుండును. అతని చర్యలన్నియు పూర్తిగా పై నుండి వచ్చెడి ఆదేశములచేత నడపబడుచున్నవి. అట్టి వ్యక్తి సంపదలను లెక్క చేయడు. ఆ సంపదలు ఇచ్చు ప్రాపంచిక సౌఖ్యములను లక్ష్య పెట్టడు. పలుకుబడి, పేరు ప్రఖ్యాతులు సంపాదించవలెనను భావము అతని తలపున ఎన్నడును కలుగవు. అతడొనర్చు పనులు తన కోరికలను అనుసరించి ఉండవు. ఈ ప్రమాణముల ద్వారా నేనీ గ్రంథ కర్తను అవగాహన చేసికొనుటకు ప్రయత్నించితిని. నా మట్టుకు నాకు వారు పై గుణములను విస్తారముగా కలిగి యున్నారని సంపూర్ణ విశ్వాసము కలిగినది.

ఈ పుస్తకము నందు చర్చించిన విషయములు అన్నియు సాక్షాత్కారమును వాంఛించు వ్యక్తికి అత్యంత ప్రధానములైనవి. అత్యంత ముదావహమైన, ప్రోత్సాహకర మైన విషయమేమనగా మహోన్నత సిద్ధులను కూడ గృహస్థ జీవనమును సాగించుచునే పొందవచ్చును. సన్యాస జీవనము చేపట్టినగాని యోగసిద్ధులు సాధించుట వీలుకాదని యుగముల తరబడి నిరంతరముగా చెప్పుట వలన మనము చాలా నిరుత్సాహ పడినాము. ఆధ్యాత్మిక జీవనమునకు జీవగఱ్ఱ అయిన వైరాగ్యము ప్రాపంచిక బంధనములన్నియు త్రెంచు

ఓం తత్ సత్


# ప్రార్థన

ఓ స్వామీ! మానవ జీవనమునకు నీవే యదార్థ లక్ష్యము
మా ఆత్మోన్నతికి ప్రతిబంధకములైన కోరికలకు బానిసలము
ఆ స్థితికి మమ్ము గొని పోవుటకు నీవే ఏకైక శక్తివి, దైవము.

రాత్రి నిదురించుటకు మునుపు నమ్ర భావముతో ప్రార్థన చేయవలెను. భక్తి భావముతో పై వాక్యములు ఒకటి రెండు సార్లు మనస్సులోనే ఉచ్చరించి దాని యందుగల భావముపై ధ్యానము చేయుచు దానిలోనే మునిగి (లీనమై) నిదురించవలెను.

"సహజ మార్గము"లో ఇదియే సరియైన ప్రార్థనా విధానము.

శ్రీరామచంద్రమిషన్, షాజహాన్‌పూర్ (యు. పి.)



మహాత్మా శ్రీరామచంద్రజీ
షాజహాన్‌పూర్ (U. P.)

# వి ష య సూ చి క


| | | | | పుట |
|---|---|---|---|---|
| 1. | ప్రకాశకుల విజ్ఞప్తి | ... | ... | v |
| 2. | అనువాదకుని వినతి | ... | ... | vii |
| 3. | ముందుమాట | ... | ... | ix |
| 4. | ప్రార్థన ... | ... | ... | xv |
| 5. | మతము ... | ... | ... | 1 |
| 6. | జీవిత లక్ష్యము | ... | ... | 17 |
| 7. | మార్గములు - సాధనములు | ... | ... | 29 |
| 8. | గురువు ... | ... | ... | 52 |
| 9. | ఆధ్యాత్మిక శిక్షణ | ... | ... | 76 |
| 10. | శ్రద్ధ ... | ... | ... | 95 |
| 11. | నిరంతర స్మరణము | ... | ... | 103 |
| 12. | ఆత్మసమర్పణము | ... | ... | 113 |
| 13. | సాక్షాత్కారము | ... | ... | 119 |
| 14. | నా భవిష్య దృష్టి | ... | ... | 141 |
| 15. | అనుబంధము-చిహ్నము | ... | ... | 150 |
| | దశనియమములు | ... | ... | 152 |

1

# మతము

మానవ సృష్టి మొదలైనప్పటి నుండియు బాహ్య దృశ్యముల అంతర్గత రహస్యము వెలువరించుటకును, ప్రధాన సత్యము గ్రహించుటకును, దైవారాధన చేయుటయే మానవ జాతి యొక్క అన్వేషణయై యున్నది. ఇదియే మతమునకు మూలము. ఆరాధకుడు శాశ్వత స్వర్గానందమనో, లేదా తానంతిమ లక్ష్యముగా భావించిన మరియొక దానినో దృష్టి యందు కలిగియుండును. గొప్ప మతకర్తల స్వానుభవము లపై ఆధారపడి నియమ బద్ధములయిన పద్ధతులు, కర్మ కాండ లతో కూడి ప్రపంచమున మతములు పుట్టినవి. అయితే వేల సంవత్సరములు గతించి పరిసరములన్నియు మారిపోయి జీవిత విధానము సమూలముగా పరివర్తనము చెందినప్పటికిని ప్రాతనియమములు పద్ధతులే అనుసరింపబడుచున్నవి. వాటి మూలోద్దేశము మాయము కాగా బాహ్య కర్మకాండలు మాత్రము మిగిలియున్నవి. తత్ఫలితముగా మత విధానమునకు కాలదోషము పట్టినది అగుటచే నేటి మత విధానము పూర్వ కాలమునకు చెందిన అవశేషమన్నను, మృతకళేబరమున మిగిలిన అస్థికలన్నను తప్పుకాబోదు. మనము వాస్తవముగా

నిజమైన మతమును గోతిలో పాతివైచితిమి. కేవలము మతము పేరిట చప్పట్లు చరచుట తప్ప మనమేమియు చేయుటలేదు.

మతము యొక్క నిజతత్వము రూపుమాసి పోగా దాని స్థానమున లాంఛనములు మాత్రము మిగిలియున్నవి. బాహ్య రూపముకు విధులు విధానములు మాత్రమే అగుపించుచున్నవి. అవి మాత్రము అత్యంత ఛాందసత్వముతోడను, పట్టుదల తోడను, సత్పదార్థ భావము లేశమైనను లేక అనుసరింపబడు చున్నవి. సత్య విషయమున మన నమ్మిక అధఃస్థితికి పతనమై పోయినది. అదియే కర్మకాండ రూపమునకు వికృతి చెందినది. అది క్రమముగా దిగజారి దురదృష్ట వశమున ఈ కాలపు మతము యొక్క శాశ్వత లక్షణమైన మూఢ విశ్వాసముగనో, దురభిప్రాయముగనో పరిణమించుచున్నది.

సాంప్రదాయములపై మనకు గల గ్రుడ్డి నమ్మకము సత్య విషయమున అంధకారమున ఉంచును. అందుచే మనము మనకు తెలియకయే ఇతర సాంప్రదాయములందు, కర్మ కాండలయందు నమ్మిక గలవారి ఎడల మనలో ద్వేష భావములు పెంపొందించుకొందుము. వీని ఫలితముగా భిన్న మతానుయాయుల మధ్య అసూయా వైరములు పుట్టును.

భారతదేశము రాజకీయ స్వాతంత్ర్యము పడసినది. గాని, ఆత్మ స్వాతంత్ర్యమింకను పొందవలసి యున్నది. విశాల దృక్పథమునకు స్వతంత్రాలోచనకు సామర్థ్యము కొరవడియుండుటే ఆత్మ స్వాతంత్ర్యప్రాప్తికి ముఖ్య ప్రతి

బంధకము. వాతావరణ మంతయు దురభిప్రాయము తోడను, విరోధభావముతోడను నిండియున్నది. సమాజము యొక్కయు సంస్కృతి యొక్కయు నిర్మాణము యావత్తు అదే పునాదిపై నిలిచియున్నది. భిన్నమతముల మధ్యనున్న అసూయలే మన నాగరికత పతన మగుటకు మూల కారణము.

ఒక్కొక్కటియు రూఢి అయిన విభాగముగా ఏర్పడి భారతదేశమున నేడు మూడు వేలకు తక్కువగాక, కులము లున్నవి. ఈ కులము లన్నియు మొట్టమొదట వివిధ వృత్తుల ననుసరించు పనివారల సంఘము లే.ఇవి శ్రమవిభజన నిమిత్తము ఏర్పరుపబడినవి. కాని నేడు ప్రతి సంఘమును సమాజము నుండి విడివడి ప్రత్యేకమగు స్వతంత్ర విభాగమై మరొక తెగపై ఈర్ష్యాద్వేషభావముల పెంపొందించుకొనుచున్నవి. ఈ విధముగా సమాజమంతయు విచ్ఛిన్నస్థితికి దారి తీయు చున్నది. కాని ఈ కీడు త్వరలో నశించుటకు కాలమాసన్న మగుచున్నది. దీనిని తుద ముట్టించుటకై ప్రకృతియే పూను కొనుచున్నది. కాల ఖడ్గము తప్పించుకొనరానిది. కుల ద్వేషము రెచ్చగొట్టు వారికిది హెచ్చరిక. వారు సకాలములో సరిదిద్దుకొనకపోయినచో తీవ్ర ఫలితముల నుండి తప్పించు కొనలేరు. భగవత్సంకల్పము జరిగియే తీరును. దురభిప్రాయ మత్యంత దుష్టమైనది. మరియొక విధముగా చెప్పవలెనన్న అది ఆధ్యాత్మిక జీవనమునకు ప్రాణాంతకమయిన విషము. అది మానవుని విశాల దృక్పథమును పోగొట్టి, అతనిని

సంకుచిత దృష్టిగల వానినిగా చేయును. అది కల్పించెడి సంకుచిత బుద్ధి వలన అభివృద్ధి, పురోగతులను పొందు నవకాశము నాశనమై పోవును. దురభిమాన మితరులపై ద్వేషము గలిగించును. అదియే అహంభావము యొక్క పరోక్షరూపము. ఈదుర్గుణమును పెంపొందించుకొన్న యెడల అహంకారమనెడి గొలుసున కింకొక యుంగరము చేర్చుకొన్న వారగుదురు. తత్ఫలితముగా సత్పదార్థమునకు మరింత దూరమగుదురు. అనంత తత్వము సాధించుట యిట్లు సాధ్యమగును.

సాధారణముగా దైవమునకు, మనుష్యునకు అనుసంధానము కలిగించునదిగా భావింపబడునట్టిది మతము.దానికి మూలాధారమైన విశ్వప్రేమ నేడు సమూలముగా మాయమగుటచే భగవంతుని చేరుటకు మతము ప్రతిబంధకమై పోయినది. పొందవలసిన గమ్యస్థానముయొక్క తత్వము సంపూర్ణముగా అవగాహన చేసికొనక ప్రత్యేక విధానములకు గాని, సాధనలకుగాని గట్టిగా కట్టుబడి యుండినచో మనము బహుశః గొప్ప పొరపాటు చేసిన వారమగుదుము. దేవుడొక ప్రత్యేక మతమునగాని, తెగ యందుగాని లేడు కొన్ని పద్ధతులకు, కర్మ కాండలకు మాత్రము పరిమితుడు కాడు. కేవలము శాస్త్రముల నుండియే అతనిని కనుగొనుటకును వీలుగాదు. అతనికై మనము హృదయాంతరాళము నందే అన్వేషించవలెను.

దేవుని గుఱించిన భావము లనేకము లున్నవి. ప్రజలు వారి వారి సామర్థ్యము ననుసరించియు, అవగాహనా శక్తి

ననుసరించియు దైవ స్వరూపమును నిర్ణయించుకొందురు. భగవంతుడు నిరంతర శక్తి స్వరూపుడనుటయే సర్వసాధారణముగా ఒప్పుకొనబడిన భావము.

తాత్విక దృష్టి యింకను ఉన్నతము. అది బహుత్వము, వైవిధ్యముల కతీతమైన నిర్గుణ బ్రహ్మము వరకు వ్యాపించి యున్నది. అదియే సర్వసృష్టికి మూల కారణము, మూలాధారము, మూలశక్తి. అది గుణాతీతము, క్రియాతీతము లేక చైతన్యాతీతము. అదియే పరబ్రహ్మ మనబడుచున్నది. భగవంతుడే సృష్టికి మూలసత్త యనునది మరొక ఉద్దేశము. వైవిధ్యముతోడను, విభేదములతోడను కూడి యున్నట్లుగా సృష్టిని మనము చూచుచున్నాము. దీని కంతకును ఒక సృష్టి కర్త, పరిపాలకుడున్నాడన్న నమ్మిక కలుగుచున్నది. అతనిని ఈశ్వరుడు లేదా సగుణబ్రహ్మయని పిలుచుచున్నాము. అతడే సర్వశక్తిమంతుడును, సర్వాంతర్యామియును, సూక్ష్మతత్వములు కలవాడునైన రూపరహిత శాశ్వత శక్తి స్వరూపుడని మనము భావింతుము. అతడే సృష్టికి నిమిత్తకారకుడు, అతడే పరిపాలకుడు, లయకారకుడు.

ఈ (ఇట్లు) తక్కువ దృష్టితో చూచుట వలననే దైవము (మత సంబంధమైన దైవము) పూజా వస్తువగుచున్నాడు. అన్ని మతములకు ఇదియే అంతిమ దృక్పథమగుచున్నది. ఇంతవరకు భగవంతుడు నిరాకారు డనుకొనినప్పటికీ కొన్ని గుణములు గలిగిన వాడుగా భావింపబడుచున్నాడు. సామాన్యుల కిదియే

గ్రహింప వీలుగాని భావమగుటవలన వారు సులభ గ్రాహ్యమగు సాకార పద్ధతి ననుసరించి భగవంతు నన్వేషింప జూతురు. అందు మూలముననే కొందరు భగవంతుడు ఉన్నత స్వర్గలోక స్థితుడై దయ, న్యాయములతో అందరను పాలించువాడని అనుకొందురు. ఇతరులు సృష్టిని నిర్వహించు సర్వశక్తిమంతునిగా తలంతురు. ఇట్లంచెలంచెలుగా నిరాకార దృష్టి నుండి సాకార దృష్టికి మరలు చున్నాము. సాకార నిరాకార భావములను గూర్చి మన మత గ్రంథములం దెంతయో చెప్పబడి యున్నది. కాని సాధారణ పరిజ్ఞానమున ఉన్న ఈ రెండు భావములు తప్పుదారి పట్టించునట్టివే. నిజమునకు భగవంతుడు సాకారుడునుగాడు, నిరాకారుడునుగాడు. అతడు రెండింటికిని అతీతుడు. అతనిని సాకారుడని భావించువారు అనంతుడగు వానిని పరిమితునిగా స్వరూప ఆకారములకు కట్టివైతురు. తత్ఫలితముగా పరిమిత భావములను కల్పించుకొన్నవారు నిరంతరము బంధనములకు లోనై ఉందురు. భగవంతుడు నిరాకారుడను తలపే అతనిని సృష్టి స్థితి లయకారకత్వములకు పరిమితుని చేయును.

దేవుని శక్తి స్వరూపునిగా ఎంచుట గూడ పరిమిత భావమే. వ్యక్తిత్వ రహితుడు లేదా శూన్యుడు అను ఉన్నత భావము కూడ ఒక విధముగా కొంచెము సత్యదార్థమునకు దూరమే. ఇక నెట్లు? ఇప్పుడు చెప్పనలవిగాని స్థితి ఏర్పడు చున్నది. పైన చెప్పిన రెండు భావములకు దూరమైతిమేని

మనము సరియగు దారికి వచ్చినట్లు భావించవచ్చును. ఎంత కాలము మనము మతపరిమితులకు కట్టిబడియుందుమో అంత వరకు మతసంబంధమగు దేవుడే మన దృష్టి యందుండును. అంతవఱకును మనము సాకార నిరాకార భావము లందొక దానిలో చిక్కువడి యుందుము. రెండింటికినీ అతీతమయి నప్పుడే ఉన్నతాధ్యాత్మిక స్థితులను పొందుట సాధ్యమగును.

వాస్తవముగా మతము ఎక్కడ అంతమగునో అక్కడే ఆధ్యాత్మికత మొదలగును. ముక్తి మార్గమున పయనించుట కనువుగా తీర్చిదిద్దుటకు మతము ప్రారంభ దశ మాత్రమే. ఆ మార్గమున అడుగు పెట్టినతడు మత పరిమితుల కతీతుడైనట్లే. మతము యొక్క అంత్యమే ఆధ్యాత్మికతోదయము. ఆధ్యాత్మికత యొక్క అంత్యమే సత్యోదయము. సత్యము యొక్క అంత్యమే వాస్తవానందము. అదియును దాటిన మీదటనే గమ్యస్థానము చేరుదుము. మాటలకలవిగాని మహోన్నతస్థితి అదియే.

వేర్వేరాకారములలో దేవుళ్ళను, దేవతలను పూజించుట సాకార సిద్ధాంతము యొక్క అపరిష్కృత అభివృద్ధియే. ప్రకృతి శక్తులను వృక్షనదీ పర్వతాదులను పూజించుటలో ఈ సిద్ధాంతము యొక్క పతనస్థితి మరింతగా గోచరించును. ఎంత విచారకరము! యజమానుని కొలుచుటకు మారుగా సేవకులను సేవించుచున్నాము. యజమానుని పూర్తిగా నిర్లక్ష్యము చేయుచున్నాము. మనలో పాతుకొని పోయిన దురభిప్రాయములకు వ్యతిరేకముగా నొక్క పదమైనను వినుటకు తయారుగాలేము. ఆ కారణముననే నేడు మనము చాల తెగలను, మత విధానము

లను చూచుచున్నాము ఒక్కొక్కరు వారి వారి దేవుళ్ళనో, దేవతలనో వారి వారి నిర్దిష్ట మార్గములలో పూజించుచున్నారు. స్పష్టముగా వారి దృష్టియందున్న గమ్యము ముక్తి కూడ కాదు. పెక్కు సందర్భములలో అది యేదో ఒక దుఃఖము నుండి బయటపడుటో, ఆర్థిక లాభము పొందుటో అయి ఉన్నది. పరిస్థితుల ప్రాబల్యము వలననో, ఆత్మసాక్షాత్కార విషయములందు అంధకారముననున్నవారి అపమార్గ దర్శకత్వము వలననో కొందరిట్టి పూజలు చేయుటకు పూనుకొను చున్నారు.

భగవద్గీత యందు కృష్ణ పరమాత్మ ఈ విషయమును చక్కగా విశదీకరించెను. దేవుళ్ళను పూజించు వారెంతైనను ఆ దేవుళ్ళకు పరిమితమైన స్థితుల వఱకు మాత్రమే పోగలరు. అది ముక్తికన్న ఎంతయో తక్కువస్థితి. ఆ దేవుళ్ళకే అంత కన్నా ఉన్నతస్థితికి పోవుటకు సామర్థ్యము లేదు. వారి భక్తుల దృష్టి ఈ స్థితిని మించి పోవుటనెడిది అసాధ్యము.

కావున మనము సత్యమే లక్ష్యముగా గ్రహించినచో దేవుళ్ళు, దేవతలు, నిరుపయోగములనుట తేటతెల్లము. ఈ యంశమును నేను రచించిన "Efficacy of Rajyoga" "సహజ మార్గము దృష్ట్యా రాజయోగ ప్రభావము" అను పుస్తకమున మఱింత స్పష్టముగా విశదపరచి యున్నాను.

ప్రాపంచిక లాభముల కొఱకై దేవుళ్ళ, దేవతల వెంట దవిలియున్నవారు కొందరనుసరించు యాంత్రిక రూపమైన

ఆరాధనలు కూడ అసంగతమైనవే. అవి పూజలే కావు. అట్టి పూజా విధానము చేపట్టినవారు శ్రామికుల పాత్ర నిర్వహింతు రనియే అనవచ్చును. వారు దినాంతమున వారి శారీరక శ్రమకు తగిన బత్తెము పొందుదురు. శ్రద్ధాభక్తులతో పూజించుటచే స్థిరముగా వారి మనసులందు నాటుకొని పోయిన భగవంతుని స్థూల రూపము అంతరంగిక స్థౌల్యమును కలిగించును. అట్లే చాల కాలము ఆరాధనలు సాగించిన యెడల స్థూలత్వము బాగుగా గట్టిపడిపోయి, సత్యమునకు వారు దూరమగుదురు. అట్టి సందర్భములలో ఫలితములు ప్రతి ఒక్కరికీ తెలిసినవే. భౌతికేతర తత్వము, ఆరాధన ప్రారంభ ములో సామాన్య ప్రజలకు కష్టమనీ, వారి అభివృద్ధి కొరకు ప్రాచీన మహర్షులు కొన్ని అనుకూల మార్గములను ఏర్పరచిరి. వారు సామాన్య ప్రజలకు సులభగ్రాహ్యమగు స్థూల రూపముగా గోచరించువానితో ప్రారంభించిరి. సులభగ్రాహ్యమగునవి వేర్వేరు జనులకు వేర్వేరుగా ఉండును. అధమాధమ స్థితి యందుండు వారికై ఆ మహర్షులు స్థూలరూపముగా గోచరించు వాని నారాధించుట స్వీకరించిరి. ఉన్నత స్థితి యందుండు ఇతరుల విషయమున అమూర్త రూపములయిన తేజస్సు, జ్యోతి లేదా ఏదో దివ్య గుణమువంటి సూక్ష్మరూపమును వారు ప్రవేశ పెట్టిరి. ఉన్నత సంస్కార వంతులకు భగవంతుని గూర్చిన సూక్ష్మ భావనయే చాలును. ఈ విధముగా అధ

మాధమస్థితి యందుండు వారికి మాత్రమే మూర్తి, చిత్రముల వంటి స్థూల పద్ధతులను వారు నియమించిరి. అది కూడా తాత్కాలికముగా మాత్రమే. వారు కొంత అభివృద్ధి సాధించిన మీదట వాటిని విడచి సూక్ష్మపద్ధతులను చేపట్టి తదుపరి దశ నందుకొనునట్లు చేసెడివారు. ఇవి అక్షరాభ్యాస కాలమున చిన్నబిడ్డలచే అక్షరములపై దిద్దించుట వంటిది. కొంత అభ్యాసానంతరము సహాయము లేక సొంతముగా బిడ్డలు రాయగల్గునప్పుడు అక్షరములు అవసరము లేదు. ఇట్లు కొంతకాలము ప్రారంభకులు స్థూల రూపమునుగాని, విగ్రహ రూపమును గాని అవలంభింతురు. అటు పిమ్మట తరువాత దశకు పోవుదురు.

అదియునుగాక ఇందులకై నిర్దేశించబడిన విగ్రహ మాధ్యాత్మిక శక్తిచే పూరించబడి యుండును. అందువలన భక్తి శ్రద్ధలతో దాని చెంత చేరియున్నవారు ఆ అధ్యాత్మిక శక్తి ప్రసారము వలన లాభము పొందుదురు. ఆధ్యాత్మిక శక్తిని విగ్రహము నందు ప్రవేశ పెట్టగల శక్తిమంతు లరుదు. అయినను ప్రాణ ప్రతిష్ఠ లాంఛనముగా జరుగుచునే యున్నది. తత్ఫలితముగా వేల ఏండ్ల క్రితము ఇట్లు అధ్యాత్మిక శక్తిచే పూరించబడిన స్థలములు, విగ్రహములు దాదాపు వాటి శక్తిని కోల్పోయినవి. అందుచే భక్త్యారాధనలకై అచ్చటికి పోవు వారికి కల్గు లాభమేమియు లేదు. భగవంతుని కొరకు వేరొక తీరున అరాధన చేయలేని అధమస్థితి యందుండు మానసిక

దుర్బలుల కొరకే నిస్సందేహముగా ఈ పద్ధతులు ప్రవేశ పెట్టబడినవి. ఇట్టి ఆరాధనను విడువని పట్టుదలతో చాల కాల మనుసరించిన యెడల నెట్టి ఆధ్యాత్మికానుకూలము లేక పోవుటయేగాక ఆరాధనలోని ఉద్దేశ్యమే భంగపడుచున్నది. ఈ భావము కబీరు మహనీయుడు క్రింది పద్యములో చక్కగా ప్రకటించెను.

:: పాహన్ పూజే హరి మిలే, తో పూజియే పహాడ్
తాతె యహ్ చక్కి భలి, పీస్ ఖాయ్ సంసార్.

"రాతిని పూజించుట వలన దేవుని చేరగల్గినట్లయిన, నేను పర్వతమునే పూజించుటకు సిద్ధముగా నున్నాను. కాని ఈ పనికి లోకపోషణార్థమై ధాన్యము విసరునట్టి తిరుగలిరాయి మెఱుగు"

నా దృష్టిలో జీవితమంతయు నిటువంటి ఆరాధనా విధానమునకు కట్టువడి యుండువారు నాస్తికత్వమనెడి బురదలో కొట్టుమిట్టాడు చుందురు. అందుండి వారిని వెలికి తీయుట అత్యంత కష్టసాధ్యము. నిరంతరాభ్యాసము వలన కొంత కాలమునకు దాని యందు వారు గట్టిగా పాతుకొని పోయిన వారై ఎన్నడును వెలికి రావలెనని తలపనైన తలప లేరు. వా రచలము గానట్లే ఉండి పోవుదురు. తమ యందు ఇమిడిపోయిన భావములను తొలగించుకొనుటకు వారొప్పు కొనరు, అంతేకాక వారి యోచనాశక్తి నుపయోగించి, వాటిని

బలపరచి మరింత స్థూలత్వమును పొందుదురు. ప్రతివస్తువును తన రూపమును పోలిన నీడనే ప్రతిబింబింపజేయును. వస్తువు సూక్ష్మమగుచో ప్రతిబింబము కూడ సూక్ష్మ లక్షణములు గలిగి యుండును. అది స్థూలమగుచో దాని ప్రతిబింబము కూడ స్థూల లక్షణములు గలిగియుండును. మనము స్థూల వస్తువుపై దృష్టిని కేంద్రీకరించినచో అంతర్గతముగా స్థూలత్వమును పొందుదుము.

పవిత్ర గ్రంథముల నుండి చదివి నేర్చుకొనిన బోధకులు సమస్తమును స్థూలరూపమున బోధించుటచే అజ్ఞాన ప్రజలకు దారుణాపకారము జరిగినది. ఇది మనస్సుయొక్క వివేచనా శక్తిని నాశనము గావించును. ఇట్టి భయంకరమైన స్థితిని పొందినవాడు శాశ్వత దుర్గతి పొందినవాడే. అతడు విశాల దృష్టిపథమును కోల్పోవుటచే అతని పురోగమన శక్తి రూపు మాసిపోవును. అట్టివారిని కూపస్థ మండూకములతో పోల్చ వచ్చును. వారు తమ సంకుచిత కార్యరంగమే సమస్తమనియు, సమగ్రమనియు భావింతురు.

పరిమితమైన మార్గరహితమైన గోళాంతరమున వారు నిరంతరము పరిభ్రమించుచుందురు. జీవితాంతము వారదే స్థితి యందు కొట్టుకొను చుందురు. భగవంతుని గూర్చిన కథలు, దృష్టాంతములే వారికి చాలును. చాలకాలము ఈ తీరుననే నడిచినచో వారి మెదడులోని జీవకణములు దెబ్బ తినును, రోజురోజుకు పటుతరమయ్యెడి ఆలోచనలతో నవి నిండి

పోవును. తుదకు నాడీ మండలమే విఘాతము చెందును. బాహ్య జడత్వములోనికి చొరబారి తనపని పూర్తి కావించును. వారిప్పుడంతర్బాహ్యములు రెంటియందును పూర్తిగా అభేద్యస్థితి యందుండి దివ్యజ్యోతి ప్రసరించ వీలులేకుండును. వారి అత్యోన్నతి మార్గములన్నియు మూయబడియుండును. అట్టి వారిని సజీవ పాషాణములని పిలువవచ్చును. వారీ రీతిని వృద్ధి పరచుకొన్న కఠినస్థౌల్యము ఉన్నత సూక్ష్మ లక్షణములు గల దేని తోడను అత్యల్ప సంబంధము కూడ కలిగి ఉండనీయక వారి నట్టి భావములకు దూరముగా ఉంచును. ఈ స్థౌల్య ప్రభావమున వారు మంత్రబద్ధులవలె కట్టుబడి యుందురు. అదొక ఆధ్యాత్మిక దశగా వారు భావింతురు. కాని వాస్తవమునకు వారట్టి స్థితికి బహుదూరమునం దున్నారు. ఆధ్యాత్మిక సాధన కొరకు నా వద్దకు వచ్చువారు ఇటువంటి పద్ధతులనుసరించుటచే వారి హృదయములందు కల్గిన కఠిన స్థౌల్యమును పోగొట్టుట యనునది చాల దుష్కరమును, ప్రయాస యుక్తమును నగు కార్యమని నా అనుభవము తెలుపుచున్నది. అట్టి ఆత్మ బంధనముల నుండి ముక్తి పొందగోరువారు అటువంటి (మూర్ఖపు) పద్ధతుల ఫలితముగా మనస్సు నావరించిన స్థౌల్యపు పొరలను తొలగించుకొనవలసి యున్నది.

సాధారణముగా మరింత ఉన్నతమైనదని భావింపబడు వేరొక ఆరాధనా పద్ధతి తనకు నచ్చిన దేవునిగాని, దేవతనుగాని పొగడుచు బృందగానము చేయుట, రాత్రులందు జనులు జట్లుగా గుమిగూడి ప్రశాంత వాతావరణమును చెదరగొట్టుచు,

గొంతులెత్తి బృందగానము చేతురు. వారావిధముగా తాము భగవంతుని పవిత్ర నామము వీలైనంత మంది చెవుల కెక్కించుట అనెడి పవిత్ర ధర్మము నిర్వర్తించుచున్న వారమని భావింతురు. ఇంతేకాదు కొన్ని సమయములందు శబ్ధప్రసారము కొరకు దూరశ్రవణ యంత్రములను గూడ వాడుదురు.

దినమంతయు కష్టించుటచే అలసియో, జబ్బుచే బాధ పడుచుండియో కలతలేని విశ్రాంతి కాంక్షించువారికి కలిగెడి అసౌఖ్య, అసౌకర్యములు కూడ వీరు లెక్కచేయరు. అట్లే ప్రశాంత నిశాసమయములలో భగవద్ధ్యానము ఆచరించు వారికి కూడ తీవ్రతరమగు కలతను కల్గింపవచ్చును. మీదు మిక్కిలి నేడు సామాన్యముగా అనుసరించు విజ్ఞానము ఆధ్యాత్మిక ప్రగతి కంతగా తోడుపడదు. అందుచే దానివలన వాస్తవిక ప్రయోజనమును లేదు. సంకీర్తకుల గానమును వ్యాధిగ్రస్తుని మూల్గులకు చక్కగా పోల్చదగును. ఆ మూల్గుల వలన తాత్కాలికముగా అతడు ఊరడి చెందవచ్చునేగాని నిజముగా బాధా విముక్తి చెందలేడు. గాన మాధుర్యము యొక్క ప్రభావమునకు ముగ్ధులగుటతప్ప ఈ గానము కూడ సంకీర్తకులకు నిరుపయోగమే. అది అప్పటికి మాత్రము వారి ఆలోచనలు అరికట్టుటలో సహాయపడును. తాత్కాలికముగా ఆశయ ప్రాప్తి పొందినట్లనిపించును. అట్టి మన ఆలోచనల వలన అంతరంగమున స్పందనములు పుట్టును. ఈ స్పందనములు వృద్ధి చెందునప్పుడు అవి శక్తిని సృష్టించును. ఆ శక్తి

శబ్దముతో గూడి బయటు కురుకును. ఈ స్పందనములు వ్యక్తుల ఆలోచనానుభూతుల ప్రభావమును మోసుకొని వచ్చును. అందుచే అపవిత్ర మనస్కుల దుష్ప్రభావములచే నిష్కల్మష మనస్కుల పవిత్ర ప్రభావము కలుషితమయి పోవచ్చును.

కావున, ఇట్టి కార్యములందు పరిపూర్ణలాభము పొంద వలెనన్న దుష్ట వ్యక్తులను దూరమందుంచవలెను. చైతన్య మహాప్రభువనుసరించిన పద్ధతి అట్టిదే. అతడు మంచితనమును, భక్తి భావమును కలవారుగా తాను పూర్తిగా ఎరిగిన వారి తోడనే సంకీర్తనలు జరిపించెడివారు. సంకీర్తనలు తలుపులు మూసివైచిన మందిరములందే జరుగుచుండెడివి. బయటువారికి ప్రవేశము లేదు. నిజముగా సంకీర్తనలు ప్రాథమిక పురోగతి సాధనములు కావు. కొంత పురోగతి సాధించిన పిమ్మట, అదియును కొలదిగా మాత్రమే ఉపయోగపడును.

భక్తి భావము పొంగి పొరలు సానుకూల వాతావరణమునందు జరిపినప్పుడే సంకీర్తన అత్యంత ఫలదాయకము. తీవ్ర మానసిక సాధనానంతరము అది ఆహ్లాదకారిగా కూడ పనిచేయవచ్చును. దురదృష్టవశాత్తు ఈనాడు ఈ పద్ధతులనుస రించుటలో దృష్టియందు నిలిపిన లక్ష్యము కూడ మహోన్నత మైనది కాదు. చాల సందర్భములలో ఆరాధకులు భౌతిక రూపము దాల్చియున్న దేవుళ్ళను గూర్చిన భావముల తోడనే సదా సన్నిహిత సంబంధము గలిగియుందురు. ఆ దేవుళ్ళ

స్థూల శరీరములు, కార్యకలాపముల మీదనే వారి దృష్టి. ఈ స్థూల దృష్టి వలని ఫలితము సాధనలో వీరు సర్వదా గ్రహించుచు పోయెడి ఆంతరంగిక సాంద్రతయును, జడత్వమే గాని, ఇతరముగాదు. స్థూలదృష్టి సాధకుని తప్పక బంధన పరిమితులలో ఉంచివైచును. గమ్యస్థానము చేరుటగాని, ముక్తిని పొందుటగాని ఎన్నటికిని వలనుపడదు. ఏండ్లతరబడి సాధన చేసినప్పటికినీ వారు అధమాధమస్థితినే పొందుచున్నా రనుటకు ఇదియే కారణము. జీవనావసరమగు ప్రాణ వాయువైనను లేని బురదగుంటలో సమస్తమును దొరుకునని నమ్మి వారు వెదుకుచున్నారనవచ్చును. అట్టి అడుసుగుంటనే వారు స్థిరనివాసముగా చేసికొనినారు. ముత్యములు తయారు చేయుటకు తగినంత వెలుతురు కావలెను. బంధన విముక్తి సాధించుట కొరకు మనము సల్పవలసిన కృషి దైవగుణములతో సన్నిహితముగా పొందిక గలిగి, భగవంతునితో సమగ్ర సాదృశ్యము సాధించుచు అత్యంత భారరహితమును, సూక్ష్మతమమును అగుటయే ఈ కార్య సాధనకు వలసిన ప్రమాణము వరకు తన్ను తాను ఎవడు అభివృద్ధి పరచుకొగలడో వానికే కేవలము వానికి మాత్రమే దివ్య జీవనామృతము లభించును.

# 2
# జీవిత లక్ష్యము

జీవిత సమస్యను గురించి తీవ్రముగా యోచించిన వారు మానవ సముదాయమున ఏకొద్దిమంది మాత్రమో ఉందురు. సాధారణముగా వారు సంకుచిత దృక్పథమునే గ్రహింతురు. కోరిన సౌకర్యములతో గూడిన సుఖమయ జీవితమును పొందుటే వారి ముందున్న సమస్య. అనగా సాధ్యమయినంత ప్రాధాన్యము, అత్యున్నత సౌఖ్యమును లోకమునందు గడించుటే వారి జీవితాశయము. అవి పొందగలిగినచో వారి జీవితములు జయప్రదములైనట్లును, లేనియెడల కానట్లును వారు తలంతురు. వారు గొప్ప వ్యక్తులుగా, తత్త్వవేత్తలుగా, శాస్త్రజ్ఞులుగా, రాజ్యతంత్రజ్ఞులుగా చెల్లుబడియయి, ప్రపంచ వ్యాప్త ప్రఖ్యాతిని, ఐశ్వర్యమును సంపాదింపవచ్చును గాని వారి జీవిత సమస్య మాత్రము అపరిష్కృతముగానే ఉండును. మరణమన్న కేవలము రూపపరివర్తనమే గాన ఈ సమస్య మరణముతో కూడ అంతమొందదు. మన మరుసటి జన్మ, అది ఏదైనప్పటికినీ మరణానంతరము ప్రారంభమగును. ఈ జన్మకు పూర్వము అనేక జన్మలు అనేక రూపములతో గలిగినట్లే మరణా

నంతరము పెక్కితర జన్మలు కలుగవచ్చును. జనన మరణ చక్రభ్రమణము నిరవధికముగా సాగిపోవుచుండును. మన ఎదుటనున్న సమస్య కేవలము ఈ జన్మకు పరిష్కారము కనుగొనుట గాదు. అది ముందుజన్మ లన్నిటికిని పరిష్కారము కనుగొనుట. విశాలదృష్టితో పరికించిన మహాప్రళయము వరకు గల వివిధ సమయములలో ఆత్మయొక్క వివిధ స్థూల సూక్ష్మ రూపముల అంతటికి ఈ సమస్య వ్యాపించుచున్నది. వివిధ మతావలంబకులలో చావు పుట్టుకలగూర్చి అభిప్రాయ భేదము లుండవచ్చును. కాని కేవలము సిద్ధాంతపరమగు శాస్త్రజ్ఞాన మీ ప్రశ్నను పరిష్కరింపజాలదనుట తథ్యము. ఈ కార్యము నకు ఆధ్యాత్మిక రంగమున ప్రత్యక్షానుభవము అవసరము. సూక్ష్మాతి సూక్ష్మమగు అనుభవశక్తిని పొంది భవిష్యత్తులోని వాస్తవ జీవనస్థితిని తానుగా దర్శించగలిగిన నాడు ఈ ప్రశ్న అంతరించును. ఈ నిగూఢ రహస్యమును పలువురు పలుతెర గుల విశదీకరించినను మరణానంతరమున శాశ్వతానందము పొందుటయే జీవితోద్దేశ్యమను అంశమును దాదాపు అందరు ఒప్పుకొందురు. దీనికై వారు భక్తి త్యాగ సత్ప్రవర్తనలతో జీవితము గడుపుట ముఖ్యమందురు. అట్టి జీవితము ముక్తినో, పరమశాంతినో, శాశ్వత స్వర్గానందమునో ప్రసాదించునని వారి నమ్మిక. కాని ఈ సమస్య దీనితో అంతమొందదు. అది అంతకంటెను చాలదూరము పోవును. ఈ సమస్యా పరిష్కార మన్వేషించుటకై మన అస్థిత్వము ఎక్కడ ప్రారంభ మయినదో

పరిశీలించవలయును. స్థూలాతి స్థూలరూపమున నున్న ఇప్పటి మన వ్యక్తిత్వ మాకస్మికముగాని యాదృచ్ఛికముగాని గాదు. అది యొక క్రమానుగత పరిణామ ఫలితము. ప్రత్యేకత్వము, స్వాభావిక స్వరూపముతో ఆత్మయొక్క ఉనికిని సృష్ట్యాది వరకు గుర్తించ వీలగును. సూక్ష్మాతి సూక్ష్మమగు ప్రాథమిక స్థితియందలి ఉనికినుండి ఆత్మ స్థూలాతి స్థూల స్వరూపములతో గూడిన ఉనికివరకు వచ్చినది. వీటిని ఆత్మను చుట్టుకొని ఉన్న పొరలని అనవచ్చును. తొట్టతొలిపొరలు బహు సూక్ష్మమైనవి. వీటితో మనము మన స్వదేశమగు భగవద్రాజ్యమున ఉంటిమి. అహంకార మనెడి పొరలు మరి మరి చేరుచు వచ్చెను. అనంతరము అపరిష్కృత రూపమున నున్న మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారములు అనునవి మన స్థౌల్యమును వృద్ధి పొందించ దొడగెను క్రమేణ సంస్కారము లేర్పడుచు వచ్చెను. అవి వాటి ఫలితముల చూపసాగెను. సద్గుణ దుర్గుణములు పొడసూపెను. మెల్లగా మన ఉనికి సాంద్ర స్వరూపమును దాల్చెను. సంస్కారముల ప్రభావమున సుఖ, దుఃఖ, కష్ట సౌఖ్యానుభూతు లుత్పత్తిల్లెను. మన సుఖ సౌఖ్య ప్రీతులు, కష్ట దుఃఖ నిరసనలు మరిన్ని చిక్కుల సృష్టించినవి. మనము సాధారణముగా బాధా కష్టములచే చుట్టబడియుందుము. వీటి నుండి వెలికి వచ్చుటే మన ప్రధాన లక్ష్యమని తలంతుము. ఇది ఈ సమస్యను కడు సంకుచిత దృష్టితో చూచుట.

ప్రాపంచిక దృష్టితో గ్రహించు జీవితోద్దేశములు అర్థ

రహితములు. బాధలు, దుఃఖములు కేవలము రోగలక్షణములే అని, రోగము వేరు చో టెచ్చటో ఉండునని మనము విస్మరింతుము. భగవంతుని మెప్పించి ప్రాపంచిక సౌఖ్యములను, లాభములను సంపాదించుటకై భక్తి పాటించుట కేవలము హాస్యాస్పదము. మన ముందున్న సమస్య బాధా దుఃఖముల నుండి తప్పించుకొనుటయే కాదు. బాధా దుఃఖములకు అసలు కారణమయిన సంస్కార బంధనములనుండి విమోచనము పొందుట. సంస్కార బంధనము నుండి విడుదల పొందుటే మోక్షము. అది సద్గతికంటె భిన్నమయినది. సద్గతి పునర్జన్మ క్రమము యొక్క అంతముకాదు. అది ఈ భ్రమణము నందొక తాత్కాలిక విరామము మాత్రమే. అది కొంతకాలము వరకే ఉండెడి జనన మరణ క్రమము నందలి అల్ప విరామము. దానితర్వాత మనము మరల భౌతికరూపము ధరింతుము. మనము మోక్షమును పొందిననే కాని అనంతమగు పునర్జన్మ వృత్తము విచ్ఛేదము కాదు. అది మన సమస్త బాధలు, దుఃఖముల పరిసమాప్తి. దానికంటె సాధించవలసిన దెంతయో గలదు. మోక్షమునకంటె తక్కువయిన దేదియు మన గమ్యముగా గైకొన వీలులేదు. అట్టి మోక్షమునైనను జీవిత చరమ గమ్యముగా గల వారిని మనము కొలదిమందిని మాత్రమే కందుము. ఈ గమ్యము అధ్యాత్మిక పురోగమనము నందు ప్రథమ సోపానము మాత్రమే. ఈ దశకంటె మనము క్రింద నున్నచో జీవితసమస్య ఏమాత్రము పరిష్కారము కాకుం

డును. మోక్షము వలదనువారు కొందరున్నారు. మరల మరల ఈ భూమిపై పుట్టి భక్తి పాటించుటే వారభిలషింతురు. వారి జీవిత లక్ష్య మనిశ్చితము, అనిర్దిష్టమును. భక్తి తప్ప భక్త్యతీత మైన దేదియు వారు తమ లక్ష్యము కాదందురు. వాస్తవముగా వారు భక్తుని స్థితికి సంబంధించిన సమ్మోహక ప్రభావముచే అకర్షితులయి పోయి, అట్టి స్థితియందు కలకాలము చిక్కు పడి యుండ ఇచ్ఛగింతురు. తమ తృప్తికొరకే వారట్లు చేయు దురు. చిక్కులలో తగులుకొని ఉన్నంతకాలము శాశ్వత బంధమునుండి విడుదల పొందుట అసంభవము. బంధన విముక్తియే ఆత్మయొక్క సహజ వాంఛ. బంధనముల నుండి తన్ను తాను విడిపించుకొన ఇష్టపడని వానికి పరిష్కారము లేదు.

భక్తి లక్ష్యసాధనకు మార్గము; అదియే లక్ష్యము కాదు. నేను పైన చెప్పినట్లు వారు ప్రాథమిక స్థితియొక్క సమ్మోహక ప్రభావమునకు ముగ్ధులయి ఎన్నడును దానినుండి దూరమగుటకు అభిలషింపరు. వారు గైకొన్న సంకుచిత దృక్పథము వారి విశాలదృష్టిని అడ్డగించును. అంతకంటె అతీతమైన దేదియు వారి కంటికి ఆనదు. ఏదో ఒక ప్రత్యేకోద్దే శ్యముతో భక్తి అవలంబించినచో అది నిష్కామభక్తి కాదు అనెడి నిర్హేతుక వాద మొకటి పై దృక్పథమునకు ఆధారముగా ఒసగబడుచున్నది. భగవద్గీతలో నున్న నిష్కామోపాసనా సిద్ధాంతము ప్రత్యేకోద్దేశ్యము దృష్టిలో ఉంచుకొనక భక్తిని

అవలంబించవలెనని ఉద్బోధించుచున్నది. ఏదేని ప్రాపంచిక వస్తువు మీదనో, లౌకిక కాంక్షాప్రాప్తి మీదనో దృష్టి నిలుపక భక్తిసాధన సాగించవలెనని దాని అర్థము. అంతేకాని జీవితలక్ష్యముపై మనస్సు లగ్నము చేయుట నది అటంక పరచదు.

పురోగాములగు వారి కది అత్యంతావశ్యకము. జీవితలక్ష్య మనగా మనము చేరవలసిన అంతిమ స్థానమేగాని ఇతరము గాదు. వేరుమాటలతో చెప్పవలెనన్న అది మన మాతృభూమి యొక్క పూర్వస్మృతి. లేదా, మనము చిట్టచివరకు చేరుకోవలసి నట్టి ఇప్పటి స్థూల అస్తిత్వముయొక్క ఆదిమ స్థితి. మనము గమ్యస్థానమును గుఱించిన భావమునే మనస్సునందు సజీవముగా ఉంచుకొందుము. దానికై భక్తిని విధ్యుక్త ధర్మముగా మాత్రమే సాధన చేతుము. ధర్మాచరణము ధర్మముకొరకే అనునది నిస్సంశయముగా నిష్కామ కర్మ. మన జీవిత లక్ష్యమును అవగాహన చేసికొనుట మన విధ్యుక్త ధర్మము.

నే నిపుడు మన జీవితలక్ష్యము ఏదై ఉండవలెనను అంశమునకు వత్తును. లక్ష్యము మహోన్నతమైనదై యుండవలె ననుట సాధారణముగా నంగీకరించబడిన విషయము. లేకున్నచో అంతిమస్థితి వరకూ పురోగమించుట సందేహాస్పదము. అందువలన మానవ సాధ్యమగు మహోన్నతస్థితి ఏదో దానిని గూర్చిన సుస్పష్టభావన యుండుట అవసరము. దివ్యావతారములగు రామ,కృష్ణుల దృష్టాంతములు మనఎదుట

ఉన్నవి. భక్తి విశ్వాసములతో వారి నారాధించి మనము వారితో ఐక్యము పొంద గోరుదుము. అప్రయత్నముగా అదియే మన జీవిత లక్ష్యమైపోవును. మన మెంత పురోగతి సాధించినను వారి స్థితివరకు మాత్రమే చేరగలము. అవతార పురుషులు రామ, కృష్ణులు ప్రకృతి ఆదేశానుసారము ప్రకృతి కార్యముల నిర్వహించుటకై అతీత శక్తులను గలిగిన విశిష్ట మూర్తులై అవతరించినవారు.

వివిధ ప్రకృతి శక్తులపై వారికి సంపూర్ణాధికార ముండినది. వారెప్పుడైనను వారికి సబబు అని తోచినరీతి వాటి నుప యోగించగలిగి యుండిరి. వారు నెరవేర్చవలసిన పని తీరున కనుగుణముగా వారి కార్యకలాపములు పరిమితమై ఉండెడివి. వారు మహామాయ అను పరిధినుండి అవతరించిరి. అది సూక్ష్మరూపమైన దివ్యశక్తితో కూడిన స్థితి. కావున అది మహోత్కృష్ట శక్తి సమన్వితము. అందుమూలముననే వారి జీవితకాలమున వారి కర్తృత్వము ద్వారా మహోత్కృష్ట ఫలితములు అనుభూతము లయ్యెను మానవ సాధ్యమగు మహోన్నత స్థితి మహామాయ స్థితి కంటె మిక్కిలి అతీత మైనది. అందుచే అది ఆస్థితి కంటె మహోన్నతమైనది. పెక్కు మంది పాఠకుల కిది ఆశ్చర్యజనకము కావచ్చునుగాని ఇది సందేహాతీతమగు సత్యము.

ఎచ్చోటు అన్నిరకముల శక్తులు, బలము, క్రియా శీలత, ఉత్తేజము కూడ పొడసూపకుండి సంపూర్ణ శూన్య స్థితి


యందు మనుష్యుడు ప్రవేశించునో అదియే చేరదగిన లేదా సాధింపగలిగిన జీవిత లక్ష్యము. దీనిని ఒక పటమురూపమున విశదీకరింప చూచితిని. "సి" (C) కేంద్రముగా రచించిన ఏక కేంద్ర వృత్తములు రమారమి మన పురోగమనమునందు దాటునట్టి వివిధ ఆధ్యాత్మిక స్థితులను తెలుపును. అత్యంత బాహ్యావృత్తము నుండి మన పయన మారంభించి తదనంతర దశ ప్రాప్తించుటకు ప్రతివృత్తమును దాటుచు కేంద్రము వైపు పోవుదుము ఇది అత్యంత విస్తారమైనది. నేను మోక్షమును గూర్చి ప్రస్తావించినచో అది అత్యంత దూరస్థమనియు, పెక్కుజన్మలు విడువని పట్టుదలతో ప్రయత్నములతో గాని పొందరానిదనియు ప్రజ లూహింతురు. పటములో మోక్షస్థితి రెండవ, మూడవ వృత్తముల మధ్య నున్నది. మోక్షసాధనకే మనము దాటవలసిన వివిధ స్థితులను దాదాపు ఒకటిన్నర వృత్తములలో సాధించనగును. మోక్షము తేలికగా

---

(చూ. ప్రక్క పుటలోని పటము.)

మోక్ష యాత్ర

1. Centre = కేంద్రము.
2. Central Region = కేంద్రప్రాంతము.
   Seven Rings of Splendour=ఏడు ప్రకాశవృత్తములు.
3. Stages of Egoism = అహంకార దశలు.
   Eleven Circles = పదునొకండు వృత్తములు.
4. Stages of Maya = మాయయొక్క దశలు.
   Five Circles = అయిదు వృత్తములు.


centre
central region
(seven rings of splendour)
stages of egoism
(eleven circles)
stages of maya
(five circles)

(4)

సాధించదగినది కాదని, సాధారణముగా నమ్మెదురు. కాని పైన చెప్పిన దానినిబట్టి మోక్షస్థితి వరకు వచ్చిన పిమ్మట ఇంకను సాధించవలసినది యెంత యున్నదో రమారమిగా తెలియవచ్చును.

మోక్షస్థితిని పొందిన తరువాత ఇతర వృత్తములు దాటుచు మనము ఐదవ వృత్తమువరకు పోవుదుము. ఇవి అవ్యక్తగతి యను దశ. ఈ దశయందు మానవుడు మాయా పరిమితులనుండి సంపూర్ణముగా ముక్తుడై ఉండును. ఈ స్థితి వరకు పూర్వకాల మహర్షులలో కొలదిమంది మాత్రమే పోగలిగిరి. వారిలో జనకమహారాజొకడు. అతడు సాధించిన స్థితి ఎంత గొప్పదిగా భావింపబడెననగా ఆ కాలపు ప్రముఖ మహర్షులు కూడా తమ పుత్రులను, శిష్యులను జనకు నొద్దకు శిక్షణకొరకు పంపుచుండిరి. నా రచించిన "రాజయోగ ప్రభావము" అను పుస్తకమున వర్ణించినట్లు ఇప్పుడు హృదయ మండలము దాటితిమి. ఐదవ వృత్తము దాటి మహామండలమున ప్రవేశింతుము.

దాని తర్వాతి పదునొకండు వృత్తములు అహంకారపు వివిధ దశలను తెలియజేయును. అచ్చటి స్థితి అతి సూక్ష్మముగా నుండును. మనము ఆ మండలములో పురోగమించిన కొలది అది సూక్ష్మాతిసూక్ష్మ మగును. పదునారవ వృత్తము చేరుసరికి మనము అహంకారమునుండి చాలవరకు విముక్తుల మగుదుము. ఈ దశయందలి స్థితి ఇంచుమించు దుర్గ్రాహ్యము.

మహర్షులలో మహోన్నతులగు వారి యందుకూడ ఈ స్థితి నందుకొన్నవా రరుదు. నా దృష్టిలో పూర్వకాల మహర్షులలో కబీరు తప్ప ఈ దశ (16వ వృత్తము) వరకు పురోగమించినవారు లేరు. ఈ 16వ వృత్తము కూడ అధిగమించిన మీదట మిగిలియుండునది కేవలము స జ్ఞాలేశము మాత్రమే. అందునను జడత్వ లేశమున్నది. అదియును స్థూలరూపమే. మన మిప్పుడు కేంద్రమండలము ప్రవేశింతుము. అచ్చట ఏడు వృత్తములు కానవచ్చును.

వాటిని భావప్రకటన కొరకు వెలుగని పిలుతుము. మన పురోగమనమున వీటినికూడ అధిగమింతుము. నేనుచెప్పిన స్థూలరూపముతో కూడిన స్థితి సాధ్యమైనంత చివరి పరిమితి వరకు సూక్ష్మతరమగుచు పోవును. కేంద్రమునకు అత్యంత సన్నిహితమైన స్థానము మన మిపుడు సాధించితిమి. ఇది మానవ సాధ్యమగు మహోన్నత స్థితి ఇచ్చట మనము వాస్తవ స్థితిలో సన్నిహితమైన పొందికను గలిగియుందుము. ఆత్మకును, భగవంతునకును మధ్య నామమాత్ర భేదము యుండవలసి యున్నది. కాన, కేంద్రముతో సంపూర్ణ సమైక్యము సాధ్యము కాదు. మానవ సాధ్యమగు ఆధ్యాత్మికోన్నతి యొక్క పరిమితి యిది. కనుక సాక్షాత్కార మార్గమున అత్యంతోన్నత ప్రగతి సాధించగోరి నతడు తొట్టతొలి నుండియు గమ్యముపై దృష్టి నిలుపవలెను.

ప్రపంచములోని మహర్షులు, యోగులందు ఏ కొద్దిమందికి కూడ దానిని గూర్చిన భావన లేదు. అనేక సందర్భములలో వారి పురోగతి ఎంతైనప్పటికినీ రెండవ, మూడవ వృత్తము వరకే. ఇంత ప్రాథమిక దశయందుండి గూడ వారు కొన్ని యెడల తాము సాధించిన పురోగతి చాల గొప్పదని భావించుట దురదృష్టకరము. తత్వవేత్తలని పిలువబడును. బహిః స్వరూప సౌందర్యముల చూచి మోసపోవు మూర్ఖ జనులచే పరిపూర్ణత పొందిన వారుగా గౌరవింపబడుచున్న కొందరి స్థితిని చక్కగా నిర్ణయించుటకు వీలగుటకే నే నిది అంతయు చెప్పితిని.

3

# మార్గములు - సాధనములు

మన లక్ష్యమును నిర్ణయించుకొన్న తరువాత దానిని అనుభవమున సాధించుటకు సాధనోపాయములను కనుగొనుట అనంతర సమస్య. మహాత్ములు, బోధకులు ఈ విషయమును కూలంకషముగా చర్చించియున్నారు. వారు అనేక విధములైన సాధనలను నిబంధించియున్నారు. ఇవి వారు నిర్ణయించిన అంతిమ లక్ష్యము సాధించుటలో సహాయకారులు. కాని, పరబ్రహ్మ స్వరూపుడగు భగవంతుని పొందుటకు మనము ఉపయోగించు సాధనోపాయములు సంపూర్ణలయ అవస్థకు కొనిపోవునవియై యుండవలెను. వెనుకటి అధ్యాయములో చర్చించినట్లుగా అతిక్రియాశీల కేంద్రము లేక శూన్యమునకు మనము అత్యంత సన్నిహితముగా ఉండు చరమదశయే మన జీవిత లక్ష్యము. సర్వసృష్టికి మూలకారణము. అంటే మహాప్రళయమున సర్వమును లీనమగుచున్నది. ఈ స్థితి ప్రాప్తించుటకు మనము కూడ శూన్యులము కావలెను. మహాప్రళయకాలమున సహజరీతినే మన మీ స్థితిని పొందుట నిస్సంశయము. కాని, మనము ప్రయత్నించమన దేమన దానిని

ప్తిలైనంత త్వరితముగా పొంది, దుఃఖపూరితములగు పెక్కు జన్మలనుండి తప్పించుకొనుటకు.

సమస్తమును సృష్టి కేంద్రమునకు మరలి పోవుటకు మహాప్రళయ మెట్లావశ్యకమో, అట్లే ఆ స్థితిని పొందుటకు మనము మన ప్రళయమును అనగా స్వయంకృతములగు సమస్త సంస్కారములను సంక్షయము కావించుట సాధించి తీరవలెను. అనగా మన సంకుచితముల నుండి ముక్తిని పొంది, సృష్టికాలమున ఏ స్వాభావిక స్థితి యందుంటిమో, అదే స్థితిని గైకొనవలెను. మన సంకుచితములు సంస్కారముల యొక్కయు, పలు తెరగుల పొరలయొక్కయు ప్రోగు. సంస్కారముల వలన చిక్కులు కలుగుచున్నవి. ఆత్మ నావరించుకొన్న పొరలు క్రియా చింతనల ఫలితములు. మనకు నిశితమైన మనోబుద్ధి కుశలత లున్నవి. మన శారీరక చర్యలను మనస్సు నిర్ణయించును. మనము వస్తువులను చూచి, విని, తాకి అవగాహన చేసుకోగలము. వాటిని ప్రేమింతుము, లేక నిరసింతుము. క్రమముగా వాంఛలు ప్రవేశించి మన కర్మలను ప్రభావితము చేయును. ఈ వలయములు గుణితములగుచు పోవును. వాంఛా పరితృప్తికై మనము శ్రమింతుము. పరితృప్తమైన వాంఛ మరొకదానికి తావొసగును. క్షణకాలమేని వాటినుండి మనము విడుదల పొందలేము. వాటిని పొందవలెనను దృష్టితోడనే మనము పెక్కు వస్తువులను చూతుము.

ఈ కోర్కెలు మానసిక, శారీరక కర్మలను తీర్చి దిద్ది సంస్కార నిర్మాణమునకు దారి తీయుచున్నవి. అట్లు ఆత్మను అధికాధికముగా పొర లావరించుచున్నవి. అనుక్షణము క్రొత్త కోరికలును, వాటిని తీర్చుటకు మన ప్రయత్నములును ఎడ తెగని బంధనములు కల్గించును. అనుభవించుట ద్వారా వాటిని నిర్మూలించువరకు కారణ శరీరముపై వాటి గుర్తు లుండును. అనుక్షణము ఏర్పడునట్టి సంస్కారము లన్నింటిని అనుభ వించుట ద్వారా సమాప్తము చేయుట జీవితకాల మంతటను కూడ సాధారణముగా సాధ్యము కాదు. ఇట్లు మన జన్మాంత మున మనలో పెక్కు సంస్కారములు పోవై యుండును. ఈ సంస్కారములే పునర్జన్మకు కారణమగుచున్నవి. అవి మనకు వాటి భోగమునకు ఇట్లవకాశము కల్పించుచున్నవి. కాని, దురదృష్టవశమున, సమసిన వాటికంటె ఎక్కువగా క్రొత్తవి చేర్చుకొందుము.

బాధలు, దుఃఖముల వలన మన మార్గమున వేరొక తీవ్ర ప్రతిబంధక మేర్పడుచున్నది. ప్రపంచమందు దాదాపు ప్రతి ఒక్కడును తన నెదుర్కొను నట్టియు, తాను పోగొట్టు కొన గోరునట్టియు దుఃఖముల గూర్చి మొరలిడును. కాని, అతడు సరియైన సాధనోపాయములను ఉపేక్షించును. వాంఛా పరిపూర్తియే దుఃఖముల తొలగించు మార్గమని తల చును. కాని అవి అట్లు పరిష్కారము కావు. సాధారణముగా దుఃఖములను అవాంఛనీయములుగా భావింతురు. కానీ,

దుఃఖములను స్వయముగా కోరుకున్న మహర్షులును ఉన్నారు. వారు వాటిని వరములుగా తలచి వాటికొరకై పలుమారులు భగవంతుని ప్రార్థించియున్నారు. మనము దుఃఖమూలము నన్వేషించినచో ఈ సమస్యయొక్క అసలు రహస్యము విశద మగును. సృష్టికార్యము కొరకు భగవత్సంకల్పము వలన ఆత్మకు ఎరుక గలదు. అట్లే, ఆత్మయును తన చిన్న సృష్టి నారంభించి, తనచుట్టు తాను సృష్టించిన వస్తుసముదాయమును చేర్చుకొన్నది. ఒక చలనము, ఒక క్షోభ ఇవే సృష్టికార్యము నకు ప్రధానమైనవి. అదేరీతిని ఆత్మయొక్క చిన్న సృష్టికీ కూడ కలత, క్షోభ కావలసి యున్నవి. మనకు సంకల్పబలము కూడా కలదు. ఈ సృష్టికార్యము నిర్వహించవలసిన అంగము లకు శక్తి నిచ్చుటకు దీనిని వినియోగింతుము. అవి మన ఎదుట సుఖదుఃఖములు, సౌఖ్యాసౌఖ్యముల రూపమున కాన్పించును. మనస్సుకూడ ఎల్లప్పుడును చురుకుగా ఉన్నందున మనలో ఒక వస్తువుపై ప్రీతిని, వేరొక దానిపై నిరసన భావ మును పుట్టించును. అట్లది తీవ్రవ్యతిరేక భావముల చొప్పించు చున్నది. ఈ రీతిని దుఃఖములు పుట్టుచున్నవి. ఇది అంతయు మానవుని మనస్సుచే సృష్టింపబడినది. అది వివిధ విషయముల యొక్క సముచిత సంబంధముల గూర్చి జ్ఞానము లేకపోవు టచే కలుగుచున్నది మన మోహములు, ఉద్రేకములు, ఉద్వేగ ములు కూడ మన విపత్తులను పెంపు చేయుటలో దోహద కారులై, కొన్నివేళల సర్వవినాశన సమర్థమగు భయంకరమైన

తుఫాను రేపుచున్నవి. వానికి మనము సాధారణముగా పరిస్థితులే కారణమనుచున్నాము. కాని, అది దురభిప్రాయము. బాహ్యరూపమగు మానవ శరీరమునకు మనస్సే కేంద్రము. శరీరము ద్వారా ప్రదర్శింపబడునది ప్రతి యొక్కటియును కేంద్రమగు మనస్సునుండి బయల్వెడలును. మన మనస్సు సమభావ స్థితికి వచ్చినచో పరిస్థితులు గాని, పరిసరములు గాని, దానిపై నెట్టి ప్రభావమును కల్గింపజాలవు. అంతరంగమున అలజడి ఉండదు.

అన్ని పరిస్థితులందును అంతటను శాంతి, నిశ్చలతలు నెలకొని ఉండును. మోహములు, ఉద్రేకములు, వాంఛలు వాటి తీవ్రతను కోల్పోవును. దుఃఖసంతోష మనోవ్యాకులతలు అదృశ్యము లగును. కోర్కెలే దుఃఖమునకు మూల కారణము. కాన, కోరికల తెగనాడుటే దుఃఖ పరిష్కార మార్గము. కోరిక లెంత తగ్గిన దుఃఖము లంత తగ్గును. అయినను కోరిక లేకుండుట అన్నది మరొక సమస్య. కోరికలు ఒక వలగా అల్లుకొనును. దానిలో మనము చిక్కువడియుందుము. అందుండి బయటపడుటకు మన మెంత తీవ్రముగా ప్రయత్నింతుమో అంత బిగువుగా వలత్రాళ్ళు మనలను పెనవైచుకొని పోవును. ఈ చిక్కులనుండి మనదృష్టి మరల్చి నిజమైన సత్యపదార్థముపై దృష్టి నిలుపు టొక్కటే మనము వాటినుండి విడుదలపొందుటకు మార్గము. వాటిఎడల

నిర్లక్ష్యభావము నలవరుచుకొన్నచో అవి మన దృష్టినుండి త్వరలో మాయమగుట కారంభించును. తత్ఫలితముగా మన దుఃఖములు తగ్గిపోవును. సత్యము మాత్రమే స్థిరముగా మన దృష్టియందు నిలిచి యుండును. మిగిలిన వన్నియు వాటి ఆక ర్షణను, ప్రాధాన్యమును కోల్పోవును.

జీవితములో బాధలు, కష్టములు బొత్తిగా లేకుండు టన్నది అసంభవము, అసహజము. వాస్తవముగా అవి మనకు మేలు చేకూర్చుట కొరకే ఉద్దేశింపబడినవి. అవి రోగి నారోగ్య వంతు నొనర్చుటకై యిచ్చు చేదుమాత్రల వంటివి. అత్యు త్తమ వస్తువునైనను దుర్వినియోగ పరచిన ముప్పు గల్గును. కష్టముల విషయమున కూడ అంతే. సక్రమ ముగా వినియోగపరచుకొన్నచో ఏదియైనను తుదకు సత్ఫలి తముల నిచ్చును. కష్టములు వాస్తవముగా మనకు మార్గ దర్శకములు. అవి మనదారిని సుగమము చేయును. సామాన్య జీవనము నెరపు మనుజుని పురోభివృద్ధికి కష్టము లెంతో సహాయకములు. సాంసారిక బాధలు, ప్రాపంచిక కష్టముల గూర్చి మా గురువర్యు లిట్లనెడివారు: "ఓర్పు, సహనములకు మన గృహమే శిక్షణారంగము. గృహస్థ జీవనములోని ఒడి దుడుకులను ప్రశాంతముగా సహించుటే మన విషయమున మహోన్నతమగు తపస్సు. అదే మిగిలిన తపశ్చర్య లన్నిటి కంటె మహోదారమైనది, కావున, ఈ పరిస్థితులలో మనము చేయవలసిన దేమనగా కోప దుఃఖ భావములకు లొంగక తప్పు

మన యందే యున్నదని భావించి, ప్రశాంత చిత్తముతో వాటిని భరించి తీరవలెననెడి వినమ్రవైఖరిని పూనుటయే అడవిలో ఏకాకిగా జీవించుట, ప్రపంచ వ్యవహారములతో సంబంధము లేకుండుట కొందరికి ఓర్పు సహన గుణ సాధక మార్గములు కావచ్చును. కాని మనకు స్నేహితులు బంధువులు ఖండన దూషణములే మహోన్నతమగు తపస్సు, విజయసాధనకు సూటి మార్గము కూడ!! నిజమునకు బాధలను, కష్టములను నెమ్మదిగా సహించుటయే మనము బాగుపడుటకు చాల తోడ్పడును. కావున అవి మన పురోగతికి విలువైన సహాయకారులు. వాటిని దుర్వినియోగపరచుటవలననే మనము వాటి ఫలితములను నాశనము చేసి మేలైన సదుపాయములను పోగొట్టుకొందుము.

వైరాగ్యము లేక అనాసక్తి సాక్షాత్కార మార్గమున నిస్సంశయముగా నొకముఖ్యదశ. వైరాగ్యము అలవరచుకొనకున్నచో మాయాజాలమునుండి తప్పించుకొనజాలము. కాని అంత మాత్రాన గృహము తోడను, కుటుంబముతోడను, లోక వ్యవహారముల తోడను తెగతెంపులుచేసికొని సన్యాస జీవనము గైకొనవలెననిగాదు. గృహము కుటుంబము విడిచి ప్రాపంచిక బంధములు త్రెంచుకొని ఏకాంతస్థలమున కేగుటయే వైరాగ్య సాధనోపాయ మను వారితో నేనేకీభవించును. అట్టి నిర్బంధ మార్గమున సాధించిన వైరాగ్యము యదార్థము కాజాలదు. ఏలయన, ప్రపంచముతో బాహ్యసంబంధములు బలవంతముగా

త్రెంచుకొన్నను వారాంతరంగికముగా ఇంకను దాని నంటి పెట్టుకొని ఉందురు. గృహస్థులమగు మనము నిస్సందేహముగా ననేక విషయములను గమనించవలసియుండును. మన కుటుంబ మును పోషించవలెను మన పిల్లల చదువునకు ఏర్పాట్లు చేయ వలెను. వారి అవసరములు, అవశ్యకములను గమనించవలెను. మనము వారిని శీతోష్ణముల నుండి, రోగము, కష్టముల నుండియు కాపాడవలెను. ఇవిగాక ఇటువంటి వింకెన్నియో. ఇట్టి అవసరములకొరకు డబ్బును, ఆస్తిని గడింతుము, దగ్గరుంచు కొందుము. కాని మన సంపదలపై తగిన వ్యామోహము పెంచుకొనుటే నిజమైన కీడు ఇదియే మన బాధలకు ముఖ్య కారణము. ఆకర్షణ వికర్షణ భావము లేవియు లేక జీవి తములో ప్రతి కార్యమును మనధర్మమని తలచి చేయగలిగి యున్నచో మనమొక విధముగా ప్రాపంచిక బంధముల నుండి విడుదల పొందినట్లే. మనము పెక్కు వస్తువులను కూడబెట్టి వాడుకొనుచుండినను లోకమును పరిత్యజించినట్లే. అప్పుడు మనయొద్ద నున్న ప్రతి ఒక్కటియు మన ధర్మములు నిర్వర్తిం చుటకై సర్వేశ్వరుడిచ్చినట్టి ఒకపవిత్రనిధి అనిపించును. వైరాగ్య మనగా ప్రాపంచిక వస్తువులపై వ్యామోహము లేకుండుటే గాని, వస్తువులను కలిగి యుండక పోవుటకాదు. గృహస్థ జీవి తమున సంపదలు ప్రాపంచిక బంధనములు అనివార్యములు. కాని ప్రాపంచిక వస్తువులతో తగిన రీతిని వ్యామోహము పెంచుకొనకుండినచో అట్టి జీవితము వైరాగ్యమునకు ప్రతి

బంధకముకాదు. అందువలన సాక్షాత్కారమునకు కూడ అది ప్రతిబంధకముకాదు. జీవితకాలమంతయు గృహస్థ జీవితమును గడుపుచునే పరిపూర్ణత్వమును పొందిన మహాత్ముల దృష్టాంతములు పెక్కుగలవు. వైరాగ్యమనునది నిజముగా మనస్సు యొక్క అంతర్గత-స్థితి. అది వస్తువుల క్షణభంగురతో పరివర్తనశీలతలను మన దృష్టికి తెచ్చి, వాటిపై నిర్వ్యామోహభావము కల్గించును. విరాగియగువాని దృష్టి పరివర్తన రహితమును, శాశ్వతమును అగు సత్యము మీదనే సదాలగ్నమై యుండును. అతడు ఆకర్షణ, వికర్షణ భావముల నుండి విముక్తుడు. వైరాగ్యమనగా నిదియే. మానసికముగా మన మిట్టి స్థితిని పొందినపుడు కోరికలనుండి విముక్తి పొందినవారమగుదుము. ఉన్నదానితో మనము తృప్తి పొందుదుము. కోరిక లంతమొందుటతో సంస్కారము లేర్పడుట నిలిచి పోవును. మన జీవితకాలములో పూర్వ సంచిత సంస్కారము లనుభవించుటే ఇక మిగిలియున్నది. మన కోరికల వలనను, కర్మల వలనను కలిగిన సంస్కారములను కారణ శరీరము నుండి నశింపచేయుటకు వలసిన భోగభూమిని సృష్టించి ప్రకృతికూడ ఈ కార్యమునందు మనకు చేయూత నిచ్చుచున్నది. ఈ పొరలు తొలగిపోయినప్పుడు మనము సూక్ష్మతరమగు స్థితులను పొందినారంభింతుము.

క్షణమేని నిలకడలేనిది మన మనస్సు, యోచనలు, కర్మలను నియమబద్ధము చేయుటకు మనమా మనస్సు సక(

మముగా పనిచేయునట్లు చూడవలెను. మతబోధకులు మన
స్సును పరుషవాక్కులతో తూలనాడుట పలుమారులు విన్నాను.
వారు దానికి అపనామము లాపాదించి, దానిని మన బద్ధ శత్రు
వని ప్రకటింతురు. దీనికి కారణము సుస్పష్టము. మనలో ఉన్న
చెడుగున కంతటికి అదియే కారణమని వారు భావింతురు.
అందుచే దాని ఆజ్ఞలను పాటించక దాని నణగదొక్కవలయు
నని బోధింతురు. సాధారణముగా మానవులకు వివిధ మానసిక
చేష్టల నరికట్టుటగాని, దాని ఆజ్ఞలను ఉల్లంఘించుటగాని
దుష్కరముగా గోచరించును. వారి అనుభవరహితములగు ఉప
దేశములను, ఉపన్యాసములను ఈ విషయమున నిరుపయోగ
ములు. అట్టి ఉపన్యాసములు విన్నవారిలో ఏకొందరుకూడ
ఎన్నడును ప్రత్యక్షానుభవ ఫలితమును పొందజాలరైరి. అంతి
యేగాక ప్రస్తుత పరిస్థితులు, పరిసరములుకూడ ఎల్లప్పుడును
వృద్ధియగుచుండు మానసిక కార్యకలాపములకు దోహదము
చేయును. నేడు జీవితమున ప్రతి ఒక్కరును పేదఱికము రక్షణ
లేమి, బాధ, శతృత్వములనెడి తీవ్ర సమస్యల నెదుర్కొనవల
సిన జీవన పోరాటముగా భావించుచున్నారు. తత్ప్రభావము
నుండి ముక్తులగుట దుస్సాధ్యమగుచున్నది. దీని ఫలితము
నిరంతర మానసికక్షోభ, అశాంతి, వాతావరణమునుండి మనము
దీనినే ఆశ్వాసింతుము. ఈ కారణమున మనము పరిస్థితుల
చేతను, పరిసరములచేతనుదూరముగా కొంపోబడుదుము. మనసు
గాలికోడి అయిపోవును. అది ఏ దిశగా గాలి వీచిన ఆ దిశకు

మొగము చూపును. ఈ పోరాటమున ధైర్య సాహసములతో పరిస్థితుల నెదుర్కొని వాటిప్రభావమునుండి విముక్తుడైన వాడే నిజమైన ధీరుడు.

మనస్సునందే చెడుపుట్టుచున్నదనియు, ఆ మనస్సే ఆ చెడుగునకు కారణభూతమనియు చెప్పువారితో నేను నిస్సందేహముగా నేకీభవింతును. కాని ఆ మనస్సే సద్గుణములను కలిగించి, మనము మహోన్నతమగు ఆత్మానుభూతినిసాధించుటకు సాయపడుననియు జ్ఞాపకము చేయుదును. ఇట్లు దుర్గుణములేకాక సద్గుణములును మనస్సునందే ఉద్భవించుచున్నవి. అందువలన మనస్సును కఠిన వాక్కులతో తూలనాడువారియందు న్యాయము లేదు. మనస్సును అపసవ్యముగా రూపొందించుటే దీనికి కారణము. కావలసినది మనస్సును చితుకగొట్టుట కాదు. చంపుటయు గాదు. సరియగు అభ్యాసముచే దానిని చక్కబరచుకొనుటే.

మనస్సు గడియారములలోని లోలకము వంటిది. లోలకము సక్రమముగా ఆడుచున్నంతవరకు గడియారము సక్రమముగా పనిచేయును. అది క్రమము తప్పినచో గడియారము సరిగా పనిచేయదు. అట్లే గడియారమును పోలిన మానవుని మనోగతి కూడ క్రమబద్ధమొనర్పబడవలెను. మనస్సును తీర్చిదిద్ది, దాని కార్యకలాపములను క్రమబద్ధము చేయుపద్ధతులు మిక్కిలి సులువైనవే. తీరిక సమయములలో విచ్చలవిడిగా తిరుగనిచ్చి మనస్సును మనమే పాడుచేసితిమి. ఈ అలవాట్లు ఏండ్లతరబడి

సాగివచ్చినవి ఇప్పుడిది దాని స్వభావమైనది. దానిని మన మిప్పుడు అదుపాజ్ఞలలో ఉంచుకొనజూచినచో ఫలితముండదు. దానిని బలముతో మనమెంత అణచ జూతుమో అది అంత ఎక్కువగా ఎదురుతిరిగి మరింత అలజడి కలిగించును. మనము ధ్యానము చేయుటయందు ఎట్లు చేయుదుమో అట్లే మనస్సును ఒక పవిత్ర భావముపై నిలిపి అవాంఛనీయమగు దానిని, నిరుపయోగమగు దానిని అందుండి తొలగించి వేయుటయే మానసిక కార్యకలాపములను అదుపులో ఉంచుకొనుటకు అనువగు పద్ధతి. నిరంతరసాధనతో కొలది కాలము గడచిన పిమ్మట మనస్సు సుశిక్షితమును, క్రమబద్ధమును అగును. లోని కలత తొలగిపోవును. అవాంఛనీయమగు యోచనలనుండి తప్పుకొనవలెనన్నచో వాటిని పిలువని పేరంటముగా భావించి నిరాదరణ చేయుటయే అన్నిటికంటెను మేలైన మార్గము. అప్పుడవి నీరు పోయని మొక్కలవలె వాడిపోవును. చివరకు ఆ పవిత్రభావమే ప్రధానముగా నిలిచి ఉండును. దీనిని సాధించుటకు ఏకైక మార్గము సామర్థ్యము గల గురువుయొక్క మార్గదర్శకత్వమున ధ్యానాభ్యాసము చేయుటయే. నిరంతర ధ్యానాభ్యాసముచేత మనస్సు నిశ్చలమును, ప్రశాంతమును అగును. కూడిన తలపులు బాధించుట మానివేయును. ప్రారంభదశయందు సాధకులు ధ్యానసమయమున మనస్సంచారము గూర్చి పెట్టుకొనుమొరలు నేను తరచు వినుచుందును ధ్యానాభ్యాసమునందు తొలినాటినుండి

మనస్సు నిశ్చలమై యుండవలెనని వారు ఆశింతురు. వివిధ భావములు, యోచనలు మనస్సున తిరుగాడుట చూచి వారు మిక్కిలి కలతనొందెదరు. వారికి నేనొక విషయమును విశద పరచవలెను. మనస్సుయొక్క నానా విధములైన కార్యకలాప ములను చక్కదిద్దుటే మన ప్రయత్నముకాని, మనస్సును పని చేయని స్థితి యందుంచుట కాదు. అది సహజముగా పని చేయుచుండుటను ఆపగోరము. దానినొక క్రమబద్ధమును సుశిక్షితమును అగుస్థితికి కొనిపోచూతము. తొట్టతొలి నుండియు మనస్సుయొక్క పోకడలను ఆపగలిగియుండినచో మనము ధ్యానసాధన చేయవలసిన అవసరమే ఉండెడిది కాదు. పై లక్ష్యమును సాధించుటకు ధ్యానమే మార్గము. దాని సహజ ఫలితముగా అనతికాలములోనే ఏకాగ్రత సిద్ధించును. ధ్యాన కాల మందంతయు మనస్సున ప్రవేశించెడి భావములను, యోచనలను నిరాదరణ చేసి, ధ్యానము సాగించుటయే ఇందుకు తగు పద్ధతి. అవాంఛనీయ భావములను దూరముగా ఉంచుటకు జరుగు మనోగతమగు పోరాటము తరచుగా అప జయము పొందును. ఏలయన, అది బలీయమగు ప్రతి చర్యను కలిగించును. దాని నధిగమించుట సాధారణ సామర్థ్యముగల మానవునకు అసాధ్యము. పైగా కొన్ని సమయములందు అది తీవ్ర మానసిక వికల్పమునందు గాని, ఉన్మాదస్థితియందు గాని అంతమగును. బ్రహ్మచర్యము ద్వారా తగు ఓజశ్శక్తిని

సంపాదించి యున్న వారికి ఆలోచనా ప్రభావము విజయవంత ముగా నెదుర్కొనుటయు, దాని ప్రతిచర్యను ప్రతిఘటించు టయు వీలుకావచ్చును. కాని సామాన్యులకది అసాధ్యము. ఆలోచనలను దూరము చేయవలెనని యాతనపడుటకంటె మనము వాటిని లెక్కచేయకున్న పక్షమున త్వరలోనే అవి పటుత్వమును కోల్పోయి, మనలను బాధించుట మాని వేయును. అప్పుడవి సరకు చేయక సాగిపోవుచున్న ఒంటెల బారును చూచి, మొరిగెడి కుక్కలతీరున ఉండును. ధ్యాన ములో కలిగెడి ఆలోచనలను అదుపు చేయుటకు ప్రయత్నించి నపుడు కేంద్రీకరణ సహజముగా నుండును. అది శక్తిని ఉద్భ వింప చేయును. ఆ విధముగా అలోచనలు బలవత్తర మగును.

ధ్యానము కాని, అట్టి ఇతరసాధనకాని చేయు తీరిక లేద నుట నేడు కొందరు తరుచు చెప్పెడి సాకు. కాని, "ఎక్కువ పని ఉన్న వారికి ఎక్కువ తీరిక ఉండును," అను సామెత అందరూ ఎరిగినదే. మనిషికి తాను చేయవలసిన పనికి అవసర మగు కాలము కంటె వ్యవధి ఎక్కువని నేను తలంతును. సమయము చాలలేదని చెప్పుటకు కారణము దాని దుర్విని యోగమే. సమయము చక్కగా వినియోగించినచో అది కొద్ది అని, చాలుటలేదని అనుటకు అగత్యముండదు. మరి కొంద రున్నారు. తాము భక్తి ధర్మములను పాటించకుండుట తీరిక లేకపోవుట వలన కాదని, అది వారలవాటు పడిన సోమరి

సంపాదించి యున్నవారికి ఆలోచనా ప్రభావము విజయవంతముగా నెదుర్కొనుటయు, దాని ప్రతిచర్యను ప్రతిఘటించుటయు వీలుకావచ్చును. కాని సామాన్యులకది అసాధ్యము. ఆలోచనలను దూరము చేయవలెనని యాతనపడుటకంటె మనము వాటిని లెక్కచేయకున్న పక్షమున త్వరలోనే అవి పటుత్వమును కోల్పోయి, మనలను బాధించుట మాని వేయును. అప్పుడవి సరకు చేయక సాగిపోవుచున్న ఒంటెల బారును చూచి, మొరిగెడి కుక్కలతీరున ఉండును. ధ్యానములో కలిగెడి ఆలోచనలను అదుపు చేయుటకు ప్రయత్నించినపుడు కేంద్రీకరణ సహజముగా నుండును. అది శక్తిని ఉద్భవింప చేయును. ఆ విధముగా అలోచనలు బలవత్తరమగును.

ధ్యానము కాని, అట్టి ఇతరసాధనకాని చేయు తీరిక లేదనుట నేడు కొందరు తరుచు చెప్పెడి సాకు. కాని, "ఎక్కువ పని ఉన్నవారికి ఎక్కువ తీరిక ఉండును," అను సామెత అందరూ ఎరిగినదే. మనిషికి తాను చేయవలసిన పనికి అవసరమగు కాలము కంటె వ్యవధి ఎక్కువని నేను తలంతును. సమయము చాలలేదని చెప్పుటకు కారణము దాని దుర్వినియోగమే. సమయము చక్కగా వినియోగించినచో అది కొద్ది అని, చాలుటలేదని అనుటకు అగత్యముండదు. మరి కొందరున్నారు. తాము భక్తి ధర్మములను పాటించకుండుట తీరిక లేకపోవుట వలన కాదని, అది వారలవాటు పడిన సోమరి

తనము అని దాపరికము లేక ఒప్పుకొందురు. ఈ సోమరి తనము వారికి దాటరానిది. వారు తమ వృత్తి వ్యాపారము లందెప్పుడును నిర్లక్ష్యమును, సోమరితనమును చూపరు. వ్యక్తిగతముగా ఇబ్బంది యున్నను, అస్వస్థతగా ఉన్ననుకూడ వారు వాటియందు సంపూర్ణోత్సాహము కనబరతురు. దీనికి కారణము కేవల మార్థిక లాభము వారిదృష్టి యందుండు టయే. భౌతిక లాభముపై గల వారి యపేక్ష ఇబ్బందినిగాని, అసౌకర్యమును గాని సరకు చేయనీయదు. అట్లే మనకు లక్ష్యప్రాప్తియందు వాంఛ గాఢమైనచో మన ప్రయత్నము నకు పురోగతికి నిర్లక్ష్యభావములు అడ్డు రావు. పూర్వకాలము మహాత్ముల చరిత్రలను పరిశీలించినచో సత్యమును సాధించు టకై జీవన సౌఖ్యము లన్నింటిని వారు త్యజించిరని కను గొందుము. వారు తమ హృదయములకు అతి ప్రీతికరమైన వస్తువును పొందుటకై అన్ని రకముల బాధలు పడుచు నిష్ఠా గరిష్ఠమును, తపోనియతమును అగు జీవితములు గడిపిరి. గమ్యము చేరవలెనను గాఢవాంఛ వారి నితరముల లెక్క చేయ నియ్యలేదు. ఎదుర్కొనవలసి వచ్చిన బాధలను, భంగ పాట్లను సరకు గొనక వారు తమ మార్గమున దృఢముగా నడిచిరి. సాధనీయ వస్తువు నంటబట్టి గాఢవాంఛ, లక్ష్య సాధ నము నందంతటి దృఢ సంకల్పము విజయప్రాప్తికి అత్యంత అవశ్యకములు. సాంసారిక జీవితమున కలతలు, కష్టములతో కూడి ఎట్టి దుస్థితి యందున్నను దృఢతరమగు సంకల్ప

విశ్వాసములతో దైవము వైపు దృష్టి మరల్చినచో ఆధ్యాత్మిక రంగమున నీవు విజయము గడించగలవని హామీ ఇచ్చుచున్నాను. నీ వెంత తీరికలేని జీవితము గడుపు చున్నప్పటికినీ అది నీ దారికి అడ్డు రాదు. సాధారణముగా జనులు సందేహమనస్కులై దైవము దెస కేగుదురు. వారు యదార్థ తత్వమును సాధించుటకు తాము చాల అసమర్థులమనియు, బలహీనుల మనియు అనుకొందురు. తొట్టతొలి దశయందే దృఢతరమగు సంకల్పబలమును చేకూర్చుకొని చివరి వరకు దానినట్లే కాపాడుకొన్నచో సంపూర్ణ విజయము సాధించక పోవుట జరుగదు. దృఢ మనస్కుడై రంగమున ప్రవేశించినచో సగముదారి దాటినట్లే. దృష్టి సారించినంతనే కష్టములు, నిరుత్సాహములు కరగిపోవును. విజయమార్గము సుగమమగును. స్థిర నిర్ణయము లేని వైఖరి హృదయపూర్వకము కాని యత్నమునకు దారి తీయును. అది సాధారణముగా పాక్షిక విజయమున గాని, లేక తరచు అపజయమున గాని అంతమొందును. మన దృఢ సంకల్పము తనంతటతానుగా అజ్ఞాత మూలములనుండి శక్తి లభింపజేసి కార్యసాధనకు దోహదము చేయును. సదా వృద్ధి పొందుచున్నట్టి ఆరాటశక్తులతో కూడిన దృఢసంకల్పము లక్ష్యసాధన విషయమున మన ప్రయత్నబలము పెంపొందించును. దాని వలన మనము మన ఆధ్యాత్మిక క్షేమమునకు, పురోగతికి తోడ్పడునట్టి ప్రతి సూచనను గ్రహించుచు అనన్య సత్య తత్వముతో

సంబంధము కలిగి ఉందుము. సాధ్యమైనంత తక్కువ కాలములో గమ్యము చేరవలెనను ఆతురతయు, నిరంతర ఆరాటమును త్వరిత గతిని విజయము సాధించుటకు తోడ్పడు ప్రధానాంశములు. మనము నిజస్థితిని, శాశ్వత శాంతిని నిశ్చల స్థితిని పొందు దనుక క్షణమేని విశ్రమింపరాదు. ఒక దానియందు గాఢ వాంఛ గలిగి నప్పుడు సహజముగ దాని కొరకై ఆరాట మేర్పడును. కోరినది కైవశమగు నంతవరకు శాంతి ఉండదు. అందువలన గాఢ వాంఛ చాల ముఖ్యమైనది. ఏ తీరుననైనను దానిని అలవరచుకొనవలెను. ఇట్లు శాశ్వత శాంతి ప్రాప్తికి తొలిదశ యందే మనలో ఆరాటము, ఆతురత పెంపొందించుకొందుము. దేనితో తెగదెంపులు చేసికొనవలెనో దానినే పెంపొందించుకొనమని నేను చెప్పుట చూడ వింతగా తోచవచ్చును. కాని నిశ్చితముగా త్వరిత గతిని విజయము సాధించు మార్గము ఇది ఒక్కటియే. ఈ విధముగా జనించిన ఆవేదన తాత్కాలికమును, సాధారణ మానసికావేదన కంటె భిన్నమైనదియును. ఇది సూక్ష్మతరము, మరింత ఆహ్లాదకరము. ఇది దివ్యశక్తిని మన హృదయములోనికి ప్రవహింపచేయుటకు మార్గము నేర్పరచును. దైవలోకమునకు మన దారిని సుగమము చేయును. నీవొక మనిషిని నీటిలో ముంచినచో అతడు పట్టు విడిపించుకొనుటకు విశ్వ ప్రయత్నము చేయును. నీటి నుండి వెంటనే బయట పడవలయునను ఆరాట మాతని ప్రయత్న బలమును వృద్ధి

పరచుటే ఇందుకు కారణము. అతడు నీటినుండి బయల్వెడలు నంతదాక విశ్రమింపడు. అదే తీరున తక్షణమే గమ్యము చేరవలెనను తీవ్రతరమగు ఆరాటము మూలమున చేయు విశ్వ ప్రయత్నము సాక్షాత్కార పథమున మన నడకను వేగ వంతము చేయును, అంతేకాక సాధ్యమైనంత తక్కువ కాలములో జయమును కల్గించును. అదియే సత్వర విజయము నకు సులభతమమును, అతి సమర్ధవంతమును అగు మార్గము.

నా సహచరులు వారిలో అట్టి ఆవేదనను కలిగించు పద్ధతిని గూర్చి పలుమారులు నన్నడిగిరి. గాఢమగు ప్రేమ తనంతట తానుగా వారి యందట్టి ఆవేదనను కలిగించునని చెప్పుదును. మనము గాఢముగా ప్రేమించినపుడు సహజముగా ఆ ప్రేమించిన వస్తువు యొక్క సామీప్యమును పొందుటకు ఆరాటపడుదుము. ప్రాపంచిక వస్తువు నొకదానిని అధికముగా ప్రేమించినపుడు దాని తలపు మనస్సు నందు మాటి, మాటికి వచ్చును. దానిని గూర్చి పలుమారులు తలచెదము. మన హృదయము నందు దివ్య ప్రేమను పెంపొందించు కొనవలెనన్న మనము చేయవలసిన దంతయు ఈ పద్ధతిని త్రిప్పి ఆచరించుటయే. మనము దేవుని పెక్కు తడవలుగాని, దినములో ఎక్కువ భాగముగాని జ్ఞప్తి యందుంచుకొన్నచో మనమాతనియం దప్రయత్నముగానే ప్రేమ నభివృద్ధి పరచు కొందుము. శ్రద్ధతో కొనసాగించుకొనిన యెడల మన హృదయము నందు అతి త్వరితముగా దేవునిలో ఐక్యము

నొందవలెనన్న ఆరాట ముద్భవింప చేయును. దేవుని యందు ప్రేమ పెంపొందించుకొనుటకు మరొక మార్గము నాటకమున నటించునట్లు ప్రేమికుని పాత్ర ధరించి నటించుటే. కాని, యిది సూక్ష్మ పద్ధతుల కసమర్థులగు వారికే. ఈ పద్ధతి కృత్రిమ మైనప్పటికిని కొలది కాలములోనే వాస్తవానుభూతికి దారి తీయును. కాగా వాస్తవిక ప్రేమానుభూతులు. ఆరాటము హృదయము నాందోళన పరచ నారంభించును.

సాక్షాత్కారము సాధించుటకు అతి ముఖ్యాంశ మేమనగా, విజయ సాధనకు మన శక్తి సామర్థ్యముల మీది ఆత్మ విశ్వాసమే. పూర్వకాలపు ఋషులలో మహోన్నతు లగు వారు సాధించిన అత్యున్నత సంపూర్ణ స్థితియైనను గడించుటకు మనము అసమర్థులమని, బలహీనులమని క్షణమైనను భావించుట అవివేకము. సాక్షాత్కార మార్గమున పూర్తి శ్రద్ధ తోడను, ఆత్మ విశ్వాసము తోడను, కష్టములను గాని, భంగపాట్లను గాని సరకు చేయక ధైర్యశాలియగు యుద్ధవీరుని తీరున పయనించవలెను. నిరాశా నిస్పృహలు మన సంకల్పమును బలహీన పరచును. మన దృఢత్వమును చెదర గొట్టును. భంగపాట్లను గుండె ధైర్యముతో నెదుర్కొనవలెను. కాని అత్యంత క్షుద్రము ఆధ్యాత్మిక జీవితమునకు కఠోర విషమును అగు మనోదౌర్బల్యమునకు ఎప్పుడు గాని తావీయ రాదు.

ఆధ్యాత్మిక మార్గము ననుసరించు మానవుని ప్రగతిలో ఒక ప్రధాన లక్షణము మిత స్వభావము. మితమనున దొక విస్తృతార్థము గల పదము. అది మనుష్యుని జీవిత కార్య కలాపము లందు ప్రతి ఘట్టమునకును విస్తరించును. దాని అర్థము సర్వేంద్రియము లందును, సర్వమానసిక శక్తు లందును చక్కని సమత్వము గలిగి యుండుట. ఏ వేళను మనస్సుపై ఎట్టి ప్రభావమును చూపక ఏ పనికి గాని, సహజముగా కావలసిన దానికంటె ఎక్కువయు తక్కువయు కాకుండుటే మిత స్వభావము. నేడు సాధారణముగా అందరి విషయమునకు మిత స్వభావము కలత చెంది ఉన్నది. దీనికి కారణ మేమనగా దృష్టి కందిన ప్రతి దానికి మనము తగని ప్రాముఖ్యమిత్తుము. అటుపై మన ఆలోచనా శక్తిచే దానిని బలపరతుము. ఇందు మూలమున అది తక్కిన వాటి కంటె దృఢతరమగును. మనమీ అలవాటును కలిగించుకొని వేర్వేరు విషయములందు వేర్వేరు తీవ్రతలతో ప్రయోగింతుము దాని పర్యవసానము వ్యాకులము, మానసిక ఘర్షణ తప్ప వేఱు కాదు. ఇదీ మన కష్టములకు, దుఃఖములకు మూల కారణము. పరిపూర్ణ మిత స్వభావమును, సమత్వమును, తిరిగి పొందిననే కాని సాక్షాత్కార మసాధ్యము. అది సృష్ట్యాదిని అన్నియును ఏ పరిపూర్ణ సమత్వస్థితి యందుండెనో అనిజ క్షీణత్వము ప్రవేశించినది. మన ఇంద్రియములు, మానసిక శక్తులు సమత్వము కోల్పోయి, అంతయు తారుమారయినది.

ఇప్పుడు ఇంద్రియములందు మానసిక శక్తులందు మిత భావ మును మరల కలిగించుటకై వాటిని అదుపులో పెట్టుటయే మన కర్తవ్యము. మితభావమును అలవరచుకొనుటకు సరళ మును, వినయసమ్మితము నగు భాషణము, మర్యాద గలిగి వ్యవహరించుట, సహజీవనుల యెడ ప్రేమ సహృదయ తలు, పెద్దలయడల గౌరవ భావము, అప్రతీకార స్వభావము వంటి బాహ్యజీవన వ్యవహారములందు కూడ ప్రత్యేక శ్రద్ధ వహించవలెను. మన ప్రగతిలో ఈ అలవాట్లు ఎంతో సహాయ కారులు. మిత భావము ప్రకృతి లక్షణము. చక్కగా మిత భావము పెంపొందించు కొన్నట్లయిన మన మొక తీరుగ ప్రకృతితో సామరస్యము సాధించినట్లే. అదియే ఆధ్యాత్మికతకు మూల సారము.

అంతిమముగా చాల ముఖ్యమైనదియు, తప్పని సరిగా జయప్రదమైనదియు అగు మార్గము ప్రార్థన. ఇది మనము భక్తి ప్రేమలతో శరణు జొచ్చెడి దేవునితో అనుసంధానము పొసగించును. ప్రార్థనలో దేవుని ఎదుట మన వాస్తవ స్థితిని ప్రదర్శించుచు పరిపూర్ణముగా అతని ఇచ్ఛకు దాసులమై కడు వినమ్రులమై ఉందుము. ఇదియే నిజమైన ప్రార్థనా విధా నము. నిజమైన భక్తులమగు మనము ఈశ్వరేచ్ఛతో తృప్తి

నొందవలెను. మనశ్శాంతి మిక్కుటముగా కలత చెందిన అసాధారణ సందర్భముల తక్క తృణప్రాయములగు ప్రాపంచిక లాభములకై భగవంతుని ప్రార్థించుట అవివేకము. పూర్తిగా తమ్ము తామే మరచిపోయి, అతనియెడ ప్రేమ ప్రపత్తులతో పూర్తిగా లీనమైన మనస్సు గలిగి, సర్వజ్ఞుడును, సర్వ శక్తిమంతుడును అగు సర్వోత్కృష్ట ప్రభుని నిరంతరము ధ్యానించవలెను. ఇది సరియగు ధ్యాన మార్గము. ఈ విధముగా ఒనర్చిన ధ్యానము అరుదుగా కాని వ్యర్థము కాదు. ఈ విషయము మరింత విశదముగా నేను నా "సహజమార్గపు దశనియమములపై వ్యాఖ్య" (Commentary on Ten Commandments of Sahaj Marg) అను పుస్తకమున చర్చించి యున్నాడను.

తుదకు, ధ్యేయ ప్రాప్తికి వివిధ పద్ధతులు, సాధనలు కలవనునది కూడ మీ మనస్సు కెక్క వక్కాణింతును. సాక్షాత్కారమార్గమున కొంతదూరము మిమ్ము అవి కొనిపోవచ్చును, గానిఎంతవరకన్న విషయము ఇచ్చట నేను చర్చించదలపెట్టను. దానిని చదువరుల గుణగ్రహణ పారీణతకు, అనుభవ జ్ఞానమునకు వదలివేతును. కాని పరిపూర్ణ పవిత్రరూపము దాల్చి, ప్రకృతితో సమగ్ర సామరస్యము కలిగి యుండునట్టి అంతిమ గమ్యస్థానము లేదా మానవ సాధ్యమగు మహోన్నత స్థితి ఏదియో ఆ స్థితికి కొంపోవునది రాజయోగము. కేవలము

రాజయోగము మాత్రమే అని ఘంటాపథముగా చెప్పుదును. ఏ ఇతర పద్ధతిగాని, సాధనగాని అట్టి ఫలముల నీజాలదు. కాన, మహోన్నత స్థితిని లక్ష్యముగా నుంచుకొన్నచో ఈ శాస్త్రమును చేపట్టక తప్పదు. ఇందులకు యదార్థముగా సమర్థుడయిన మార్గదర్శకుని సహాయ సముద్ధరణ లతి ముఖ్యావసరములు. నేటి తీవ్ర సమస్యకూడ అదే. కాని నిజమైన అన్వేషకు డాతని నెన్నడును పొందలేక పోడని నిర్ధారించు చున్నాడను.

# 4

# గురువు

నిర్ధారణ చేయబడిన లక్ష్యము, దానిని సాధించుటకు తగు మార్గము దృష్టియం దుంచుకొన్న పిమ్మట మనము మార్గదర్శకుడుగా గై కొనదగు వానిని అన్వేషింపవలెను. అతడు మనలను సాక్షాత్కార మార్గమున జయప్రదముగా కొనిపోగల వాడు కావలెను. అన్ని విషయములందును (ప్రాపంచిక విషయములతో సహా) సమర్థుడగు మార్గదర్శకుని సహాయమావశ్యకమగుచున్నది. కొంత జ్ఞానమును సంపాదించిన తరువాత స్వప్రయత్నముతో ముందుకు పోవుట సాధ్యపడవచ్చును. కాని, అపుడుకూడ పూర్వకాల బోధకుల అనుభవసార మందించెడి వారి పుస్తకములు తక్కిన వ్రాతలపై మనమాధారపడ వలసినదే. ఆధ్యాత్మిక విషయమున అట్లు గాదు. మనము పురోగమించి,ఉన్నతోన్నతదశల సాధించిన కొలదియు గురునావశ్యకము అధికాధికమగును. పుస్తకము లీ విషయమున మనకు నిరుపయోగములు. ఆధ్యాత్మిక విషయములపై ధారాళముగా ఉపన్యసించుటకు, వాగ్వాదములందు గెలుపొందుటకు వలయు విషయ పరిజ్ఞానము సముపార్జించుటకు అవి సాయపడునేమో గాని, ఆధ్యాత్మికతలో అనుభవపూర్వక

ముగా వాటి ద్వారా మాత్రమే ప్రవేశించుట దుస్సాధ్యము. పుస్తకములద్వారా గడించిన జ్ఞానముపై ఆధారపడి చేయు యోగసాధనలు అపమార్గమును పట్టించునవేగాక మన ఆధ్యాత్మిక పురోగతికి అపకారులు కూడ. సమర్థుడగు మార్గదర్శకుని సహాయక బలమే మనలను గమ్యమునకు చేర్చగలదు. ఆధ్యాత్మికతపై పదునెనిమిది గ్రంథములు రచించిన "మౌలానా రూమ్" అను ప్రఖ్యాత పర్షియన్ కవి ఒకమారొక మహనీయుని వద్దకు ఆధ్యాత్మిక శిక్షణ కోరి వెళ్లెనట. ఆ మహనీయు డాతనికి తన నుండి అనుభవ జ్ఞానసాధన కావలయునన్నచో ఆతని గ్రంథముల నన్నింటిని నదిలో పారవైచి రావలెనని ఆదేశించెను. అది అతని జీవితాంత పరిశ్రమకు తిలోదకము లిచ్చుట అగుటచే దాని కాతడు అంగీకరించలేదు. అతడా కోరికలతో మహాత్ముని అనేక పర్యాయములు ఆశ్రయించెనుగాని అదే సమాధానము పొందెను. గత్యంతరము లేక చివర కాతడు ఆ మహాత్ముని ఆదేశమునకు తలయొగ్గి, తన వ్రాత లన్నింటినీ నీటిపాలు కావించి ఆతని శిష్యుడాయెను. సరియైన ఆధ్యాత్మికానుభూతిని సాధనానంతరముననే పొందనగును. అందుకు విషయ పరిజ్ఞానమును, పాండిత్య ప్రకర్షయు నిరర్థకములు.

అందుచేతనే ఆధ్యాత్మి కాన్వేషణమున ఉన్నవారికి గురుని సహాయము అతి ముఖ్యము, తప్పనిసరి కూడ. అయినను మహనీయులు కొందరు నేరుగా దేవుని శరణార్థులై

స్వప్రయత్నముతో పరిపూర్ణత సాధించిన సందర్భములు కొన్ని ఉన్నవి. కాని అట్టి దృష్టాంతము లరుదు. అది చాల కష్టమయిన మార్గము. అసాధారణ మేధా సంపన్నులు మాత్రమే దాని ననుసరింపగలరు. దేవునకు, మానవునకు అనుసంధానకర్త గురువే. అతని ద్వారా మాత్రమే మనము భగవంతుని చేరగలము. మన మార్గమున వచ్చు చిక్కులను తొలగించగల ఏకైక శక్తి అతడే. అధ్యాత్మిక యాత్ర యందు "చక్రము" లనబడు ( అలంకారికముగా పద్మము లనబడు ) పెక్కు స్థానములను దాటవలసి ఉండును. అవియే దివ్యశక్తి యొక్క వాస్తవిక బలమునకు ప్రగాఢ శక్తి కేంద్రములు, మానవుని పూర్వార్జితములు. అవి మానవ శరీరమున పెక్కు చోట్లనున్నవి. ఆ కేంద్రముల మధ్యస్థమగు స్థలము అసంఖ్యాకములును, సంకీర్ణములయిన తంతువులచే కూర్చిన అల్లిక తీరున ఉండును. పురోగమించిన కొలది మన మీా మధ్యస్థమగు పొరలనెడి చిక్కులను దాటవలెను. సంస్కారాను భోగ సమాప్తికై అచట మనము చాలకాల మాగవలసి ఉండును. భోగమన పురాకృతము వలన మేలుకీళ్ళు అనుభవించుట మాత్రమే కాదు. మనము వచ్చి చేరియున్న కేంద్రమునకు సంబంధించిన చిక్కులను విడదీసివైచు మార్గము ననుసరించుటే భోగము. భోగార్థ మీా కేంద్రముల యొద్ద మన మాగవలసిన కాలము కడు దీర్ఘము అగుటచే పెక్కు సందర్భములలో కేవలము స్వీయకృషిచేత దీనిని నధిగ

మించుట అసాధ్యము. కొన్ని ప్రాథమిక దశలలో ఇది వీలు కావచ్చును. కాని అటుపై ఇది బహు దుష్కరమై పోవును. పూర్వకాల మహనీయులు కేవలము స్వయంకృషిచే ప్రయత్నించి జీవితాంతము తొలిదశయందో, మలిదశయందో చిక్కువడి యుండి ఎన్నటికినీ దాని నధిగమించలేకపోవుట అనునది పరిశీలనానుభవము వాస్తవాంశమేమనగా కొంత ఉన్నతమగు దశలయందు జారుడు స్థితి అనదగు స్థితిని ఎదుర్కొన వలసియుండును. అచట కొన్నివేళల కొలదిగా పైకి పోగలిగినప్పటికినీ వెంటనే మరల క్రిందికి జారిపోదుము. మాటిమాటికి ఇట్లే సంభవించును. తత్ఫలితముగా అధిరోహణము అతి ప్రయాసాయుక్తమే కాక దుష్కరమే అగును. ఈ పరిస్థితులలో సమర్థుడగు గురుని బలమగు త్రోపు మాత్రమే ఈ సుడిగుండము నుండి మనలను వెలికి తీయగలదు. గురువు శక్తి సామర్థ్యములందు కొరవడియుండకున్నచో తాను తన బలముతోడనే శిష్యుని బంధము నుండి పైకెత్తి ఆతనిని పైదశ యందుంచగలడు. అందుచేతనే మన మెన్నుకొను మార్గదర్శకుడు అత్యంతోన్నత శక్తి సంపన్నుడును, తన అసాధారణ బల సహాయముచేత చూపు మాత్రమున చిక్కులను తొలగించగలవాడై ఉండవలెను. అట్టివాడు కేవలము పరిపూర్ణత్వము పొందినవాడు కాని, అహము యొక్క సమగ్ర శూన్యతను సాధించినవాడు కాని, అయి వుండవలెను. అందుచే మనము ప్రేమాకర్షణ భావములు గలిగి

అట్టి మహాశక్తి సంపన్నునితో సంబంధ మేర్పరచుకొనవలెను. మన మదిలో అతని గూర్చి ఏ తీరున భావింతుమన్నది అంత ప్రధానము కాదు. అతనిని మిత్రుడని, గురుడని, సేవకుడని మనకిచ్చవచ్చినట్లు పిలువవచ్చును. కాని అతడు మాత్రము సామాన్యముగా పిలుచునట్లు మన మార్గదర్శకుడుగా, గురువు గానే ఉండును.

అధ్యాత్మిక తృష్ణను తృప్తి పరచుకొనుటకు గురువొక రుండుట తప్పదని దైవభక్తి పరుడగు ప్రతి హిందువుడును నమ్మినప్పటికి, దురదృష్ట వశమున ఈనాడు సరియైన మార్గ దర్శకు నెంచుకొనుటలో కడు నశ్రద్ధ కనబడుచున్నది. ఇందులకు సామాన్యముగా అర్హత, సమర్థతల లెక్కపెట్టక ప్రజలెవరో ఒకరిని ఎంచుకొనుచున్నారు. అజ్ఞాన ప్రజానీకము నాకర్షించుటకై గురువులని చెల్లుబడి అగుచున్న కొందరు ప్రదర్శించు అద్భుతశక్తి ప్రదర్శనల చేతనో చమత్కార వాక్నైపుణి చేతనో ప్రేరేపితులై వారిట్లు ఒనర్చుచున్నారు. శిష్యులకై వేటాడు వారికి కొరత లేదు. చెట్టున ఉన్న ఆకుల వలె వారు అసంఖ్యాకులు. వారిలో పెక్కుమందికి గురుత్వమను నది కడు లాభదాయకమగు వృత్తి. అది వారికి వేరు విధముగా గడింపలేని అపారాదాయమును కూర్చి పెట్టును. పైగా శిష్యుల నుండి అత్యంత గౌరవమును, వ్యక్తిగత సేవయును పొందుదురు. అజ్ఞాన ప్రజానీకము ఈ తీరున అప్రశమముగా ఈ స్వార్థపరుల ఎర అగుచున్నది. ఏ అల్పమగు గారడి ప్రదర్శ

నమో, మనోహరము కాని, ఆకర్షణీయము గాని అగు ఏదో ఒక సామాన్య ప్రదర్శనమో, గొఱ్ఱెల వంటి వందలాది అవివేకులను వారి గురుత్వమనెడి బంధనశాలలోనికి ఆకర్షింప జాలును. తమకు అయిష్టము గలిగించిన వారిని శపింతుమను ఒక చిన్న బెదిరింపు వేలమందిని వారి అడుగులకు మడుగులొత్తునట్లు చేయును. ఇంతియేకాదు. ఈ వృత్తియందు ఏకాధికారము సాధింపగోరి సన్న్యాసిగాని, సంసారిగాని విశిష్ట వర్గమునకు చెందినవాడు తప్ప ఇతరుడు గురువు కానర్హుడు గాడని వారు ప్రకటింతురు. యోగ్యతా సామర్థ్యములతో నిమిత్తము లేకుండా వారు తాము మతపరముగ అజన్మ జగద్గురులమని వాదింతురు. ఈ రోజులలో అసంఖ్యాకులుగ సన్న్యాసులు కూడా మహాత్ములవలె అభినయించి జగద్గురువులమని ప్రకటించుకోను చున్నారు. జాతికి మతమునకును తలవంపులు తెచ్చునట్టి వృత్తి వంచకులు తమస్వార్థ లాభములకై అజ్ఞానప్రజలను వంచించుచు పూర్తిగా దండనరహితులై తిరుగాడు చుండుట విచారకరము కాదా ? వారెట్టి అవాంతరము కల్పించి యుండిరో ప్రజానీకము కనుదెరచి చూడవలసిన కాల మాసన్నమైనది. గురుత్వమును అధికార వర్గీయుల ఏకాధికారముగా చిత్రించుట అసంగతము. ఇది వృత్తి గురువులచే ప్రవేశ పెట్టబడినది. ఏ పరిస్థితులలోగాని గురువుతో పవిత్రబంధమును శిష్యుడు త్రెంచుకోరాదనుట ప్రజాబాహుళ్యము నమ్ముచున్న

సూత్రము. ఇది కూడ ఈ మిధ్యా గురువులు తమ స్థానము సురక్షితము కావించుటకు అనుసరించు కుయుక్తియే. ఇది పచ్చి మోసమే గాని వేరుగాదు. శిష్యులకు దీక్షనిచ్చు ఆచారమును (వాస్తవమునకు చక్కని సూత్రముపై ఆధార పడినప్పటికిని) దాని అంతరార్థము నెరుగని నేటివృత్తి గురువులలో అధిక సంఖ్యాకులు తప్పుదారి పట్టించినారు. దీక్షా కాలమున కొన్ని రహస్య శబ్దముల శిష్యుని చెవిలో ఊది, పూజల పేరిట కొన్ని మతాచారముల ననుసరించు మని చెప్పుటయే గురువులుగా వారి ఏకైక కృత్యము. శిష్యుని యెడ వారి కర్తవ్యమింతటితో తీరిపోవును. ప్రతి సంవత్సరము శిష్యునకు దర్శన మిచ్చి వాని నుండి వారికి ముట్టవలసిన వార్షిక బహుమానము లందుకొనుట తక్క వాని యభివృద్ధికి చేయున దేమియును ఉండదు. యదార్థమునకు శిష్యునిలో నిజమైన విశ్వాసము నెలకొనియుండి, దైవప్రేమ అతని హృదయములో నాటుకొని నపుడు మాత్రమే యథావిధిగా నతనికి దీక్షనీయవలెను. శిష్యునికి దీక్ష నొసంగుట సర్వ శక్తిమంతుడగు భగవంతునితో లంకె కుదుర్చుటను సూచించును. అట్టియెడ అతడు తన యందు పెంపొందించుకొన్న గ్రాహక శక్తి కనుగుణముగా ఆధ్యాత్మిక శక్తి తనంత తానుగా ప్రవహింప ఆరంభించును. సుస్థిర సంబంధము కుదుర్చుట యన్నది గురుని శక్తి సామర్థ్యములపై ఆధారపడి యున్నది. దీనికి మహోన్నత శక్తి సంపన్నత కావలెను.

ఒకమారు దృఢమైన సంబంధము ఏర్పడినచో అది శిష్యుడు ముక్తి పొందునంతవరకు నిలిచియుండును. అట్టి సందర్భములందు ముక్తి పెక్కుజన్మల తర్వాత పొందవలసిన బహుదూర విషయముకూడ కాదు. వాస్తవమున మహోన్నత శక్తి సంపన్నుడగు గురువు పై నుడివినట్లు సరియైన రీతిని శిష్యునకు దీక్ష నొసంగినట్లయిన వానితో తెగతెంపులు ఏర్పరచుకొనుటన్న ప్రశ్నయే జనింపదు. కాని స్వార్థలాభాపేక్షతో దొంగదీక్షల నొసగు వృత్తి గురువులకు మాత్రము ఇది నిరంతరాందోళనకారియే. అందువలన శిష్యుని శాశ్వతముగా తమ గుప్పిటిలో ఉంచుకొనుటకై వారాతడెప్పుడైనను తమ నుండి విడిపోదలచినచో అతనికి నరక యాతనలు తథ్యమనుట దైవ శాసనముగా చాటెదరు. అజ్ఞాన ప్రజలు గురువున కప్రియముగ తలచుటకేని వెరచుచు, దీనిని వేదవాక్కుగా గ్రహించిరి. వారు గురువుల దురాగతము లన్నింటిని సదా నోరెత్తక, తల యొగ్గి భరించుచు వచ్చుచున్నారు. మన శాస్త్రములందు ఈ విషయమై అణుమాత్రపు సూచన కూడ లేదని నా నమ్మకము. ఇది మత బోధకుల తెలివితేటల ఫలమే. తాను గురువు నెంచుకొనుటలో పొరపడినాడనిగాని, గురువుయొక్క శక్తి సామర్థ్యములను సరిగా గమనించలేదనిగాని కనుగొన్నచో అట్టి గురువునుండి ఎప్పుడైనను తెగతెంపులు చేసికొనుట ప్రతి మానవుని జన్మహక్కని నేను గట్టిగా నమ్మెదను. ఏ దశయందైనను, అతడు తానింతవరకు సాధిం

చిన దానికంటె పైదశకు కొనిపోవు శక్తి తన గురువునకు లేదని కనుగొన్నచో స్వేచ్ఛగా మరొక గురువు నన్వేషించు కొన వచ్చును. అట్టి పరిస్థితులలో ఆత్మసాక్షి సమ్మతము గల గురువు తానే శిష్యుని పురోభివృద్ధి కుంటుపడకుండ తనకంటె నున్నతుడును, యోగ్యుడును అగు నింకొకనిని వెదకికొన నిర్దేశింపవలెను. ఇదియే నిజమైనట్టియు, స్వార్థరహితుడైనట్టియు గురుని పవిత్ర ధర్మము. శిష్యుడు విడిపోవుటకు అనుమతి వేడిన, గురువు స్వార్థబుద్ధితో తిరస్కరించిన పక్షమున శిష్యు డాతని నుండి తక్షణమే తెగతెంపులు చేసికొని స్వేచ్ఛగా మరొకనిని చేరవచ్చును. ఏ నైతిక ధర్మముకాని, మతధర్మము గాని అతని నెప్పుడును నిరోధింపవు.

శాస్త్రములు, తదితర పవిత్ర గ్రంథముల నుండి ఆర్జించిన జ్ఞానము నాధారము చేసికొని బోధించువారు గురువు తెగలో కొంత అభివృద్ధి సాధించిన వారుగా పరిగణింపబడు చున్నారు. వారు మత సంస్థలను, ఆశ్రమములను స్థాపించిరి. అందు వారు తమ యనుచరుల నడుమ రాజవైభవము ననుభవింతురు. వారు బయల్వెడలి గొప్ప సమావేశములందు ఉపన్యసింతురు. ఏమి చేయవలెనో, ఏమి చేయరాదో చెప్పుచు మాయాజీవ బ్రహ్మలకు సంబంధించిన సమస్యలగూర్చి విశదీకరింతురు. వారి మత ధర్మోపన్యాసముల నాలకించుటకు వేల వేలుగా ప్రజలు వచ్చి గుమిగూడి, వారి యున్నత భావములను అపార విజ్ఞానమును వినుతించి, వారు గొప్ప మహాత్ము

లనీ, మహర్షులనీ భావింతురు. ప్రజలు వారిని పెక్కు చిక్కు ప్రశ్న లడిగెదరు. వారు తాము గడించిన శాస్త్ర పరిజ్ఞానము నుండి ప్రత్యుత్తరము లీయగల్గినచో ప్రజల మనస్సులలో వారు మహాత్ములుగా తమ గొప్పతనమును ప్రతిపాదించు కొన్నట్లే. అటుపై వారే వారికి గురువులు. కాని, వాస్తవ ముగా వారి పాండిత్యము పరీక్షింపబడినది గాని వారి యోగ్యత కాదు. పాండిత్యముగాని పరిజ్ఞానము గాని మాన వుని పరిపూర్ణునిగా చేయనేరవనియు, సరియైన సాక్షాత్కా రమే నిజమైన యోగినిగాని, మహర్షిని గాని కావించుననియు మనస్సునందు చక్కగా నాటుకొని యుండవలెను. ఇట్లు తన బహిఃస్వరూప, పాండిత్య వకృత్వములచే ప్రభావితుల నొన రించిన వ్యక్తి అనుభవసిద్ధులు పరిశీలించినచో అథమాథమ దశయందుండుటయు సంభవింప వచ్చును. కావున మహాత్ము డనుటకు గాని, యోగి యనుటకు గాని శాస్త్ర పరిజ్ఞానము ప్రమాణము గాదు. అట్లే మహాత్ముడు గాని గురువు గాని యగుటకు నిదర్శనము కేవలము సాక్షాత్కార మార్గమున నతని అనుభవసిద్ధులు కాని, వాని యద్భుతశక్తి ప్రదర్శనలో అసాధారణ ప్రవర్తనలో కావు. మహాత్ముడనగా గొప్ప వ్యక్తి అనెడి సామాన్యార్థము నాకు నచ్చదు. నేను మహాత్ముడను. వానిని శాశ్వతముగా, ఆత్మభావ రాహిత్యముగలిగి జీవించుచు గర్వము, అహంకారము ఆధిక్యమనెడి భావముల కతీతుడై ఉండు ప్రాముఖ్యరహితునిగనో, నిరాధృతినిగనో నిర్వచిం

తును. సాక్షాత్కారమునకు జ్ఞానము ప్రాథమిక దశ అగుటచే అది అవసరమని, అనివార్యమని అనుకొనువారు కొంద రున్నారు.

జ్ఞానము మేధాశక్తి సాధితమే, అనువారితో నేనేకీ భవించను. సాక్షాత్కారము మేధాశక్తి కతీతమగు ఆత్మ వికాసము. అందువలన అది జ్ఞాన పరిధికి అతీతముగా నుండును. ఆధ్యాత్మిక శాస్త్ర గ్రంథము నందు మనస్సు యొక్క స్థితుల గురించియు వివిధ ఆధ్యాత్మిక దశలను గురించియు చాల చదివి తెలుసుకొందుము. కాని అనుభవ సిద్ధుల విషయమున కడు వెనుకబడి యుందుము. ఆస్థితుల గూర్చి ఇతరుల కుపన్యసింపవచ్చును. వాద ప్రతి వాదములు చేయవచ్చును. మన పాండిత్య గరిమను ప్రతిపాదించ వచ్చును. కాని అంతర్యమున దానిని గూర్చిన జ్ఞానమే లేదు. మనము ప్రసంగముల కేగుదుము. గీతోపన్యాసములు విందుము. ప్రతీదినము నియతి తప్పక భగవద్గీతాధ్యయనము లను పారాయణ చేయుదుము. దానిపై గొప్ప పండితులు రచించిన వ్యాఖ్యానములు పఠింతుము. కాని వీటివలన మన యందు ఎట్టి అనుభవపూరితమైన ఫలితము కలుగుచున్నది ? మనలో ఏ ఒక్కరైనను ఎన్నడేని అందు పేర్కొనిన స్థితులలో ఒకటైనా అనుభవ పూర్వకముగా గడించ గల్గిరా ? 'జగం మిథ్య ', 'అహం బ్రహ్మాస్మి' యిత్యాది పదములు వల్లించ వచ్చును. కాని పద రూపమున నుచ్చరించు దానిని గూర్చి

అంతరంగికముగా అనుభవమున పొందలేరు. గీతలో కృష్ణ భగవానుని ముఖాంతరమున విన్నప్పుడు అర్జును డను భవమున సాధించిన స్థితులు అందులో ప్రసంగించినట్లెవ్వరును సాధించలేదు. మహా భారత యుద్ధ ప్రారంభ సమయమున కృష్ణ పరమాత్మ డర్జునునికి బోధించిన దాని వ్యాఖ్యయే ఇప్పటి భగవద్గీత. వాగ్రూపమున వివరించిన స్థితులే శ్రీ కృష్ణ పరమాత్మ అర్జునుని హృదయము నందు ప్రసారింప జేసెను. తత్ఫలితముగా అర్జునుడు లోపలను వెలుపలను అంతటను గూడ నొకే స్థితి విస్తరిల్లి యుండుట ప్రత్యక్షముగా ననుభూతి చెందెను. అట్లు అతడు విన్న ప్రతి శబ్దము నేరుగా నతని హృదయమునకు దిగి, శాశ్వత ఫలితము చేకూర్చెను. ఆధునిక గీతా ప్రబోధకులు శ్రోతల మనస్సులందు వాంఛిత ఫలితము కల్గించ లేకపోవుటకు కారణము గీతయందు వివరించియున్న స్థితులను ప్రసారింపజేయు శక్తి వీరి యందు లోపించుటే. గీతలో చర్చించిన వివిధ మానసిక స్థితులు మానవుడు తాను ఆధ్యాత్మిక మార్గమందు పయనించునపుడు దాటవలసిన వివిధ దశలే. అవి లోన నుండి తమంత తాముగా పొటమరిల్లును. అపక్వదశయందు కోరిన మానసిక స్థితిని సాధించుటకు సాంప్రదాయ పద్ధతులు అంతరంగిక స్థూలత్వ మును పెంచును. అది మన పురోగతికి గొడ్డలి పెట్టు.

మత సిద్ధాంతములోని విశిష్టతను వివరించగలవాడు గాని చేయదగినవి, చేయతగనివి నిర్ణయించ గలవాడు

గాని నిజమైన బోధకుడు కాడు. మనలో రమారమి ప్రతి యొక్కరికినీ నిది చాలినంత తెలియును. ఆత్మవికాసము కలుగ జేయు ప్రేరణయు సాక్షాత్కారము మార్గమున పురోగమించు సమయమున నాతని ప్రత్యక్షాధారమును, గురువు నుండి పొందుటావశ్యకము. విజయమే ధ్యేయమైనచో అట్టి గురువునే వెదకి కొనవలెను. కావున మన మాధ్యాత్మిక మార్గదర్శకుని నిర్ణయించుకొనునపుడు పరిగణింపవలసినది సాక్షాత్కార రంగమున నాతడు సాధించిన విజయములు గాని, అతని పాండిత్యమో, అద్భుత శక్తియో కాదనుట తేటతెల్లము. తాను స్వతంత్రుడైననే నిన్ను శాశ్వత బంధవిముక్తుని చేయగలడు. నీ గురువు సంస్కారములు, మాయా అహంకార బంధనముల నుండి విడివడనివాడై యున్నచో నిన్నా బంధనముల నుండి విడిపించుట అతని కసాధ్యము. నీవు ఒక స్తంభము నకును నీ గురువు మరొక స్తంభమునకును బంధితులై యున్నచో నీ గురువు నిన్ను బంధవిముక్తుని చేయుటెట్లు సాధ్యము ? తాను స్వతంత్రుడుగా నున్న వ్యక్తియే నిన్ను బంధనముల నుండి విడిపించగలడు. స్వాధిక్యమును పెంపొందించు కొనుటయో, స్వలాభాపేక్షయో ప్రధానోద్దేశ్యముగా గల అనర్హులగు గురువుల మార్గదర్శకత్వమునకు లొంగిన వారు అనేక సందర్భములందు ఈ కారణము చేతనే తప్పుదారిని పడిరి. ఇది దృష్టిలో ఉంచుకొనియే గురువులు సాధారణముగా తప్పుడు నటనల వలన తమ పదవీ గౌరవములను కాపాడుకొన తాపత్రయ పడు

చుందురు. తమకంటె ఎక్కువ పురోగమించినట్టివారి, ఎక్కువ సాధించినట్టివారి శ్రేష్టత్వము అంగీకరించుటవారి అధికారపదవీ గర్వములకు అమోఘమగు దెబ్బ. ఇది మోటు రూపమున నున్న అహంకారమేగాని వేరుగాదు. అట్టి గురువును ఆశ్రయించినచో నీకును అట్టి గర్వభావము సంక్రమించును. అది అతినీచమగు స్థూలత్వ రూపము. అది నీ ఆధ్యాత్మిక పురోగతికి తప్పక ప్రతిబంధకమగును. ఈ చెడుగు ఉన్నంత వరకు మోక్ష మెన్నడును సాధ్యముగాదు. ఆధ్యాత్మికత ఎంతటి సూక్ష్మమాన సిక స్థితియనగా దానితో పోల్చినపుడు తదితరము లన్నియూ బరువై నవిగను, స్థూలమైనవిగను కనుపట్టును. రోజాపూవు యొక్క మనోహర పరిమళము వలన ఇంద్రియముల కనుభూతమగునట్టి మృదుభావము కూడ దానికంటె మరింత భార మైనది దానిని ప్రకృతితో చక్కగా సామరస్యమును సాధించిన పరిపూర్ణ ప్రశాంత స్థితి యనియును, మితభావమనియు నేను వచింతును. ఈ మానసిక స్థితిలో సర్వేంద్రియములును, బుద్ధి శక్తులును నిద్రాణదశయం దుండును. అవి అప్రయత్నముగను మనస్సుపైనెట్టి ముద్రను వేయక పనిచేయును. దాని ఉన్నత స్థితులలో పరిపూర్ణప్రశాంతత యొకటి. కాని సత్యస్థితి ఇంకను కడుదూర మందున్నది. ఆ స్థితి యందు ప్రశాంతతాజ్ఞానము కూడ నశించును. ప్రశాంతతాజ్ఞానము కూడా మనస్సుపై కొంత భారమును - అదెంత స్వల్పమైనప్పటికినీ— కలిగించు

చున్నది. అసలు ప్రశాంతతనే యెరుగని స్థితి యందున్నచో యదార్థమునకు ఆ సంస్కార భావముల ప్రభావములనుండి, తద్వారము నుండి మనము దూరమయినట్లే. ఈ దశయందలి స్థితి వింతయైనది. అది ఆనందముకాదు. తద్భిన్నముకాదు. ఈ దశ యందలి స్థితిని దెలుపుటకు మాటలుచాలవు. మనము చివరకు పొందవలసిన స్థితి అట్టిది. అందుకు ఎవడు పైన వర్ణించినట్టి స్థితియందే నిరంతరముగా అధివసించుచుండి సంకల్ప బలముచే అభ్యాసి హృదయమందు ఆధ్యాత్మిక స్థితులను ప్రసరించుటకును, అందలి క్లిష్టతావరోధముల నిర్మూలించుటకును శక్తి సామర్థ్యములు కలిగియుండునో, అతడు, కేవలమతడే గురువు కాదగియున్నాడు. దీనికంటె అధోదశయందున్న వాడాధ్యాత్మిక శిక్షణ ఇవ్వ అనర్హుడు.

ప్రాణాహుతియను నీపురాతన విధానము ఈ దేశమున ఆవిర్భవించి మన పూర్వ మహర్షులచే విస్తారముగా నుపయోగింపబడి, పుట్టిన ఈ దేశమునందే పూర్తిగా నశించిపోయి, నేడు ఏకొలది మందియో తప్ప నమ్మువారు కూడా లేని దశకు వచ్చుట అత్యంత దుఃఖకరము. అది ఇంద్రజాలమనియు సమ్మోహన విద్య యనియు కొందరు దుర్వ్యాఖ్య కావించి హేళన చేయ జూతురు. ఈ అంశమును 'రాజయోగ ప్రభావము' అను నాగ్రంథమున విపులీకరించి యున్నాను. ఉన్నత స్థితులను పొందుటకు ఆధ్యాత్మిక శిక్షణ కేవలము ప్రాణాహుతి విధానమువననే సాధ్యమనియు, వేరు విధానమున కాదనియు

ఇటు నొక్కి వక్కాణించుచున్నాను. నేటి సమాజములోని విద్యా వంతుల ముందీ విధానము గూర్చి తరచు ప్రస్తావించినపుడు కొందరు మత బోధకులు ప్రాణాహుతి యందు ఏ విశేషము లేదని ప్రజలకు చెప్పి ఈ విషయమున తమ శక్తిహీనతను సమర్థించుకొనుచున్నారు. సాధారణముగా ఒక మహాత్ముని సన్నిధినిగాని, మహర్షి సన్నిధినిగాని యున్నప్పుడు మనసును కలవరపరచు ఆలోచనలు కొంతవరకు తొలగిపోయి, కొలది సేపు ప్రశాంతత కలుగును. ఇది ఆ మహాత్ముని ప్రాణాహుతి వలని ప్రభావమని వారు వాకొందురు. తమ అశక్తతను కప్పి పుచ్చుకొని ప్రజలను మోసపుచ్చు ఉద్దేశ్యముతో వారీ వివరణము నొసంగుచున్నారు. ఏది ప్రాణాహుతి అని వారు వివరింతురో అది యా మహాత్ముని నుండి తమంత తాముగా ప్రసారమగు పవిత్రపరమాణువులు. అవి అచట సమావేశమైన అందరినీ ప్రభావితులను చేయును. తత్ఫలితముగా వారచట నుండునంతదనుక వారిలో కొంత ప్రశాంతత నెలకొనును. అది సహజప్రక్రియయేగాని ప్రాణాహుతి కానేరదు. అట్టి పరమాణువులు కేవలము మహాత్ముని నుండి, మహర్షి నుండి మాత్రమే ప్రసరించుట లేదు. అవి ప్రతి యొకరినుండియు-అతడు పవిత్రుడుకాని, దుర్మార్గుడు కాని, సాధువుకాని-క్రూరుడుగాని-ప్రసరించును. కొంతకాలము అపవిత్రుడో నైతిక పతితుడో యగువాని చెంతనున్నచో వానినుండి అటువంటి

అపవిత్ర పరమాణువులే ప్రసరించి, ప్రభావితుని కావించును. తత్ఫలితముగా అప్పటికి మనస్సులోని ఆలోచనలును అదే ధోరణిలో సాగును. అట్టి ప్రసార ప్రభావము స్వల్పకాలము మాత్రమేయుండి, ఆవాతావరణము నుండి దూరమయినవెంటనే మాయమగును. ఇందు మూలముననే మత బోధకులు, తరచు ప్రజలు బోధనల ననుసరించుటలో నిర్లక్ష్యభావము చూపుచున్నా రని నిందింతురు. ప్రజలు వారి ఉపదేశముల నాలకించి వెళ్ళి, దానిలో నిసుమంతయు మనస్సునం దుంచుకొనక తాము విన్న దంతయు అప్పటికప్పుడే వదలి వేయుదురని చెప్పుదురు. ఇందుకు నిందించ వలసినది ఉపదేశకునిగాని ప్రజలను కాదని నా తలపు. ఏలయన, తాను వేదికపై నుండి బోధించ తలచినది వారి హృదయములలో ప్రతిపాదిం చుటకు వలయు శక్తి సామర్థ్యములు అతనిలో లేవు. సంకీర్తనల గూర్చియు ఇటువంటి భావములే వెలిబుత్తురు. అట్టి సందర్భములందు జనించెడి ప్రశాంతవాతా వరణము ప్రాణాహుతి ప్రభావమేయని వాకొందురు. వాస్తవ మున కది బృందగానములోని సంగీత శబ్ద తరంగ ప్రభావమే. సమస్త సంగీత సదస్సులందును మనిమిట్టి యనుభవమే పొందు దుము. అట్టితరుణములందు మనమనస్సు ఏకైకలక్ష్యముపై కేంద్రీ కృతమైయుండును. మనము ఏయితర విషయములను పాటింప కుందుము. సంకీర్తనమునందు మన ఆలోచనలేదో నొక పవిత్రాశయముపైలగ్నమైయుండును.గాన దానినే మనహృదిలో

స్వతస్సిద్ధముగా అనుభూతిచెంద నారంభింతుము. దీనికి ప్రాణాహుతితో ఎట్టి సంబంధము లేదు. ప్రాణాహుతి శక్తి అత్యున్నతస్థితికి చెందిన యోగ సిద్ధి. దీనిచే యోగి తన ఆత్మబలముతో నెవనియందైనను యోగశక్తిని, లేక దివ్యజ్యోతిని ప్రసరింపచేసి అతనిలోని అనావశ్యకములను ఆధ్యాత్మిక ప్రగతి నిరోధములను తొలగించును. అతడీశక్తిని తనచుట్టూ సమావేశమైయున్న వారిమీదనే గాక తనకు బహుదూరమం దున్న వారి మీద కూడా ప్రయోగించగలడు ఈ శక్తిని ఏ విధముగానైనను, ఏ సమయము నందైనను ఉపయోగించ వచ్చును. ఈ శక్తిపై ఆధిక్యత పొందినవాడు చూపు మాత్ర మున అభ్యాసి తాను జీవితకాలమంతయు వెచ్చించి కాని పొందలేని యట్టి మానసికస్థితిని-ప్రస్తుత స్థితికంటె కడుంగడు ఉన్నతమైన దానిని-తాత్కాలికముగాగాని, శాశ్వతముగాగాని కలింపజాలును ఇది వట్టిమాట కాదు. సత్యవచనము. ఎవరేని కోరినచో ఎప్పుడైనను ప్రత్యక్షముగా పరీక్షించి చూడవచ్చును. ప్రాణాహుతి శక్తి వలన మహర్షులు పలుమార్లు కేవలము చూపు మాత్రమున మానవుని స్వభావమునే మార్చి వేసియున్నారు. మా గురుదేవులు ఫతేగఢ్‌కు చెందిన సమర్థగురు శ్రీ రామ చంద్రజీ మహరాజ్, స్వామి వివేకానంద మరికొందరట్టి మహాత్ముల దృష్టాంతములును దీనికి నిదర్శనములు.

ఎటువంటి వ్యక్తి గురువుగా లేక మార్గదర్శిగా నెంచు కొనవలెనను సమస్యకు పరిష్కార మన్వేషించుట దుర్ఘటము

కాదు. అంతిమ లక్ష్యము పై మనము దృష్టి నిలిపినపుడు దానికన్నా నిమ్నస్థితిలో నున్న ఎవరితోనైనను మన మెన్నడును తృప్తి చెందజాలము. ప్రతి మహాత్ముడును గాని యోగి గాని ఆత్మోన్నతి సిద్ధుల విషయమున తమ తమ ప్రత్యేక దశలను పొంది యుందురు. భక్తి విశ్వాసములు గలిగి వారిలో ఒకరితో సాంగత్య మేర్పరచుకొని, అతని యత్యున్నత స్థితిలో సమైక్యమును సాధించితిమేని మనము కూడ తదనుగుణమగు ఆత్మోన్నతిని పొందుదుము. కనుక మహోన్నత స్థితిని పొందిన వానినే మన గురువుగా నెంచు కొనుట అత్యంతావశ్యకము. దురదృష్టవశమున నెట్లో అల్ప సిద్ధులను సాధించిన వానినే యెంచుకొనుట తటస్థించిన తదనుగుణముగా మన మంతిమగమ్యము చేరుటలో వెనుకబడి పోవుదుము. సాధారణముగా ఆధ్యాత్మిక బోధకుడు కనీసము బ్రహ్మాండ మండలమనెడి ( విరాట్ దేశమనియు పిలువబడు ) స్థితి వరకైనను పురోగతి సాధించినగాని ఇతరులకు శిక్షణ నొసగుటకు అర్హుడని తలంపరాదు. ఈ స్థూల ప్రపంచమున జరుగుటకు పూర్వము ప్రతిది సూక్ష్మరూపమున బ్రహ్మాండ మండలములో గోచరించును. అట్టి స్థితిలో ననుసంధాన మేర్పరుచుకొన్న గురువు నిరంతరము నక్షీణ శక్తి భాండా గారముతో సంబంధము కలిగియుండును. అట్లుగాక ఈ స్థితిని పొందక పూర్వమే ఎవరైనను ఇతరులకు ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చు పనికి పూనుకొన్నచో అతడు తన యందున్న

శక్తిని కోల్పోవనారంభించుటయే కాక తన శిక్షణలో ఉన్న వారి సంస్కారముల చేతను, స్థౌల్యము చేతను కాలుష్య మొంది తత్ఫలితముగా త్వరలో తానే నాశనము చెందును. మా సంస్థ యందు ఆధ్యాత్మిక శిక్షణ నిచ్చుటకు సాధారణముగా ఈ స్థితి యందు గూడ అనుమతి నొసంగుట లేదు. తాను గురువునను భావము లేశమైనను హృదయము నందు చొరనీయకున్నప్పుడే ఎవ్వడైనను శిక్షణ నొసంగు కార్యమునకు తగును. తన జీవితమున ఒక్క మాటైనను తాను గురువునన్న భావము మనస్సు నందు పొడచూపిన వాడు జీవిత పర్యంతము గురువు కా ననర్హుడని నా విశ్వాసము. ఈ భావము కలిగియుండుటే అతడు తన హృదయమున స్వాభిమాన స్వాతిశయములు కల్గియుండుటను సూచించును. తాను గురువు ననెడి భావము పొడుకోల్పు నొన్నచో అది త్వరలో దట్టమగు అహంకార రూపమైన గర్వము గాను, అటు పై గురువులో నుండరాని అతిహీనమగు లోపముగాను పరిణతి చెందును. అందుచేత తాను గురువుగా రంగమున ప్రవేశించక మునుపే ఈ దుర్గుణములను పోగొట్టు కొనుట అవసరము. భగవంతుడే నిజమగు గురువు లేక ప్రభువు. అతని నుండియే మనము జ్యోతిని పొందుదుము. సామాన్యమగు తెలివితేటలు గల మనుష్యులకు దైవ ప్రేరణ స్వయముగా పొందుట బహుకష్టము. కనుక ఆ సర్వశక్తి స్వరూపుడగు దైవముతో అనుసంధాన మేర్పరచుకొని యున్న

మన సహజీవనుడగు వ్యక్తి సాహాయ్య మర్థింతుము. ఈ విధముగా తాను గురువునని, ప్రభువునని బయలుదేరిన వాడు నిజముగా భగవంతునికి చెందవలసిన స్థానమును అక్రమముగా ఆక్రమించుకొన్న వాడగుననుట సుస్పష్టము. అందువలన నది కేవలము దైవ దూషణే గాని వేరుగాదు. కావున అతడు ఆ మహాప్రభుని నామమున మానవసేవ చేయుచు, తానొక వినయ విధేయతలు గల చిన్న భగవత్సేవకుడే అని తలంచ వలెను. ఈ కాలమందు దురదృష్ట వశమున విరివిగా నున్న అహంకారమునకు, అహంకార జనితమగు దుర్గుణము లకును ఇక తావుండదు. ఈ దుర్గుణములు పొడసూపిన చోట సత్యము బొత్తిగా నుండదు. కాన గురువు కాని, బోధకుడు గాని తన హృదయము నుండి స్వాధిక్య స్వాతిశయ భావములను లేశమైనను లేకుండ పారద్రోలి తాను వినయ విధేయతలు గల మానవ సేవకుడనని లేక సహచరుడనని భావించవలెను. పూజ్య స్మృతుడగు నా గురుదేవు లిందులకొక తార్కాణము. వారు తమ జీవిత మంతయు సహచరులను సోదరులుగనే చూచుకొనిరి. వారు తమ శిష్యు లనెడి భావ మొక్కసారి యైనను ఆయన మనస్సున తల సూపలేదు. వారికి వ్యక్తిగత సేవల నొనర్చుటకైనను ఆయన సర్వదా సంసిద్ధుడుగా నుండెను. అవి వారి దృష్టికి కూడ రాకుండ పలుమారు లాయన యట్లొనర్చి యుండెను. గురువు తన అధికారమును విడనాడి, తానొక సామాన్య మానవ సేవకుడని

భావించుట ఆవశ్యకమని నే ననుకొందును. అత్యవసర సందర్భములలో తప్ప గురువు శిష్యుల నుండి వ్యక్తిగత సేవల నొందగోరుట సమంజసము కానేరదు. అది కూడ తాను తన శిష్యుల కెంత వరకు సేవ చేయ సిద్ధమై యున్నాడో అంత మేరకే. గురువు లనబడెడివారిలో పెక్కుమంది గురువుల యెడ వ్యక్తిగత మగు సేవను ప్రోత్సహింతురు. ఏలయనగా అది వారికి వ్యక్తిగతమగు సుఖమును చేకూర్చి స్వాతిశయమును పోషించును. గురుని పాదములు తాకుట చేతను, అవయవముల మర్దనము చేయుట చేతను, శిష్యునిలో పవిత్ర సంస్కారము లేర్పరుప జాలెడి ఆకర్షణ శక్తి ధారలు గురువు నుండి శిష్యుని చేరునని వారందురు. ఇట్టి ఆచరణము వలన శిష్యుడు ఆ గురువు నుండి కడు స్వచ్ఛతను, పవిత్రతను ఆకర్షించు చున్నాడనుట నిజము కావచ్చును. కాని, వానిని నన్నొక ప్రశ్న వేయ నిండు. గురువు శిష్యున కట్టి సేవ చేసినచో ఇవి సాధ్యము కాదా? అట్లుకాదని ఎవ్వరు సాహసించి చెప్పలేరని తలంచెదను. వ్యక్తిగత సుఖ సౌకర్యములు తప్ప దీనికి మూలమగు ఉద్దేశ్యము మరొకటి లేదనుట తేటతెల్లము. నా వినమ్ర ఉద్దేశమున ఈ పద్ధతిని కాలావసరమును బట్టి తారుమారు చేసి గురువు తానే శిష్యుల కట్టి సేవలు చేయవలెను. నిజముగా గురుని స్థానము కడు వింతైనది. తానొక గురువని, కాన అనుచరులందరి కంటే తానుచ్ఛస్థితి యందు ఉండువాడని భావించుట గురువులో

ఉండతగని అతిహీనమగు అహంకారము. భక్తి ప్రేమలతో గురు సేవయందు తననుతాను నియోగించుకొనుట శిష్యనివిధి.అంతే గాని గురువు అపేక్షింప తగిన హక్కుగాని, విశేషాధికారము గాని కాదు. నాకొక దృష్టాంతము జ్ఞాపకమునకు వచ్చు చున్నది. ఒక మాటు, ఎందు చూచినను కానవచ్చెడి ఈ తెగకు చెందిన గురువులలో ఒకనినొక మూఢు డాశ్రయించి, శిష్యుడు కాగోరెను. తన గురుత్వ కూటమునకు అధికముగా ఒకడు చేరుటను గురువు హర్షించి, వానికి శిష్య ధర్మముల బోధింప ఆరంభించెను. "నీవు గురువునెడ సంపూర్ణ విధేయత గలిగి, అతని వ్యక్తిగతావసరములను ఎల్ల వేళలా చూచు కొనుచు సేవ లొనర్చు చుండవలెను. ప్రత్యుదయమును, సాయంకాలమును అతనికి సాష్టాంగ ప్రణామము ఆచరించి గురువు నిద్రించిన పిమ్మట పడుకొని అతడు మేల్కొనక పూర్వమే లేవవలెను." పాపమా దీనుడు ఇది అంతయు చేయ తన చేతకాదని అమాయకముగా ఇట్లడిగెను, "మీరు చెప్పినట్లు కచ్చితముగా నడచుకొనని యడల నేమగును?" దానికిచ్చిన గట్టి ప్రత్యుత్తరము, "నీవు బహిష్కృతుడవై వినాశమొందెదవు." సవినయముగా శిష్యుడిట్లనెను. "అయ్యా! అట్లయిన మీరు నన్ను గురువుగా స్వీకరించితిరేని మీరెంతో దయాళువు లగుదురు." గురుశిష్యుల మధ్య అసూయ, ఘర్షణలు చెలరేగిన సందర్భములు తఱచు మనము చూచు చుందుము. ఇదంతయు ఎందువలన? ఇది కేవలము స్వార్థపరత,

వ్యక్తి లాభాపేక్షల మూలముననే. అందుచేత గురువు తప్పక వ్యక్తిగత వాంఛ, స్వార్థచింత వీడినవాడై యుండవలెను. గర్వాధిక్య భావములు బొత్తిగా లేని వాడై యుండవలెను. మరియు విశాల మానవకోటికి నిజమైన సేవకుడై పేరుగాని, ప్రఖ్యాతి గాని ధనము గాని పొందవలెనను స్వార్థపరమగు దుర్బుద్ధి లేక నిర్మల ప్రేమతో ప్రజలకు బోధించు వాడై యుండవలెను. సాధ్యమైనంతటి అత్యున్నత సీమ వరకు అనుభవము సాధించినవాడై యుండి, ప్రాణాహుతి శక్తి ప్రసరింప గలవాడై యుండవలెను. సంపూర్ణ విజయమును కోరితిమేని అట్టి వానినే మన మార్గదర్శిగా నిర్ణయించుకొనవలెను. అనర్హుడగు గురుని మార్గదర్శకత్వమునకు తలయొగ్గుట కంటె జీవితాంతము గురువు లేకయే యుండుట మేలు.

# 5

# ఆధ్యాత్మిక శిక్షణ

నేటి మన నైతిక ధార్మికపతనములకు చాలవరకు మన పరిసరములును, క్రమ విరుద్ధమగు మన శిక్షణయును మూలములు. మనస్సును చక్కగా తీర్చిదిద్దుట యనునది యన్ని విద్యారంగములందును, శిక్షణా రంగములందును బొత్తిగా నిర్లక్ష్యంపబడుచున్నది. మర్యాదప్రదమైనట్టియు సౌఖ్యప్రదమైనట్టియు జీవమును కూర్చిపెట్టదగిన ప్రాపంచిక శిక్షణనొసంగుటకు సాధ్యమైనన్ని యత్నములు సాగుచున్నవి. కాని, అత్మసాక్షాత్కారమునకవసరమగు సరియైన శిక్షణ కేవలము నిరాదరింపబడు చున్నది. అత్యంతావశ్యకమైన జీవితసమస్యకేదయినను ప్రాధాన్యమునిచ్చుచున్నచో నది అత్యంత స్వల్పమైనదే. ప్రజా సామాన్యము నేర్చుకొన్నదంతయు కేవలము దేవుని గాని, దేవతనుగాని స్తుతించుచు ప్రతి దినము కొన్ని శ్లోకములు వల్లించుటయో, పూజ రూపమున కొన్ని యాంత్రిక విధులు నిర్వర్తించుటయో మాత్రమే. ఇది వారు జీవితాంత మాచరింతురు గాని లాభము బహుశః శూన్యమే. అంతః ప్రశాంతత వారిలో నింకను కొరవడియే యుండును. వాంఛలు, మనశ్చాంచల్యములు, భావోద్రే

కముల వంటి మానసిక కార్యకలాపములు యధాపూర్వకముగా ఉన్నవి. సాధ్యమైనంతవరకు దైవగుణములను మానవుడు తనలో సమ్మిళితము గావించుకొనుట కారంభించుతే శిక్షణ యొక్క ప్రధానోద్దేశ్యము. దీనిని సాధించని యెడల ఆ శిక్షణా విధానము లోపభూయిష్టము. తత్ఫలితముగా నిరుపయోగమును. మానవుడు సక్రమముగా తీర్చిదిద్దబడుటయే సరియైన శిక్షణా విధానపు సహజఫలితము. సర్వేంద్రియములను, సర్వమానసిక శక్తులను ప్రయోగించుటలో మిత భావము నెలకొల్పి, చక్కని మానసిక రూప కల్పన మొనర్చుటలో సక్రమ నిర్మాణమనునది కలదు ఈ విధముగా సమర్థవంతుడగు గురుని మార్గదర్శకత్వమున పొందెడి సరియైన శిక్షణయే మనలను తీర్చిదిద్దుటలో అన్నిటికన్నా ప్రధానాంశము. అది లేక ఆధ్యాత్మికమున నున్నతోన్నత స్థితులను పొందుట అసాధ్యము. ఏదో ఒక విధముగా పెక్కు మందికి భగవంతునియెడ సహజానురక్తి యుండును గాని భగవత్ప్రాప్తి యందు జయమొందిన వారు మాత్రము చాల అరుదే. కారణము శిక్షణా మార్గదర్శకత్వములు లోపభూయిష్టములగుటే. అవి అభ్యాసకుని వాస్తవ మార్గమునకు దూర మొనరించును. తత్కారణమున ఎప్పటికినీ అతడుదారి తప్పినవాడై పోవును. సామాన్య సామర్థ్యము గల వ్యక్తికి తాను పొందెడి శిక్షణ సక్రమమైనదా కాదా అని తీర్మానించుట మిక్కిలి కష్టమైనపని. ఒక వ్యక్తి తాను గురువుగా స్వీకరించిన వాని నిర్దేశములను అణకువతో,

మారు మాట్లాడక అనుసరించును; అతడు కోరినట్లు సాధన చేయును. అట్టివ్యక్తి తాను సరియైన మార్గమున నడుపబడు చున్నాడా లేదా యని తెలిసికొనుట చాల కష్టము. సాక్షాత్కారము విషయమున కడు నజ్ఞానులైయున్న ప్రజలకిది పెద్ద సమస్య. నీరుల్లిని, వెల్లుల్లిని, పచ్చముల్లంగిని తినకూడదను బోధకులు పలువురున్నారు; అర్ధరహితమగు సాధనలను ఆచరణలో ఒక్క యడుగైనను సత్యమునకు చేరువగా కొనిపోజాలని వందలాది యితరనియమములను పాటించుమని నిర్బంధింతురు. ఇది శిక్షణయే కాదు. అట్టి బోధకులు నిజముగా తమ్ముతాము వంచించుకొనుటేగాక తమ బోధనల వినువారిని కూడా వంచించుచున్నారు. అంతర్గత శాంతి, మానసిక నిశ్చలత, నిరాడంబరత, లాఘవము అనునవి సాధనలసహజఫలితముగా సమకూరకున్నచో నీవు తప్పుదారి యందు పయనించుచున్నావనియు, నీవు పొందెడి శిక్షణ లోపభూయిష్టమనియు నిశ్చయముగా గ్రహించవచ్చును.

నేడు సాధారణముగా పెక్కుమంది బోధకులు అనుసరించు ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతులు మన ప్రాపంచిక జీవనమునకు భిన్నమైన కఠిన నియమ నిబంధనలపై నాధారపడియున్నవి. ప్రాపంచిక జీవనమును సాగించువారికి అవి ఆచరణయోగ్యము కావని పెక్కు విషయములలో నిరూపితములగుచున్నవి. సాధారణముగా బోధకులు అనుసరించు ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతులు మన ప్రాపంచిక జీవనమునకు భిన్న

మైన కఠిన నియమ నిబంధనలపై నాధారపడియున్నవి. సాధారణముగా బోధకులు ప్రజలను ప్రాపంచిక విషయములతో సంబంధములు త్రెంచుకొనిన ప్రత్యేకజీవన విధానము గైకొని నిగ్రహము పాటించ వలెననియు, గంటల తరబడి భక్తిసాధన యొనర్చవలెననియు ఉద్బోధింతురు. అట్టి శిక్షణ ప్రాపంచిక బంధముల నుండి విడివడ లేనట్టియు, భక్తిసాధనలకంత కాలము వినియోగింప లేనట్టియు, సామాన్యముగా ప్రజలందరకు ఉద్దేశింపబడినది కాదనుట స్పష్టము. ఈ కారణముననే వారి బోధనలు కోరిన ఫలము నీయజాలకున్నవి. కాగా వారెంతో ప్రయత్నించియు ప్రజలను తదనుగుణముగా తీర్చి దిద్దలేక పోవుచున్నారు. దీనికి మూలము వారు ప్రత్యక్ష సాధకులు గాక సిద్ధాంతవాదు లగుటే. మోక్షము కొరకు ప్రజాసామాన్యమున కెన్నడేని ప్రపంచము త్యజింప సాధ్యమా ? నిశ్చయముగా కాదు. సామాన్య ప్రజల కట్టి బోధనవలన కలుగు మేలేమి ? ఆధ్యాత్మికమున ఉన్నత సిద్ధులు గృహస్థాశ్రమమున సాధ్యము కావనెడి తప్పు భావమును ప్రకటించుటకు కూడా కొందరు సాహసింతురు. పలుమారులు గంగానదిలో మునుగు మనియు, పిండితో చేసిన గుళికలు చేపలకాహారముగా నిమ్మనియు, శాస్త్రములు మటిమటి చదువు మనియు పైపై మాటలు చెప్పుట తక్క సామాన్య ప్రజలకు బోధించుటకు వారి వద్ద నేమియునులేదు. మనకున్న సమస్యలోకమును పరిత్యజించిన ఏ కొలది మందికో ఆధ్యాత్మిక

శిక్షణా సౌకర్యములు కల్పించుటకాదు; అది భక్తి సంబంధమైన
వియేగాక నిర్లక్ష్యము చేయవీలుకాని ప్రాపంచిక ధర్మము లనే
కములుగల ప్రజలెల్లరకు అధ్యాత్మిక శిక్షణానుకూలములు
సమకూర్చుట. ఇందులో దేనినైనను నిర్లక్షించినచో వారు
ధర్మచ్యుతి పొందినట్లే. వారికి ఆధ్యాత్మిక ప్రాపంచిక జీవన
ములు రెండును సమాన తేజస్వంతములై ప్రక్క ప్రక్కన సాగ
వలెను. ఇందుకు మనము సరియైన సాధనలను కనిపెట్టవలెను.

కాబట్టి ప్రస్తుత ప్రాపంచిక జీవనమునకు చక్కగా సరి
పడు ఆధ్యాత్మిక శిక్షణయే సామాన్యుల ఆధ్యాత్మికాభివృద్ధికి
వలసిన ఏకైక విషయము. అది దురదృష్టవశమున ఇంత వరకు
నిర్లక్ష్యము చేయబడినది. అట్టి శిక్షణ కోసము పలువురి విష
యమున వేరొకరి సహాయము అవసరము. ఆ సహాయము
గురు ముఖమున లభించును. అతడే మన భావి నిర్ణేత. ఈ
సహాయమందిన తోడనే ఆధ్యాత్మిక జీవితము జాగృతమయి,
ఉన్నత ఆత్మ శక్తులు మన వృద్ధికి దోహద మొనర్చునట్లు
ఉద్బోధితములగును

అట్టి ప్రేరణ మన కష్టములనెప్పుడైనను పరిష్కరించుటకు
సన్నద్ధుడై, మనకందుబాటులో నున్నవాడై, మన సహచరు
లలో నొకడై మహోన్నతశక్తిసంపన్నుడైనట్టి వాని నుండియే
పొందనగును. దేవుళ్లనుగాని, క్షుద్రదేవతలనుగాని, గురు
వులుగా భావించి శరీర విముక్త జీవులను గురువులుగా స్వీక
రించి, ప్రేరణాదర్శకత్వముల పడయగోరుట పెక్కు సందర్భ

ములలో చాల ప్రమాదకరము. ఎవరు తమ అంతర్వాణి నుండి దర్శకత్వము లభించుచున్నదని యందురో వారి విషయము కూడా అట్టిదే. అంతర్వాణి కెక్కువ ప్రాధాన్యము నిచ్చు వారిని నేను చూచి యున్నాను. మనస్సునందు జనించెడి సమస్త వివాదాస్పద విషయములందును చక్కని మార్గదర్శి యదియని వారు తలతురు. అంతర్వాణియను దానిపై నాధార పడి, ఆధ్యాత్మిక రంగమున తప్పుదారి పట్టినవారి ప్రత్యక్ష ప్రమాణములున్నవి. వాస్తవముగా వారేది అంతర్వాణి యని, శరీర విముక్త జీవుడినుండి ప్రేరణయని భావింతురో అది కేవలము వారి క్రమశిక్షణారహితమగు మనస్సుయొక్క నాటకము. ఈ అవాంఛనీయాచరణము కొంతకాల మనుసరించినచో మనస్సు యోగ్యతకు మించినశక్తియు మితిమీరిన చురుకుదనమును కలదై, తానే ప్రశ్నించుకొని తానే సమాధాన మిచ్చుకొనుటకు మొదలిడును. దీనిని ప్రజలు యోగానుభవమునందు ఒక దశయనియు తాము శరీర విముక్త జీవులతో పరస్పరము సంభాషింపగల శక్తి గడించితి మనియు అపార్థము చేసికొందురు. నిజముగా వారు దానికెంతో దూరమందున్నారు. నిస్సందేహముగా నంతర్వాణి యెన్నడును తప్పుదారి పట్టనీయదు. కాని దానిని తెలిసికోగల అభివృద్ధిని పొందియున్నవారెందరున్నారు? అంతర్వాణి ననుసరింతుమని గొప్పలు చెప్పుకొను వారిలో పెక్కుమంది కది వినబడదు. వారు

కేవలము మానసిక విచిత్రపు వర్తనా వైఖరిచేత వెట్టి వార
లగుచున్నారు. ఆ మనస్సు తనకు తానే దేనినైనను సృష్టించ
గలదు. అది భయంకర పిశాచములను కూడా వారి దృష్టికి
తేగలదు. వృక్షముల నుండి, శిలలనుండి వింత శబ్దములను
వారిచే వినచేయగలదు. దీనికంతకు క్రమశిక్షణా రహితమును,
మలినసహితమునునగుస్థితియందున్నమనస్సుయొక్కకార్యకలా
పము లేమూలము.మల విక్షేపావరణములనెడి పొరలనుతొలగించి
మనస్సును పరిపూర్ణ సమత్వస్థితికి తెచ్చినగాని అంతర్వాణి
ప్రేరణగాని, దర్శకత్వముగాని యర్థరహితము. అంతర్వాణి
ననుసరింతుమనియు, శరీరముక్త జీవుడి నుండి బోధనలను స్వీక
రింతు మనియు, డాంబికములు పలుకు పెక్కుమంది యొనర్చు
నది నిజముగా వికృతమును, క్రమ శిక్షణా
రహితమునైన వారి మనస్సుల ఆజ్ఞలను శిరసావహించుటే.
అది కేవలము భ్రమ. మనమీ దురభ్యాస మలవరచు కొంటి
మేని అధోగతి పాలగుదుము. అది యెడ తెగని మానసిక ఆందో
ళన, వ్యధలకు దారి తీయును. భక్తు లనబడు వారిలో
ముఖ్యుడగు నొక పెద్ద మనిషిని నేనెరుగుదును. అతడు తాను
రామాయణ కర్తయగు తులసీదాసుని గురువుగా
చేసికొని, అతని ఆత్మతో సాక్షాత్సంయోగము
సాధించితినని బహిరంగముగా చెప్పుచుండెను. అతడు
తానేదో సాధించితినను సంతోషముతో నుబ్బిపోవుచు కొంత
కాలము గడిపెను. అటు తర్వాత నాతనికి స్వర్గవాసి యగు

నాతని గురువునకును మధ్య పొందిక తప్పెను. అది త్వరలో తీవ్రకలహమాయెను. అందువలన నిరంతర మాతడు మానసికముగా ప్రహతుడును, పీడితుడయ్యెనని యాతడే చెప్పుచుండెడివాడు. తన్మూలమున మానసిక సమత్వము పాడై, యతడు మిగుల దుఃఖితుడాయెను. అతని యా దుస్థితి రెండు సంవత్సరముల తీవ్ర పరిశ్రమ చేతగాని తొలగిపోలేదు. అప్పుడాత డది యంతయు భ్రమయని, ఆత్మ వంచనయని, తాను తులసీదాసుని యాత్మ నుండి వచ్చిన ప్రేరణయని యనుకొన్న దంతయు నిజముగా తన క్రమశిక్షణారహితమగు మనస్సుయొక్క యింద్రజాలమని గ్రహింపజాలెను. ఆ దుఃఖభాజన స్థితి తొలగిపోయి నందున నిపు డాతడు శాంతి నిశ్చలతలు మరల ననుభవించుచున్నాడు. వాస్తవమునకు అంతర్వాణి యనగా పరిపూర్ణపరిశుద్ధస్థితి యందున్న మనస్సుయొక్క వాక్కే! మనస్సున నున్న మలిన మాలిన్యములను శుభ్రపరచి, పరిపూర్ణప్రశాంత మితస్థితికి కొనివచ్చినగాని యది యెన్నడును అంతర్వాణిని ప్రతిధ్వనింపజాలదు. నిజమునకు పరిశుద్ధమనస్కుని విషయమున అంతర్వాణియే సదా మాట్లాడును. అతనికి ఉన్నత స్థితులను పొందిన శరీర ముక్త జీవులనుండి ప్రేరణ సంతత ధారగా ప్రవహించును. ఈ విధముగా నీ యలవాటు కడు నపాయకరమును, పెక్కు సందర్భములందు దారుణ పరిణామములకు దారి తీయునట్టిదియు నగుట స్పష్టము.

కఠిన పరిశ్రమతో గూడిన విడువని యత్నములు పెక్కు జీవితముల పర్యంతము సలుపవలసి నట్టిదనియు, అత్యంత కష్ట సాధ్య మనియు నింత వరకు భావింపబడుచున్న దైవ సాక్షాత్కారము వాస్తవమున నట్టిదిగాదు. భగవంతుడు సులభుడు. అటువంటి సులభ మార్గముననే యాతనిని పొందగలము. జీవిత కఠిన నియమ నిబంధనలును, సాక్షాత్కారమునకై గురువులు నిర్దేశించిన ప్రయాసకరమగు సాధనలును ప్రజలు సాక్షాత్కారము తమ శక్తి సామర్థ్యముల కతీతమని నమ్మునంత వరకు విషయములను క్లిష్టపరచి వైచినవి. మనస్ఫూర్తిగా దృష్టిని సాక్షాత్కారము వైపు మరల్చినచో అదియేమాత్రము కష్టముగాదని హృదయ పూర్వకముగా, విశ్వసనీయముగా, చెప్పుచున్నాను. లక్ష్యసాధన కొరకు స్థిర సంకల్పముతో సరియగు సాధనయు, మార్గదర్శకత్వము మాత్రమే సంపూర్ణ విజయమునకు కావలసినవి.

ఆధ్యాత్మిక శిక్షణ "అంతః శుద్ధి" లేక "చక్రము"లను శుద్ధి చేయుటతో ప్రారంభమగును. ఆధ్యాత్మిక పురోగమనమున నది అత్యంత ప్రధానాంశము. ఈ విధముగా అంతశ్శుద్ధితో ప్రారంభమగు సక్రమ శిక్షణా విధానమును నిరాదరించినచో యోగ మార్గమున సాధించిన శక్తి దుర్వినియోగమునకు దారితీయును. శుద్ధి పరచుటకు హఠ యోగ మెక్కువగా శారీరకాభ్యాసముల నియమించును. వాటిలో కొన్ని అనేకులకు కఠినమును, ప్రయాసకరమైనవి అగును. సహజమార్గ

విధానమున నది గురుని నుండి ప్రసారితమైన శక్తి సహాయముతో సులభమైన మానసికాభ్యాసముల చేతనే సాధింపనగును. కొందరు మత ప్రబోధకులు, ప్రజలు తమ మనస్సులను దైవిక యోచనలందే నిమగ్నమొనర్చి యుంచుటకు కొన్ని యాంత్రిక సాధనలు చేయవలెనని అందులకు రోజున కెనిమిది ఘంటలేని వినియోగించవలెనని నిర్బంధింతురు. మెదడును విసిగించునట్టి, మనస్సును కృంగదీయునట్టి సాధనలను విధించు శిక్షణా విధానమును నేను తీవ్రముగా ఖండింతును. అట్టి శిక్షణ వలన సహజముగా మనోవికాసమునకు దారి యుండక సాక్షాత్కార శక్తి మందగించి పోవును. ఈ పద్ధతి బాలునిలో ఏకాగ్రత కల్గించవలయునని వానిని చితుకమోదుట వంటిది. వలసినట్లుగా మనస్సును రూపొందించుటకు గాని, చక్రముల శుభ్రపరచుటకు గాని, గురువులచే సాధారణముగా పురస్కరింపబడు శారీరక సాధనలు కఠిన పరిశ్రమతో గూడి దీర్ఘమై, ప్రయాసకరమైన వగుట వలన అంత ఉపయోగకరములుగావు. అటుగాక మనము మన అభివృద్ధి కడ్డు తగిలెడి ప్రతిబంధకములను, చిక్కులను తొలగించు సామర్థ్యము గలిగి, శక్తిమంతుడైన గురువు దారి చూపగా ఈ పనికై మన యోచనా బలమును సరియైన మార్గములో నుపయోగించుకొందుము. అట్టి గురువు మన ఆధ్యాత్మిక జీవన సంరక్షణకై కావలసినంత శక్తిని మనలో ప్రతిపాదించును. ఈ తేలికయిన ఆధ్యాత్మిక

విధానము ప్రతియొక్కరును అతడు పురుషుడు గాని, స్త్రీ గాని, బాలుడుగాని, వృద్ధుడు గాని, గృహస్థుడు గాని విరక్తుడు గాని మహోన్నతాధ్యాత్మిక స్థితులను సాధించ వీలగునట్లు చేసినది.

సరియైన శిక్షణా విధానమున ప్రారంభదశ యందే అభ్యాసి మనోవైఖరి దైవోన్ముఖము కావింపబడును. ఇందు కొరకు పండితులయిన మత గురువులు మత గ్రంథముల నుండి గ్రహించిన శారీరక మానసిక బాహ్యాచరణలను విధించు చున్నారు. వాటిని పాటించుట ప్రజల కెంతయో దుష్కర మగు కార్యము. అందుచే వారు ప్రగతి లేకుండ ప్రారంభ దశ యందే చిక్కుకొని యుందురు. శాశ్వతముగాను, లోతుగాను పాతుకొని పోవు భక్తిని కల్గించుటకై అభ్యాసి మనోవైఖరిని దైవోన్ముఖ మొనర్చు పనిని సమర్థవంతుడగు గురువు తన ప్రాణాహుతి శక్తి నుపయోగించి, స్వయంకృషి తోడనే సాధించవలెను. మన మనస్సు భగవంతుని వైపు మొగ్గగనే మనము సహజముగా మన కార్య కరణము లన్నింటిలో ఆ సర్వశక్తిమంతుని తోడి సాంగత్యము ననుభూతి చెంద నారంభింతుము. మన మనస్సు నందిట్టి స్థితి శాశ్వతముగా నెలకొన్నప్పుడు మనము చేయు ప్రతి పనియు భక్తిలో భాగ మనియో, దైవారాధనమనియో అనిపించును. ఆ విధముగా మనము నిరంతరమును దైవచింతన గల వారమగుదుము. అభ్యాసి హృదయాంతర్గత స్పందనల ననుభూతి చెందనారం

భించును. ఇది "శబ్దము" లేక "అజప" మనెడి ఆధ్యాత్మిక స్థితి కారంభము. మనము సరియైన గురు సహాయమును పొంది, సక్రమ మార్గమున పయనించినచో నీస్థితి తనంత తానుగానే ఉత్పన్న మగును. బహుకాలముగా బాహ్యజపము చేయు చుండువారు కొందరు నిదురలో గూడ సాధారణముగా జపము చేయుచుందురు. దీనినే అజపము లేక శబ్దమని యపార్థము చేసికొందురు. నిజమున కది సరికాదు. నిరంతరా భ్యాసము వలన వారి నాలుకయు, హృదయమును దాని కలవాటు పడిపోయి, ఆ చర్య వారు నిద్రించునపుడు, స్మృతి తప్పినపుడు కూడ సాగిపోవును. కాని వారా అభ్యాసము కొంతకాలము విరమించినచో నది నిలచిపోవును. ఇది యభ్యాస బలమేగాని ప్రత్యక్ష అజపానుభవము కాదు. పెక్కేండ్ల కఠిన పరిశ్రమా నంతరము పొందదగు ఉన్నతాధ్యాత్మిక సాధనగా భావించు అజపస్థితి ప్రాణాహుతి విధానము నందు సక్రమ శిక్షణ ద్వారా కేవలము కొన్ని వారములలో లేదా కొన్ని దినములలోనే గడింపవీలగు స్థితి. ఈ విధముగా కలిగిన స్పందనములు హృదయమునందు కొంత కాలము నెలకొని క్రమక్రమముగా వృద్ధి చెంది యితర చక్రముల వరకు వ్యాపించి చివరకు శరీరమున అణువణువునకును వ్యాపించును. అప్పుడిది "అనహద్" అనబడును. మా సంస్థ యందు పాటించు పద్ధతి సమర్థవంత మగు గురుని సహాయమున ధ్యానము చేయుట. ఇది

యత్యంతోపకారి; బహుశః సంపూర్ణ విజయ సాధన కైకైక మార్గము కూడ.

సాధారణముగా ధ్యాన సమయమున ననంఖ్యాకము లగు ఆలోచనలు మనస్సున చొఱబాఱునని అనేకులు మొఱ పెట్టుదురు. వారు తమ మనస్సులను నిశ్చల స్థితికి తేకున్నంతవరకు వారి సాధనలో లోపమున్నదని వారను కొందురు. కాని అది సరికాదు. మనము ధ్యానము చేయు చున్నాము కాని మనస్సును కేంద్రీకరించుటకు సాధన చేయుట లేదు. ధ్యానకాలమున మన మనస్సును కలతపెట్టు అన్యాలోచనలను సరకు చేయక తదేకముగా ధ్యానముతో సాగిపోవలెను. ఆలోచనా స్రవంతి మన నిర్విరామమైన బాహ్య మనస్సు యొక్క కార్యకలాపముల వలన నుత్పన్న మగుచున్నది. మన బాహ్య మనస్సు ఆలోచనలను రూపొందించు కొనుచు నిందందు తిరుగాడుచున్నను మనము అంతర్మనస్సుతో ధ్యానము నందు లగ్నమై యుండవచ్చును. దీని వలన మనకు కలిగెడి నష్టమేమియు లేదు. వలసినంత సాధన చేయగా క్రమేణ బాహ్య మనస్సు కూడ చక్కగా రూపొంది, అంతర్మనస్సుతో సామరస్యము సమకూర్చుకో నారంభించును. ఇట్లు సాధించిన ఫలితము లోతుగా నాటుకొని పోయి చిరకాలముండునట్టిది. చివరకు ఆత్మ లక్షణమగు ప్రశాంతతయే ప్రధానమగును. కొన్ని ఎడల గురువులు తమ సంకల్ప బలము నుపయోగించి ధ్యానకాలమందు సామాన్య

మనఃకృత్యముల నరికట్టి తాత్కాలిక చేతనారహిత స్థితినిగాని, బుద్ధి మాంద్యమును గాని కల్పించుట నేను గమనించినాడను. "సత్యము" ను ఎరుగని ప్రారంభకునకీ స్థితి నిస్సందేహముగా నత్యంతాకర్షణీయమగును. ఈ యసాధారణ శక్తి ప్రదర్శన మున కాతడు ముగ్ధుడగును. నా అభిప్రాయములో ఇది యంతయు తమ గురుత్వమును ప్రతిపాదించుకొనుటకై అసంఖ్యాకమగు శిష్య వర్గము నాకర్షించుట కాతురపడువారి గారడీయేగాని వేఱుగాదు. ఏ ఇతరమైన ఉద్దేశ్యము లేకుండ స్వీయ ప్రాముఖ్యమే ప్రధానోద్దేశ్యముగా గల ఆధ్యాత్మి కోపదేశకుడు తన శక్తిని కేవలము దుర్వినియోగ పరచు చున్నాడు అని అందును. అది అపమార్గము. అభ్యాసి యొక్క ఆధ్యాత్మిక ప్రగతికి గొడ్డలి పెట్టు. అట్లు అణచి నట్టిగాని, నిలువరింప జేసినట్టిగాని, ఆలోచనలు మరింత శక్తితో ప్రతి చర్య మొదలిడి యావద్వ్యవస్థనే చెడగొట్టును. పైగా ఈ పద్ధతి ఆంతరంగిక భారమును, బుద్ధిమాంద్యమును కలిగించును. అట్టి సాధనకు దీర్ఘకాలము లోనైన వాడు వివేక జ్ఞానమును కోల్పోవును. వాని అవగాహనా శక్తి మొక్కవోవును. కాల క్రమమున అతడు పూర్తిగా చెడిపోయి, నిజమగు ఆధ్యాత్మిక శిక్షణకు కూడ అనర్హుడగును. దినదిన ప్రవర్ధమానమగు తేలిక తనము అనుభవమునకు రానిచో అభ్యాసి పొందుచున్న

ఆధ్యాత్మిక శిక్షణ సరియైనది కాదని నిర్ణయించుకొనవలెను. మనస్సునందును, ఆత్మ యందును నిరవధిక లాఘవాభివృద్ధి కానవచ్చినచో నదియే ఆధ్యాత్మిక పురోగతికి నిక్కమగు నిదర్శనము.

ఈ విధముగా మనస్సును సుశిక్షితమును, క్రమబద్ధమును చేసి, ఇంద్రియ మనశ్శక్తులందు మితభావమును నెలకొల్పి, ఆత్మయందు లాఘవమును మొలకెత్తించు నట్టిదియే వాస్తవికాధ్యాత్మిక శిక్షణ. అట్టి శిక్షణ పొందిననే అంతరంగిక ప్రశాంతత, నిశ్చలతలు సంప్రాప్తమయి ఊర్ధ్వ గతి సాధ్యమగును. ఇందుకు ప్రాణాహుతి శక్తి తన యిచ్ఛ వచ్చినట్లు ఉపయోగింప సమర్థుడై, సమున్నత శక్తి మంతుడగు యోగ్య గురుని మధ్యవర్తిత్వము అత్యంతావశ్యక మగును. అట్టి గురునకు సంపూర్ణ భక్తి విశ్వాసములతో అభ్యాసి తప్పక శరణాగతుడు కావలెను.

జీవిత సమస్యా పరిష్కారమునకు దీక్షపుచ్చు కొనుటయే చాలునని కొందరనుకొందురు. ఏదే నొక విధముగా నొక గురుని యొద్ద దీక్షను పొంద గలిగినట్లయిన వారికి వేరు యత్నముగాని, సాధనగాని పనిలేదని వారి భావన. అంత్యమున గురువొసగెడి త్రోపు వలన మాయా సంస్కార బంధనముల నుండి విముక్తులై మోక్షమున కరిగెదరని వారి తలంపు. ఆ భావన వాచ్యముగా నిజమై

నప్పటికిని గురువు విశిష్ట శక్తివంతుడైయుండి, నీవు పూర్తిగా నాతని శరణు జొచ్చిననే తప్ప అంతగా ఉపయోగకారి కాదు. శిష్యుని ఉన్నత పురోగతులు గురువు హృదయమున నిస్సందేహముగా ప్రధాన స్థానము నాక్రమించి యుండును. వాటి కొరకు గురువు కూడ తన శక్తి మేరకు శ్రమించును. అంత మాత్రమున మనము మన వంతు పని కూడ అతనికే వదిలిపెట్టి యూరకుండుట సరికాదు. ఎంతమేరకు మనకు మనమై నిర్వర్తించగలమో అంత మేరకు మన నిమిత్తము అతడు అనవసరపు శ్రమకు లోను గాకుండ ప్రయత్నించుట మన ధర్మము. మన కర్తవ్యము నెట్టి సందర్భముననను నిర్లక్ష్యము చేయరాదు.

పెక్కు మంది మత గురువులు అభ్యాసియందు కొన్ని ఆధ్యాత్మిక స్థితులను నెలకొల్పుటకు అసహజ పద్ధతుల నవలంబించుచున్నారు. కాని, యిది చాల లోప భూయిష్టమగు మార్గము. ఉదాహరణకు జ్ఞాన సాధనార్థమును, అభ్యాసిలో "అహం బ్రహ్మాస్మి" యనెడి స్థితిని సృష్టించుటకును, దానిని సదా తలంచుచును, ఆ పదములనే ప్రతిక్షణమును వల్లించుచును, బాహ్యముగా ధ్యానించుమని అతని కుపదేశింతురు. ఇది యాంత్రికమైన పద్ధతి. అందుచే అంతర స్థూలత్వమునకు గారి తీయును. నిజమైన "అహం బ్రహ్మాస్మి" అనెడి స్థితి యెన్నడును నిట్టి యస్వాభావిక మార్గమున కలుగదు. అవే పదములను

మఱి మఱి వల్లించుట వలన నాతని నాలుక వాటి కలవాటు పడిపోవును. ప్రతి క్షణము వాని నోటి నుండి యా పదములే దొరలు చుండును. అందువలన వాడు వాస్తవముగా జ్ఞాని యయ్యెననుకొనుట అసంగతము. వందసార్లా మాటల వల్లించ వచ్చును; ప్రతి క్షణమును, ప్రతి వస్తువును బ్రహ్మముగా నూహించుకొనుటకు భావనా బలమును నిర్బంధించ వచ్చును; కాని, ఆ స్థితినుండి మొదట నున్నంత దూరముననే ఎల్లకాలము ఉందురు. ఈ సాధన అభ్యాసి చుట్టును కృత్రిమ వాతావరణ మును సృష్టించును. అది యాత డెల్లప్పుడును బాహిరముగా దానినే ఊహించు కొనునట్లు చేయును. అతడా మాటలు వల్లించు అలవాటు మానిన తోడనే ఆస్థితి మాయమై పోవును. ఇట్లు నెలకొల్పబడుననుకొనెడి అహంబ్రహ్మాస్మిస్థితి నిజముగా యదార్థము కాదనియు, అది కేవలము అసత్యమును, ఊహా జనితమును అనుట ఇందు మూలముననే తేట తెల్లము. ఇదిగాక అహంబ్రహ్మాస్మి స్థితి సాధారణముగా చాల ఉన్నతస్థితి అని భావింప బడుచున్నది. కాని నిజమునకది సరికాదు. ఈ దశయందు మానవుడు కొంతవరకు మాయా బంధనముల నుండి విడివడినప్పటికిని వాస్తవముగా దాని యంతిమ పరి మితుల కతీతుడు కాడు. ఈ దశయందింకను తాననెడి యెరుక యుండును. ఇది అతి సూక్ష్మ రూపముననున్న స్థౌల్యమే కాని యితరము గాదు. అదియే యన్నింటి కంటెను గొప్పదైన

జ్ఞానమనియు, దాని కావల పొందవలసిన దేమియు లేదనియు, వేదికల నుండి బోధనలు చేయువారు పూర్తిగా పొరపడినవారు. అది మన గమ్యస్థానము కాదు. మనము తదుపరి దశయందు కాలిడుటకు కేవలము దానిని నధిగమింతుము. అదియే సత్య మని గాని, అంతిమ గమ్యమనిగాని భావించి, దానికే అంటి పెట్టుకొని యెవరుందురో వారు తీవ్రమైన పొరపాటునకు లోనైనవారు. తుదకు మనము "అహం" అను భావముతో సహా అంతయు నశించిన స్థితికి చేరవలెను.

చిట్టచివరకు మనము పొందవలసిన సంపూర్ణ శూన్యస్థితి అట్టిది. అచ్చట అహం శబ్దము పరివర్తన చెంది యుండును. అహం బ్రహ్మాస్మి స్థితి, మనము సరియైన మార్గదర్శకత్వమున పురోగమించుచుండగా మనలోని చైతన్యము వలన తానుగా నుత్పన్నమగుచున్నది. మనలో నది స్పందనముల రేకెత్తించును. తత్ఫలితముగా మనస్సు ఆ స్పందనములను ప్రతి ధ్వనింప జేయును. ఈ మనస్థితి ఆధ్యాత్మిక ప్రగతిలో ప్రతిదశయందును "నేను బ్రహ్మము" "అంతయు బ్రహ్మము" "అంతయు బ్రహ్మము నుండి" అనెడి త్రివిధరూపముల గోచరించును. త్రివి ధాత్మకమగు ఈ స్థితియంతయు నిజమునకు బహురూపముల కాన వచ్చెడి భిన్నత్వములో నేకత్వమే. అది పిండదేశమున అపరిష్కృత రూపమున పొడసూపును. బ్రహ్మాండ మండలమున

అది సూక్ష్మతరమగును. పరబ్రహ్మ మండలమున అది అత్యంత సూక్ష్మరూపమునకు మారును. ఈ స్థితులన్నియుద్వితీయాధ్యాయములోని పటమున చూపిన పదునాలు వృత్తము లందలి తొలివృత్తములోనే సమాప్తమగుచున్నవి.

అందు వలన ఆధ్యాత్మికాభ్యాసి అంతశ్శుద్ధికిని, చక్ర పరిశుద్ధీకరణమునకును, తగు ప్రాధాన్యము నిచ్చును. ఇంద్రియ మానసిక శక్తుల వినియోగమునందు సంపూర్ణ మిత భావమును కలిగి నిజమైనట్టియు, సమర్థుడైనట్టియు, గురుని సహాయమున సహజ మార్గమున పయనించుటయే సరియైన శిక్షణాక్రమము.

# 6

# శ్రద్ధ

సంకల్పము, శ్రద్ధ, విశ్వాసము, ఇవి సాక్షాత్కార మార్గమున సులభముగ విజయమును చేకూర్చు ప్రాథమికాంశములు. సత్యమును సాధించుటకై దృఢ సంకల్పము కల్గియుండిన మనము ఆత్మజ్ఞాన విషయమున అంతరంగికముగా జాగృతమై యున్నామన్నమాట. ఆ యుద్దేశ్యము తోడనే మనము మార్గము నెంచుకొందుము. మనము తీవ్రముగా గమనించవలసిన తొలి విషయము మన మెంచుకొను మార్గము నేరుగా మనలను గమ్యస్థానమునకు చేర్చునట్టి సరియైన మార్గమా అన్నది. అందుచేత, అంతిమ గమ్యస్థానమును గూర్చి మన మనస్సు స్పష్టమును, నిర్దిష్టమునునగు భావము కలిగియుండుట అత్యావశ్యకము. వేర్వేరు జనుల అంతిమ గమ్యము అనేకాంశములందు వేర్వేరు కావచ్చును. అందువలన దానిని పొందు మార్గములు కూడ వేర్వేరుగా నుండవచ్చును. కావున, మన మే గమ్యస్థానమును పొంద కోరుదుమో నూటిగా మనల నచటికిచేర్చు మార్గమునే మన మెన్నుకోవలెను. ఈ విషయమున తొందరపడి నిర్ణయము తీసుకొన్నచో నది తరచు నిరాశాజనక ఫలితములకు దారితీయును. ఏలయన ప్రోద్బలముచే నీవే మార్గమును అనుసరింప సమకట్టితివో అది

నిర్ణయించిన గమ్యస్థానమునకు చేర్చునది కాకపోవచ్చును. తప్పు త్రోవ త్రొక్కుటచే తరచు సత్యపదార్థము కనుమరుగై పోవును. అటుపై అసత్యభావమును, భ్రమలును కలుగును. ఆ దారినే విడువక పోవుచున్నచో సత్యపదార్థము చేరు మార్గము దుస్సాధ్యమగును. దురదృష్టవశమున లోప భూయిష్ట మార్గ దర్శకత్వమునకు, సరికాని శిక్షణకు లోనైనచో తరచు నిది తటస్థించును.

అందుచేత, ఆదిలోనే సాక్షాత్కారమునకై చేపట్టిన మార్గము నిజముగా సరియైనదేయని తీర్మానించుటకు సాధ్య మైన ప్రతి సాధనోపకరణమును వినియోగించుకొనుచుట తప్పని సరిగా నావశ్యకము. బహు పురాతన మైనదని యొక మార్గమునుచేపట్టబోకుము. బహుపురాతనమైనది మారిపోయిన ప్రాపంచిక, సామాజిక పరిస్థితులకు బొత్తిగా పొసగనిది కావచ్చును. బహుళ జనాదరణ పొందినదని యొక మార్గము ననుసరింప వలదు. పెక్కుమంది ఎప్పుడును తప్పు చేయరన లేము, పైగా పెక్కుమంది తరచు ఏ కొలదిమందినో వెన్నంటి పోవుచుందురు. ఆ కొలది మంది కూడా చాల వరకు తప్పు దారి త్రొక్కించ బడిన వారు కావచ్చును. ఒక విషయమున గుణ నిర్ణయ మొనర్చునప్పుడు మనము సంపూర్ణ ముగా మన కందుబాటులో నున్న సర్వ సాధనోప కరణముల నుపయో గించి, సహృదయత గలిగి యుండవలెను. మనము హేతువాద స్వానుభవములతో చక్కగా విచారించి పరీక్షకు పెట్టి చూడక

తొందరపడి తుది నిర్ణయమునకు రారాదు. చివరకు ఆ విషయము గుణసహితమని తృప్తి గలిగిన మీదట శ్రద్ధ తోడను, నిలకడతోడను దానినంటిపెట్టుకొనవచ్చును. ఈ రీతిగా కుదురుకొన్న శ్రద్ధ యదార్థమును, చిరస్థాయియై ఉండును. బాహ్యాకర్షకలక్షణముల చేతను, మోహన కరములగు భౌతిక సాఫల్య ప్రదర్శనముల చేతను ప్రోత్సహితులై శ్రద్ధ పెంపొందించుకొన్నచో నది శ్రద్ధ కానేకాదు. దానిని ప్రోద్బల మనవచ్చును. దానికి చక్కగా నిలబడుటకు స్థిరమైన పునాది లేదు. అది సాధారణమైన ప్రతికూల పరిస్థితులలో మాయమైపోవును.

భౌతికఘనస్వరూపములలో నున్న విగ్రహములను స్థూల పద్ధతిలో ఆరాధించుట, నియమ నిష్ఠలకు గట్టిగా కట్టుబడి యుండుట, నిజమైన శ్రద్ధను గల్గింపవు. అట్టి కేవల భౌతిక వాదము విద్వేషమును పెంపొందించును. కాని దాని ననుసరించు వారిలో యదార్థమగు శ్రద్ధ నెల కొనదు. వారు ప్రోత్సాహము ననుసరించి దేనినైనను గ్రుడ్డిగా నమ్ముదురు. వారు వివేచనా శక్తి నుపయోగించుటకుగాని, ఔచిత్యమును నిర్ణయించుటకుగాని తావియ్యరు. వారు ఏ ఇతర మార్గమునూ కూడా పరికించుట కియ్యకొనరు. నేరుగా సత్యము దరికి కొంపోవు కొన్ని ఇతర మార్గములు ఫలదాయకములైనవని యొప్పుకొనువారున్నారు. కాని వారా మార్గములను అనుసరించుటకు సిద్ధముగా లేరు. ఇందులకు కారణము

తాము తొలుత చేపట్టిన మార్గమును వారు వీడలే మందురు. వాస్తవమునకు వారికి సత్యము నందు నమ్మిక లేదు. వారికి నియమ నిష్ఠలయందే విశ్వాసము. దీనిని తప్పక వైషమ్య భావమని పిలువదగును. వారి దృష్టి పరిమితమనియు, వారు సత్యము నన్వేషించుటకై పైకి పోలేకున్నారనియు దీని యర్థము. వారి తల వ్రాత అంతే. వారు సర్వదా ఆ సంకు చిత పరిధిలోనే ఉండిపోవుదురు. నిక్కముగా మనల నేది యున్నతి నందనీక క్రిందనే పడవైచి యుంచునో దానిని శ్రద్ధయని పిలువరాదు. అందుచేతనే ప్రతి యొక్కరును భక్తివిశ్వాసములతో పరమ సత్యముపై దృష్టి నిలిపి, ఆత్మ సాక్షాత్కారమునకు తోడ్పడు మార్గము ననుసరించుట అత్యంతా వశ్యకము. అప్పుడు మన మంతిమ స్థితి వరకు పయనింతుము. అచట సృష్ట్యాది యందు మనమెట్టి స్వచ్ఛరూపమున నుంటిమో అట్టి రూపము పొందెదము. దీనికి మనము తప్పని సరిగా మాయ, సంస్కారములు, అహంకారము అనెడి మన సంచి తములను వీడి, ప్రతి యడుగున తేలిక యగుచు పోవలెను. ఇట్లు స్థూల రూపములగు నారాధనలు అంతస్సాంద్రతతో, మనోభారముల పెంపొందించి, మన ఆధ్యాత్మిక ప్రగతికి గొప్ప ప్రతి బంధకములగును. కాన వాటిని ఆదరించరాదు. వాటిని ప్రవృద్ధమానమగు శ్రద్ధతో నాచరించు వారు నిరతా నంద సామ్రాజ్యమునకు కడుంగడు దూరమై, కంటు కావృత మైన స్థౌల్య కాపట్య నికుంజములందు చిక్కువడి యుందురు.

ఆధ్యాత్మిక జీవనమున మరొక ముఖ్యాంశము గురువు నందు విశ్వాసము. ఏలయన, నేను పైన చెప్పినట్లు ఉన్నతాధ్యాత్మిక స్థితుల సాధించుటకు సమర్థుఁడగు గురుని సహాయము ఉపేక్షింపరానిది. అభ్యాసికి దైవ ప్రేరణ లభించుట కాతడే మధ్యవర్తి. అందుచేత మన మెంచుకొనెడి మార్గదర్శి మహోన్నత సామర్థ్యము గలవాడును, అనుభవ సిద్ధులు కలవాడునునై యుండుట కేవల మవశ్యము. మార్గ దర్శకుని అర్హతను నిర్ణయించుటకు మన మతనితో కొంత కాలము కూడియుండి, అతనిని మన వశముననున్న సమస్తోప కరణముల చేతను పరీక్షించవలెను. అట్లు మనము హేతు వాద స్వానుభవముల ద్వారా అతని సామర్థ్యమును గూర్చి సంతృప్తుల మైనచో నతనిని మన గురువుగా స్వీకరించి అతని నిర్దేశ్యములకు విధేయులము కావచ్చును. ఈ సూత్రము నిరాదరించిన యెడల మనము నిర్ణయము తీసికొనుటలో మోసపోవచ్చును. మన మెవనినిగాని గ్రుడ్డిగా, వాని బాహ్యస్వరూప జ్ఞాన ప్రదర్శనముల చేత నాకర్షితులమై అనుస రింపరాదు. ఒక వ్యక్తియొక్క యదార్థ గుణములను సరిగా నిర్ణయించుటకు ఆధ్యాత్మిక రంగమున అతని అనుభవ సిద్ధు లను లెక్కలోనికి తీసికొనవలెను. మనము యే సత్యతత్వము అకాంక్షింతుమో దానినే అతని యందన్వేషించవలెను. ఈ రీతిగా మనకు నమ్మకము కుదిరినచో మనము సహజముగా నాతని యెడ నంతర్గతమగు నాకర్షణ ననుభూతి చెంద నారం భింతుము. అటుపై, అతడే మనపాలిటి భావి నిర్ణేతయని

భావింతుము. ఈ భావము క్రమముగా శ్రద్ధగా పరిణతి చెంది మన మాతనిని ప్రేమించనారంభింతుము. మన మాతని వ్యక్తిత్వమునకు తగు గౌరవ మిచ్చి, యాతని భావములకు తల యొగ్గి, యాతడు నిర్దేశించిన పథమున సాగిపోయెదము. శిక్షణావసరమున గడించిన ఫలితముల అనుభవ జ్ఞానమే గురుని అసాధారణ శక్తులను గూర్చి మనకు మరింత నమ్మిక ఏర్ప రచును. మనము అతనినొక మానవాతీతునిగా చూడ మొదలిడెదము. ఇప్పుడు మన శ్రద్ధ మన ఆధ్యాత్మికాభివృద్ధికి చాల సహాయకారి యగును. అది సందేహ మేఘములను పార ద్రోలి, మన త్రోవలోని యడ్డములను, అగచాట్లను తొలగించి వేయును. శ్రద్ధ నిజముగా ఆధ్యాత్మిక నిర్మాణమున కంతకును ఆధారపీఠము. నీవు నిక్కముగా విజయము కోరినచో సత్యమునందు శ్రద్ధ, సాక్షాత్కారమునకై నీవనుసరించుమార్గము నందుశ్రద్ధ, విధేయతతో నీవు సేవించుచున్న యోగ్య గురువు నందుశ్రద్ధ, ఇవియేనీ ఆధ్యాత్మిక మహాసౌధమునకు ఆధారశిల. ఈ శ్రద్ధ పాదుకొన్నచో నీలో నొక అంతశ్శక్తి, నిన్ను ఆవరించిన దుష్టశక్తుల నన్నింటిని విదళింప జాలినంత మహత్తరమైనది ఉత్పన్నమగును. అది నీ కవసరము కలిగినపుడెల్ల క్రొంగ్రొత్త దైవప్రేరణ నాకర్షించుటకు సహాయ పడును.

కొందరు శ్రద్ధను ఎంతో తప్పుడు దృష్టితో పరికింతురు. వారు ఏ మార్గమవలంబించినను, ఏ గురువును సేవించినను శ్రద్ధ యొక్కటే వారి జీవిత సమస్యను పరిష్కరించ జాలి

యున్నదని వారి నమ్మిక. ఈ వివేక రహితమగు నమ్మిక కంటె తప్పు దారి పట్టించునది మరొకటుండబోదు. కలకత్తా పోవుటకు తిన్నగా వ్యతిరేక దిశలో వెళ్ళి ఎవడైనను కలకత్తా చేరగలడా ? స్వార్థపరుడు, మోసగాడు అయిన వాని కధీనుడై ఎవడైనను తాను స్వార్థరహితుడగు మహాత్ముఁడు కాగలడా ? తన గొప్ప కోసము పాటు పడువాడును, భౌతిక వస్తువుల యెడ వ్యామోహము కలవాడునైన ఆత్మవంచకుని అనుసరించి అసూయా హంకార దూషిత స్వాతి- శయము, విద్వేషముల నుండి తన్ను తాను విడి వరచు కోగలడా ? మనము కేవలము పై పై మెరుగులు చూచి భ్రమసిపోరాదు. లోతుకు వెళ్ళి, అట్టడుగున నున్న సత్యమును గ్రహింప వలెను. బాహిరమైన శక్తి జ్ఞాన వక్తృత్వ ప్రదర్శనల వలని ఆకర్షణ గుడ్డి నమ్మకమును పెంపొందించును. అది పెక్కు సదర్భములలో దారుణ ఫలితములకు దారి తీయును. వాటి కాధ్యాత్మిక రంగమున ప్రాముఖ్యము లేదు. అట్టి తప్పుడు ప్రదర్శనల మాయలో సజ్జనుడెప్పుడును గ్రుడ్డిగా పడిపోడు. నీవు త్రొక్కిన దారి యాదృచ్ఛికముగా సరియైన దైనప్పుడును, నీవెంచుకొన్న గురువు మహోన్నత శక్తి మంతుడును, బంధనా స్వాతిశయ భావ విదూరుడైన యోగ్యుడైనప్పుడును, మాత్రమే గ్రుడ్డి నమ్మకము నిస్సంశయముగా చాల ఉపయోగ కారి. కాన, అట్టి గురుని యందు నీ సడలని విశ్వాసము నిన్ను సుదూర ఆధ్యాత్మికోన్నత స్థితికి కొనిపోవును. నీవప్పుడు సత్యముతోనే సంబంధము గలిగియుందువు.

శ్రద్ధ వాస్తవార్థమున, మర్త్యుని అమరునితో కలిపెడి యొక సజీవ సంబంధము. నిస్సంశయముగా నది అమరత్వముతో సంబంధ మేర్పరచుకొనియున్న గురుని ద్వారా మాత్రమే జరుగగలదు. ఒక మారేర్పరుపబడినచో ఆ సంబంధము ఏ పరిస్థితిలోను తెగిపోదు. అది మన పురోగమన మున అంతిమ స్థితి వరకు నిలిచియుండును. ఇది తృతీయ యోగ సాధనమందలి షట్సంపత్తిలో నొకటి. ఈ దశయందు శ్రద్ధ వాస్తవమును, స్వచ్ఛము. దాని నుండి ఎవరును క్షణమైనను దూరము కాలేనంతటి దృఢముగా పాదు కొనును. ఇందులకు కారణములు అతని ఊహాకందవు. ఈ దశకు పూర్వము శ్రద్ధ నిజముగా కృత్రిమమైనది; వివిధ కారణముల మూలమున నది పలుమారులు ఏర్పడుచు, సడలి పోవుచు, మరల పొంద బడుచుండును. యోగ్యుడయిన గురువు దానిపై నాధారపడడు. శిష్యుని భక్తి ప్రేమ భావోద్రేకముల సహించుచు, అతడు చతుర్విధ యోగ సాధనలలో చెప్పినట్లు శ్రద్ధ యొక్క అంతిమ దశ వచ్చువరకు గురువు ఓరిమితో వేచియుండును. అపుడు శ్రద్ధ ఆత్మార్పణ రూపము దాల్చ నారంభించును. నిజమైన శ్రద్ధ వర్ణింపనలవి గాని సుగుణము. అది మత పరిధి కతీతమైనది. సడలని ధైర్యమే మనకు జయము చేకూర్చును. ఆ సర్వవ్యాపక శక్తియే మన దారిని సుగమ మొనర్చును. వాస్తమున అదొక్కటే మన జీవిత సమస్యను పరిష్కరించునది.

# నిరంతరస్మరణము

వివిధములైన భౌతికావసరముల సమకూర్చుకొను ప్రాకులాటలో తగుల్కొని యున్న పెక్కురు కఠినమును, దుఃఖ భాజనమును అగు జీవితము గడుపుచున్నారు. అట్టి వారు వారి జీవిత సమస్యలతో ఎంత వరకు సతమతమగు చున్నారనగా వారు నిర్లక్ష్యము చేయరాని అతి ప్రధాన జీవితావసరమును గాని, ఆర్థిక లాభమును గాని పోగొట్టు కొనిననే తప్ప భక్తి ప్రపత్తులకు తమ కాలము వినియోగించ లేమని నమ్ముచున్నారు. కొన్ని వేళల వారి విషయము గమనించినట్లు కనబడుచున్నను, ఈ భావము వారిని ధర్మ పథము నుండి దూర మొనరించును. కాని, వారి మనస్సులు ప్రతి క్షణము అసంఖ్యాక ప్రాపంచిక జీవిత సమస్యల గూర్చి ఆలోచించుట యందే నిమగ్నమై యుండును. ప్రగాఢ సంతాపమునందో, దుఃఖమునందో మునిగి యున్నపుడుతప్ప తక్కిన యెడల వారి మనస్సులను దైవము వైపు మరలించుట లేదు. కారణమేమన, నిరంతము వారి దృష్టిలో నిలిచియుండు ప్రాపంచిక లాభమునకే వారు ప్రాథమిక ప్రాముఖ్య మిత్తురు. ఇట్లు వారు మాయలో చిక్కువడి ఎప్పుడును అందుండి

బయటపడ నాలోచింపరు. మనము మన దృష్టిని భగవంతుని వైపు మరల్చి, సాక్షాత్కారమే ప్రాథమిక జీవన లక్ష్యముగా భావింతుమేని దానినే ప్రపంచములో తక్కిన అన్నిటి కంటె సర్వోత్కృష్టముగాను, సర్వ ప్రథమము గాను, చూడ నారంభింతుము. అట్లని మనము మన ప్రాపంచిక బాధ్యతల మరచి, మనపై నాధారపడిన వారికి దుఃఖమును, దురవస్థను కల్గించునట్లుగా మన కర్తవ్యమును నిర్లక్ష్యము చేయుమని కాదు. దైవము నెడల యెట్లో, వారి యెడల నట్టే మన కర్తవ్యమును నెప్పుడును నేమరరాదు. కాని, వాటిలో తగని రీతిగా తగులుకోరాదు. ఇందుకు మన విరామ కాలములో (పడుకొన బోవుటకు ముందైనచో మరియు మంచిది) కొన్ని నిమిషములు వినియోగించి, ధర్మ పథమున దైవ సహాయ సహకారము లపేక్షించి, శ్రద్ధతో గూడిన హృదయముతో దేవుని ప్రార్థించవలెను. ఇట్లు మనము సక్రమముగా భక్తి ప్రేమలు నిండిన హృదయముతో చేసిన ప్రార్థన ఎన్నడును ఆలకింపకుండుట జరుగదు.

అట్లు కర్తవ్య పరాయణత మనలో మేల్కొల్ప మన హృదయములందు భగవద్భావము ప్రధాన రూపము దాల్చినచో మనము సాక్షాత్కారమును జీవిత ప్రాథమిక లక్ష్యముగా తీసుకొన నారంభింతుము. సహజముగా దాని గురించిన ఆరాటము మనలో దృఢతరమగుచు పోవును. అట్లు మనము ఎన్ని వ్యాపకములు, వ్యధలు ఉన్నప్పటికిని, దైనందిన

కార్యక్రమములలో కూడ దేవుని పలుమారు స్మరించుట జరుగును. కర్తవ్య పథము నుండి వైదొలగుట నిజమునకు పరిస్థితుల వలనగాని, బాహ్యావ్యాపకముల వలనగాని కాదు. అది కేవలము తప్పుదారి పట్టిన అశిక్షిత మానసిక కార్యకలాపముల వలన అగుచున్నది. కేవలము దైవపరమైన ఎరుకయే పెక్కు మానసిక దుర్గుణములను మాన్పి, మన దారి యందు కష్టములను తొలగించును. మన మా విధముగా మన ప్రాపంచిక కార్యకలాపములందంతటను దినమున చాల భాగము వరకు భగవత్పరమైన ఎరుక కలిగియుండవలెను.

తరచు భగవంతుని స్మరించుట చాల సహాయకారి అయినప్పటికినీ సాక్షాత్కార విషయమున అంతిమ విజయమునకు మనకు కావలసిన దంతియేకాదు. సాధారణముగా మన మే ముఖ్య కార్యమైనప్పటికినీ దేవుని పేరున మొదలిడుదుము. అట్లుచేయుట అన్ని మతముల వారికిని ఆచారమే. అది యొక లాంఛనము. అంతే గాని, దానిలో ఏ అంతరార్థము లేదు. మనము దానిని సరియైన భావముతో నిజముగా భగవంతునికి అంకితము చేయుటలేదు. హృదయాంతరములో వాస్తవమునకు భగవంతుడనెడి భావమునకే కడుదూర మందున్నాము. ఇట్లు దేవుని స్మరించుట యన్నది నిరర్థకము. ఈ ఆచారములోని అంతరార్థము మన దైహిక, మానసిక కార్యకలాపములన్నింటిలోను భగవద్భావముతో సాన్నిహిత్యము కలిగి

యుండుట. ప్రతిక్షణమును ఆ అనంత శక్తి స్వరూపునితో సంబంధము కలిగియున్నట్లు అనుభూతి చెందుచు అన్ని పనులందును ఎడతెగని ఆలోచనా స్రవంతికలిగి యుండవలెను. మన చేతలు, కార్యములు, దైవకైంకర్యమున భాగమేయనియు, ఆ మహాప్రభుని మనకు వీలైనంత చక్కగా సేవించుటకై మన కొసంగ బడిన సాధనములే యివి యనియు భావించినచో దానిని తేలికగా సాధించ వీలగును. ఆధ్యాత్మిక దేవాలయ నిర్మాణ కార్యమున సేవా త్యాగములనునవి రెండును అతి ముఖ్య సాధనోపకరణములు. ప్రేమ దానికి ప్రాథమికాధార పీఠమని వేరే చెప్పనేల. నిస్స్వార్థ బుద్ధితో చేసిన యే సేవ యైనను మంచిదే. స్వార్థచింతతో చేయకున్నచో మానవసేవ నిజముగా దైవ సేవయే. మనము దైనందిన కార్యక్రమములో నేది చేసినప్పటికినీ అది మన సహచరులకు—వారు మన పిల్లలు గాని, స్నేహితులుగాని, బంధువులుగాని—సంబంధించి నదే. మనము ఏ పని చేయుచున్నప్పుడును దైవసృష్టియగు నొక ప్రాణికి సేవచేయుచున్నాముగాని మన స్వార్థమునకు కాదని తలచినచో పైకి మనము ఎప్పటి వలెనే మన పనిచేయు చున్నను సేవా పథమునందే నడచుచున్న వారమగుదుము. దాదాపు మన పనులన్నియు మన పిల్లలకు, మన స్నేహితులకు జీవనోపాధికి తగు సాధనములు కల్పించుటతోనే సంబంధము కల్గియుండును. మనము వారిని దేవుని పిల్లలుగా పరిగణించి వారు పోషణకై మన కొసగబడినారనియు, వారికి మన

మన్నియు సమకూర్చవలసి యున్నదనియు, కర్తవ్య బద్ధుల మైనట్లు వారిని చూచు కోవలెనని భావింతుమేని మనము దేవుని పిల్లలను సేవించినట్లు, తద్ద్వారా దైవమును సేవించి నట్లును అగును. దీని వలన, మనము అనవసరపు వ్యామోహము నుండి విముక్తు లగుదుము. ఈ విధముగా మన మార్గము నుండి చాల గొప్ప ప్రతి బంధకములను తొలగించు కొందుము. ఈ పద్ధతి చాల తేలికయు, సరళమును, అయినప్పటికిని, అన్ని పనులలోను ఆ మహా ప్రభునిగూర్చి నిరంతర ధ్యానము అలవడునట్లు చేయును. ఈ భావము హృదయమున లోతుగాపాతుకొని పోయినచో ప్రతి చర్యయు దైవ శాసనానుసారము స్వార్థ చింతా వ్యామోహములకు తావు లేకయే విధి నిర్వహణ కేవలము విధి నిర్వహణ కొరకే అనిపించును. అప్పుడు విశ్వ ప్రేమ ప్రధానమై వ్యామోహ భావము లేకుండ దైవసృష్టిలోని ప్రతి ప్రాణిని ప్రేమించ ప్రారంభింతుము. అది భక్తిత్యాగములకు దారితీయును. భక్తి మన మార్గమును సుగమ మొనర్చి, దైవకృపధార మన హృదయములోనికి ప్రవహించుటకు మార్గమేర్పరచును. అది మనమార్గము నుండి మాలిన్యములను తొలగించి, మన గమనమును సులభము చేయును. మాలిన్యము నిజముగా పరస్పర విరుద్ధభావముల వలన కల్గుచున్నది. ఆ భావములు మన మనస్సులలో కలతలను, విచారములను ఉద్భవింప జేయును. ధ్యానము ద్వారా మన మనస్సులో తాత్కాలిక

ఉపశమనము నెలకొనును. మనము దైవిక శక్తితో సంపర్కము కలిగి యుండునంత కాలము ప్రశాంతత వెల్లివిరియును. అయితే, ధ్యానమొక నిర్ణీత ఘడియలోనే చేసిన చాలదు. దానివలన కొంతసేపు మాత్రమే ఆ పవిత్రభావముతో సంపర్కము కలిగి యుందుము. అటు తర్వాత భగవంతుని ధ్యాసే ఉండదు. దినములో చాల భాగము వరకు భక్తి, సేవలనెడి మార్గము నుండి కడు దూరమందుందుము. సంవత్సరముల తరబడి సాధన యొనర్చియు మనము ఆధ్యాత్మికానుభవమునందు అధమాధమ స్థితియందే యుండుటకు కారణమిదియే. సమర్థుడగు గురునిచే చక్కని మార్గమున కొనిపోబడినచో వాస్తవమున ధ్యానము చేయునపుడు మనము అనుభూతి చెందునది కేవలము సరళతయు, ప్రశాంతతయును. కాని అభ్యాసి సాధారణముగ దీనిని గ్రహించలేడు. తొలి దశలలో నది అతని యూహకందని విషయము. ఈ రీతిగా ఆ అనుభూతి గుర్తింపరాని దగుటచే నతడు తరచు ధ్యాన కాలమున నేమియు ననుభూతి చెందుట లేదని వాపోవును. దీనికి ముఖ్యకారణ మేమన నాతడు అభ్యాస సమయమున కొన్ని క్షణములు మాత్రమే దైవశక్తితో సంపర్కము కలిగి యుండును. ఇట్లు ధ్యానము ద్వారా సంపాదించిన అనుభవము కొలదిసేపు మాత్రమే అతని యందుండును. అటుగాక ధ్యానము ద్వారా పొందిన ఆ అనుభవమును దినములో చాల భాగము వరకు నిలువరింప జేసికొన యత్నించి, తనకు

పీలైనంత వరకు అదే స్థితి యందుండు నతడును కలడు. ఒక విధముగా నాతడు భగవంతుని నిరంతరము స్మరించు చున్నాడు. అతని పురోభివృద్ధి తేలికయు, త్వరితమును అగును.

ప్రాపంచిక బంధనములు, బాధ్యతల కారణమున అసంఖ్యాకములగు కలతలు, కలవరములచేత చుట్టు ముట్టబడిన మానవుడు భగవంతుని సర్వదా స్మరించుట అటుండగా తరచు స్మరించుట కూడ సాధ్యపడదని కొందరు భావింతురు. కాని, యదార్థముగా దృష్టిని దేవునిపై నెలకొల్పి నట్లయిన అది కడు తేలికైన విషయ మనియు, ఎన్ని ఇబ్బందులు, వ్యాపకములున్నను, ప్రతి యొక్కరును ననుసరింప వీలగు ననియు సాధనానాస్వాను భవములు వారికి నిరూపించి చూపును.

అధ్యాత్మికాన్వేషణమున గురువును సర్వోత్కృష్ట దైవ శక్తిగా భావించుట కడు సహాయకారి. అతని నొక మానవాతీత వ్యక్తిగా భావించి, అతని మార్గదర్శకత్వముపై నాధారపడి యుండుము. సర్వము గురున కంకిత మొనర్చి, ఎడతెరిపి లేని నీ జీవనవ్యవహారక్రమముతో సాగిపోవుచున్నచో తుదకు నీకది యెట్టి మేలు చేకూర్చి పెట్టునో యూహించుము. ఒక పని చేయునపుడు నీవు నీకొరకా పని చేయు చున్న ట్లను కొనకుము. నీ గురువునకై చేయుచున్నట్లు భావించుము. లేక నీ గురువే తన కొరకు చేయుచున్నాడని తలంపుము- భోజన సమయమున నీ గురువు భోజనము చేయుచున్నాడని

అనుకొనవలెను. నీవు కార్యాలయమునకు పోతివేని నీ గురువే యిది యంతయు చేయుచున్నాడని భావింపుము. నీవు కార్యాలయమునుండి తిరిగి వచ్చునపుడు దారిలో నొక ఆకర్షణీయమైన నాట్య ప్రదర్శన చూచితి వనుకొనుము. నీ కనులా నర్తకి ముగ్ధమోహన రూపముచే నాకర్షితములగును. నీ ఆలోచన కొంతసేపు తప్పుదారి మళ్ళినట్లుండును. అప్పుడుకూడ నీ గురువేగాని, నీవు నాట్య ప్రదర్శన చూచుట లేదని తలంపుము. తక్షణమే నీకు దానిపై మోజు పోవును. ఏలయన, నీ గురుని శక్తి ప్రవహించ మొదలిడి, నిన్నా యాకర్షణనుండి తొలగించును. నీవు కార్యాలయము నుండి తిరిగి వచ్చినపుడు చాల గంటల తరువాత నీ పిల్లలు నిన్నుచూచి యానందముతో త్రుళ్ళింత లాడుదురు. నీవుకూడ వారి వినోదములకు సంతోషింతువు. అది కేవలము సహజమే. త్రుటి కాలము నీ ధ్యాస వారివైపు మ్రొగ్గుటతో నీవు పవిత్ర చింతనకు కాసంత దూరమయినట్లు అనుభూతి చెందుదువు. నీవపుడు చేయవలసిన దేమనగా నీలోని నీ గురువే వారితో వినోదించుచున్నాడని భావించుట. అట్లయిన, నీవు మరల నిదే పవిత్ర చింతనతో సంపర్కము గలిగి యుందువు. నీవు నీ మిత్రునితో మాట్లాడుచుండినచో నీ గురువేగాని, నీవు కాదు వానితో మాట్లాడుచున్నదని తలంచుము. నడచునపుడు నీ గురువే నడచుచున్నాడని భావించుము. ధ్యాన కాలమున నీవు కాదు, నీ గురువే తన రూపముపై ధ్యానించుచున్నాడని భావించి

నట్లయిన దాని వలన అద్భుత ఫలితములుండును. ఇదే విధముగా అన్ని పనులందును నిన్ను నీవు సరిచేసుకొనవచ్చును. ఈ భావమును పెంపొందించుకొని, నీ స్థానములో నీ గురువే సమస్తము చేయుచున్నాడను దృష్టి నెలకొల్పు కొన్నచో నీవు సదా ఎడతెగని భగవత్స్మరణ కలిగి యుండుటేగాక నీ కర్మలవలన నెట్టి సంస్కారములును పుట్టవు. ఇంకను సంస్కారముల పెంపొందించుకొనుటన్నది త్వరలో నశించును.

మనస్ఫూర్తిగా నీ పద్ధతి ననుసరించినచో గురుని స్వరూపము సదా నీ దృష్టి యందుండును. నీ వాతని యునికిని నీలోను, బయట నంతటను అనుభూతి చెందెదవు. నిజమైన గురువు కేవలమాతని భౌతిక రూపము కాక యాతని యంతః స్వరూపమే అయినప్పటికిని ఆ రూపమును బొత్తిగా నిరాదరించుట చాల వరకు దుస్సాధ్యము. కాని, కేవలము భౌతిక రూపమే గురువనెడి భావమును కలిగియుండు వారు మాత్రము అత్యంత స్థూలములయిన బంధనములను, క్లిష్టతలను తమంతట తామే సృష్టించు కొనుచున్నారు. అట్టివారికి 'గురుపశువు' లని కబీరుదాసు చక్కని పేరిడిరి. కాని, గురువు పరమసత్యముతో నైక్యము సాధించిన గొప్ప దివ్య పురుషుడయినచో నాతని రూపమును ధ్యానించుట శిష్యులకత్యంతో పయోగకారి. పైకి చూచుట కాతని శరీరము స్థూలాకారమైనప్పటికిని గుణ విశేషమున నాతని యంతరాత్మవలె నిజముగా సూక్ష్మమును, శుద్ధమునునైనది. అట్టి గురుని

రూపమును ధ్యానించినచో నీవు నీ స్థౌల్యమును పోగొట్టుకొన నారంభించుటే కాక నీలో నాతని అంతరాత్మ యొక్క అత్యంత సూక్ష్మ స్థితిని గ్రహింప మొదలిడుదువు. దృష్టి ముందిడుకొన్న రూపము, కొలది కాలము పిమ్మట మాయమై పోవును. క్రమేపి, నీవు పరిశుద్ధ సత్యరంగమున కాలిడుదువు. "Commentary on the Ten Commandments of Sahaj Marg" "సహజ మార్గము- దశా దేశముల వ్యాఖ్య." అను పుస్తకమునందు, ఒక వస్తువును కొంత కాలము పాటు ఎడ తెగక చూచినచో దృష్టి నుండి ఆకార మెట్లు మాయమగునో చర్చించి యున్నాను. ఈ రీతిగా అప్రయత్నముగానే బాహ్య రూపమునుండి అంతరముగా పయనింతుము. అటుపై సర్వ మును అదృశ్యమై సరియగు స్థానము చేరుకొందుము.

# 8

# ఆత్మ సమర్పణము

మనము సర్వోత్కృష్టుడగు ప్రభునితో నైక్యతను సాధించుటకై భక్తిని పాటింతుము. మన మాతని యెడ భక్తి విశ్వాసము లు గల్గియుందుము. క్రమేణ, మన మాతని కెంత సన్నిహితులమై పోదుమనగా తక్కిన దేదియు మన దృష్టికి ప్రధానముగా తోచదు. ఇది మన మా ప్రభుని యిచ్ఛకు తల యొగ్గుట. వేరొక మాటలలో చెప్పిన నిది ఆత్మ సమర్పణమునకు ప్రారంభము. అది మన విశ్వాసముతో బాటు వృద్ధి చెందుచు పోవును. అది మానసిక చాంచల్యమునాపి, మనలను నిశ్చల స్థితికి దెచ్చును. కొంత కాలమునకు మన మనస్సు ఒకానొక గొప్ప శక్తిచే ఆకట్టు కొనబడి ఇతర విషయము లన్నింటి నుండి దూర మొనర్చెడి విధముగా అనుభూతి చెంద నారంభించుచు, మన ఇంద్రియము లన్ని వేళల సక్రమ వర్తనముననే ప్రవర్తించు చుండిన మనము అనపేక్షణీయములగు కార్య కలాపములనుండి వైదొలగుదుము. ఆత్మ సమర్పణమన స్వార్థచింత యావంతయూలేక ఆ మహాప్రభుని యిచ్ఛకు సంపూర్ణముగా తనను తాను సమర్పించు కొనుటే కాని వేరు

కాదు. ఈస్థితియందు స్థిరముగా నుండినచో అదిశూన్యస్థితికిదారి తీయును. మన మా మహా ప్రభుని శరణు జొచ్చిన, వారినుండి యొక మహోన్నత నిరంతర దివ్య శక్తిధార నాకర్షింప నారంభింతుము. ఈ స్థితి యందు మానవుడు తన ప్రభునియిచ్ఛకు లోనై ఆలోచించును, లేక నడచుకొనును. ప్రపంచమందేదియు తనది కాదనియు, ప్రతిదియు ప్రభుని యొక్క పవిత్ర నిధి యనియు భావించి, ప్రతి పనియును ప్రభుని యాజ్ఞానువర్తియై యొనర్చు చున్నట్లు తలచి, చేయును. అతని యిచ్ఛ సంపూర్ణముగా ప్రభుని యిచ్ఛకు విధేయమై పోవును. దశరధుని కుమారుడగు భరతుడు అయోధ్యాపుర జనులతోగూడి అడవికి వెళ్ళి, తన సోదరుడగు రాముని నగరమునకు తిరిగి రమ్మని ప్రార్థించుట శరణాగతిని గూర్చిన చక్కని దృష్టాంతము. రాముడు ప్రజలప్రార్థనలువిని, భరతుడు తనను రమ్మన్నచో తాను రాజధానికి వచ్చుటకు నిరభ్యంతరముగా నంగీకరింతునని గంభీరముగా చెప్పెను. అందరి దృష్టి భరతుని వైపు మరలెను. అతడు స్వయముగా రాముని తిరిగి రమ్మని కోరుటకే యటకు వచ్చి యుండెను. అయినను, అతడు నెమ్మదిగా నిట్లు బదులు పలికెను. "అజ్ఞాపించుటకాదు, అనుసరించుట మాత్రమే నే చేయగల్గినది."

భగవద్గీత కూడ శరణాగతిని గూర్చి వివరించును. అది తేలికగా సంపాదింప వీలగు సామాన్య విషయము కాదు. అది, ఇంద్రియ మానసిక శక్తులను సంపూర్ణముగా నిషేధించిన

తరువాతనే ప్రారంభమగును. ఇందుకు మనము ప్రాథమిక భక్తిసూత్రములను అనుసరించి సాగిపోవుదుము. మనము మన గురువును మానవాతీతునిగా తలచి, వారికి విధేయులమగుదుము. మనము భక్తి విశ్వాసములతో వారిని ప్రేమింతుము. సర్వ విధముల వారి కృపను, దృష్టిని, ఆకర్షింప ప్రయత్నింతుము. ఇందు నిమిత్తము కేవల మనుకూలార్థమే ప్రాపంచిక బాంధవ్య రూపమున మనము వారితో సంబంధ మేర్పరచుకొందుము. వారిని మనము తండ్రిగా, సోదరునిగా, ప్రభునిగా లేక ప్రియునిగా భావింతుము. ఈ విధానము శ్రద్ధతో పాటించినచో శిష్యునకు చాల ఉపయోగకారి. ఈ రీతిగా నెలకొల్పబడిన గట్టి ఆకర్షణా బంధము భక్తి, శరణాగతులకు దారి నేర్పరచును. గురుని తల్లిగా భావించుట నా దృష్టిలో నత్యంత సముచితమును, శిష్యునికి లాభదాయకమును అగును. మూర్తీభవించిన ప్రేమా వాత్సల్యములే తల్లి. పుత్రుని వలన కలిగిన సకల బాధలను, క్లేశములను మాతృహృదయము మాత్రమే ఓరిమితో భరించ గలదు. అయినను తన కుమారునకు సుఖ సంతోషములను కూర్చవలెనని సర్వదా యత్నించును. శిష్యునకు ఆధ్యాత్మిక మాతృత్వమును వహించు నిజమైన గురువు యొక్క స్థానము గూడ నట్టిదే. అందు మూలమున, గురువు తన పుత్ర సమానుడగు శిష్యుని ఆధ్యాత్మిక సంక్షేమమును సర్వదా కనిపెట్టుకొని యుండును. శిష్యుని యెడల గురువునకుగల మాతృవాత్సల్య పూరిత సాన్నిహిత్యము వలననే, ఆతని ఆధ్యాత్మిక జనని యగు గురువునకు, అత్యంత సన్ని

హితుడై యున్న పరమ పితయొక్క కృప యా శిష్యుని వంక ప్రసారిత మగును తల్లిప్రేమ అందరకును తెలియును. కాని, ప్రజలు గురుని ప్రేమను కొలదిగా మాత్రమెరుగుదురు. దేవుని ప్రేమనంతకంటె తక్కువగా నెరుగుదురు. తల్లి బాధ్యత నిజమైన గురుని బాధ్యతలు సన్నిహితముగా సమానము. తల్లి బిడ్డను తన గర్భము నందు కొంత కాలముంచుకొనును. గురువుకూడా అధ్యాత్మిక శిశువును తన మానసిక పరిధిలో కొంతకాలముంచు కొనును. ఈ కాల వ్యవధిలో శిష్యుడు, గర్భములోని శిశువువలెనే, గురువు నుండి శక్తిని గ్రోలి, గురుని అధ్యాత్మిక యోచనాతరంగముల నుండి పోషణను గ్రహించును. కాలము పరిణతి చెందినపుడాతడీ దివ్యలోకమున ఉద్భవించును. అటుపై నాతని స్వీయ అధ్యాత్మిక జీవన మారంభ మగును. శిష్యుడు తన సర్వస్వమును గురువునకు సమర్పించి వారి మానసికా వరణమున ప్రవేశించినచో అతనిని దివ్య లోకమున ప్రవేశ పెట్టుట కేడుమాసములే పట్టును. కాని ఈ క్రమము సాధారణముగా చాల కాల మాలస్యము కావింప బడును. ఏలయన, శిష్యుడు గురుని మానసికా వరణములో నున్నప్పుడు తన స్వీయాలోచనలను, అనుభూతులను వదలక నట్లే యుంచుకొనును. ఇట్లు, గురుని స్థానము తల్లిస్థానము వంటిదే యని మనము గమనింతుము. గురువును అధ్యాత్మిక జననిగా భావించుట మనయందు అధ్యాత్మిక జీవనమునకు ముఖ్యాంశములగు భక్తి ప్రేమ ప్రపత్తులను పెంపొందించును.

మహర్షులు శిష్యులను 'మన్మతులు', 'గురుమతులు' అని రెండు ముఖ్య వర్గములుగా విభజించిరి. తొలి వర్గమునకు చెందినవారు ప్రాపంచిక దుఃఖము నుండి విడుదల, సంపదల వంటి యేదో యొక ప్రాపంచిక లాభము దృష్టిలో నుంచుకొని గురుని యొద్దకు వచ్చువారు. వారి కోరికలు నెఱవేఱు నాశ యున్నంత వరకే వారాతనికి విధేయులై యుందురు. ఈ విషయమున నిరాశాహతులైనచో వారు వదలి పోవుదురు. అట్టి శిష్యుల విషయమున నమ్రత, విధేయతల ప్రశ్నయే ఉదయించదు; శరణాగతి మాటచెప్పనేల? గురుమతులనబడు శిష్యులు గురుని యాజ్ఞలనన్ని విషయములందును తలదాల్చి, అన్ని విధముల వారి యిచ్ఛకు విధేయులై యుండజూతురు. విధేయత నమ్రతతో మొదలగును. ఆధ్యాత్మికముగా మహోన్నత స్థితుల సాధించిన గురుని మహోత్కృష్ట శక్తులచే గాఢముగా ముగ్ధులమైతిమేని మనయంతరంగమున వారి ఆజ్ఞలశిరసావహించుటకు సమ్మతింతుము. కాని, తరుచుగా నా ప్రభావము మనము వారి ఎదుట నున్నప్పుడే యుండును. దూరముగా నున్నప్పుడు మనము వారిని గూర్చి తలంపము. కొంతకాలము వారిని పలుమార్లు కలిసి కొనుచుండినట్లయిన మనకా మహాత్మునితో సాన్నిహిత్యముకలుగును. వారిసర్వోత్కృష్టత మనహృదయముపై పాదుకొన మొదలిడును. ఆధ్యాత్మిక పురోగతికి సంబంధించిన అన్ని విషయము లందును మనము వారిని మన మార్గదర్శకులుగా చేసికొందుము. తత్ఫలితముగా వారిని మనము

తరచు జ్ఞాపకము చేసికొందుము. వారిసమున్నత సామర్థ్యమును గూర్చి మనకు సంపూర్ణముగా నమ్మిక యేర్పడినప్పుడే యథార్థముగా మన విధేయత ఆరంభమగును. మనమట్లు విధేయత కలిగి, నిర్దేశించినట్లు సాధన యొనర్తుము. మన చేతలచే వారని తృప్తిపరచజాతుము. మంచి, చెడుగుల తారతమ్య జ్ఞానము కూడ మన హృదయములో ప్రాముఖ్యము వహించనారంభించును. మనము చెడునుండి దూరమగుటకు ఉత్సహింతుము. అందు మూలమున మనము సదాచార పద్ధతి నవలంబించి ఉన్నత గురువును తృప్తిపరుప జూతుము. తదనంతర జన్మలోని దుఃఖములనుండి రక్షితులు కాగోరుదుము. కాన ఈ పద్ధతి నవలంభించుట మన ముఖ్యోద్దేశము.

నిర్ణయాధికారము మనకుండుట వలన మంచిగాని, చెడుగాని మన చేతలకు మనమే బాధ్యులము. ఉన్నత దశకు చెందిన ఆత్మసమర్పణమునందు వివేచనాశక్తి దాదాపు నశించి, అభ్యాసి ప్రతి పనియు గురుని యిచ్ఛగా తలచి చేయును. ఇది సరియైనది, సరికానిదను ప్రశ్నయే యాతని మనస్సున పొడసూపదు. ఏలన, తనగురుని యిచ్ఛానుసార మొనర్చుటలో తాను సరియైనదే చేయుచున్నాడని, సరియైనదితప్ప వేరు చేయడని యనుట సంపూర్ణముగా సత్యము.

# 9
# సాక్షాత్కారము

ఆత్మ, భగవంతుడు, సృష్టి రహస్యము మొదలగు వాని గూర్చి ప్రతి యొక్కరును ఏదో తీరున మాటాడుచుండుట మనము వినుచుందుము. కాని భగవత్సాక్షాత్కారము పొందిన వారిని గాని, భగవంతునితో పరిచయముగల వారిని గాని యన్వేషించినచో వారిలో బహుశః మనకొక్కరును అట్టి వారుండరు. ఈ కారణముననే వివిధ మత ప్రతినిధుల మధ్య నిరంతర మతద్వేషము ప్రబలియున్నది. దేవుని గూర్చి చాల వచింతురు. కాని, యంతరంగమున వారు కటిక నాస్తికుని కంటె మేలుగా నుండరు. భగవంతుని ఉనికిని మాటలలో నొప్పుకొందురు. హృదయములో అతని యునికిని గూర్చి బొత్తిగా నెరుగనట్లే కనవత్తురు. వారికి దేవుని యేకైకోపయోగము తాము దుఃఖమునందును, కష్టమునందును నున్నప్పుడే. అట్టి తరుణములందు తమ మొరవిని, అతడు వారి బాధలను తొలగించవలెనని యాశింతురు. ముఖ్యముగా కోరికలు నెరవేఱ వలెననియే వారు భగవంతుని ప్రార్థింతురు. నిజముగా నిది వాస్తవ ప్రేమ భక్తి భావములకు కడుదూరము. ఏ మేలు కోరియో, ప్రాపంచిక లాభము కోరియో కాక కేవలము

ప్రేమ కొరకే యాతనిని ప్రేమించు వాడే నిజమైన భక్తుడు. అతడు ఎల్లప్పుడును భగవంతుని యిచ్ఛకు సంపూర్ణవిధేయుడై యుండును. మంచిగాని, చెడుగాని, సంతోషముగాని, దుఃఖము గాని తనకేది ప్రాప్తించిన దానితో సంపూర్ణముగా సంతృప్తుడై యుండును. సంతోషముగాని, విచారముగాని యాతని కర్థరహితమే. ప్రతి యొక్కటియు అతనికి తన ప్రేమ మూర్తి యొక్క వరమే. అట్టి సంపూర్ణ సమర్పణ, నిస్సందేహ వైఖరియే మహోన్నత భక్తి స్వరూపము. అంతయు భగవంతున కర్పించుట యనగా తానేమియు చేయక తనకుకావలసినవన్నియు భగవంతుడిష్టపడినచో నిచ్చునని ఎల్లకాలము నాతనిపై నాధారపడి, సోమరిగా నుండుటకాదు. స్వప్రయత్నము లేనిదే భగవత్సహాయము లేదనెడి నానుడి అక్షరాల నిజము. ఇహపర సంబంధమైన మన బాధ్యతల నిర్వహించుటకు కష్టపడక పోయినచో మనము మన పవిత్ర ధర్మమును నెరవేర్చని వారమగుదుము. మనస్సునందుంచు కోవలసిన విషయ మేమనగా భగవదిచ్ఛానుగుణముగా నడచుకొని, ఫలితమేదయినప్పటికినీ తృప్తి పడవలెననుట. ఈస్థితికి వచ్చినప్పుడు మనము నిజమైన భగవద్భక్తిని సాధించినట్లును. అటుపై సరియైన సత్యపథము నందు పయనించు చున్నట్లును తలపవచ్చును. సత్యము ఇంద్రియముల ద్వారా గ్రహింపదగినదిగాదు, అది కేవలము హృదయాంతరాళమున మాత్రము సాక్షాత్కరింపదగినది. అందుచేత మనము మన జీవిత సమస్యా పరిష్కారమునకు దానిలోనికి చొచ్చుకొని పోవలెను.

మనమనస్సులో ఈ గొప్పవిశ్వమునుగూర్చి యొకభావ మున్నది. సాధారణముగా మాయ లేక భ్రమ అనబడు దానిని శాశ్వత పరమ సత్యమునుండి భిన్నమైనదిగా పరిగణింతుము. ఏవో కొన్ని కారణముల నాధారముగా చేసికొని, మాయను పలు తెరగుల నిర్వచింప యత్నించిరి. నిజముగా దైవశక్తియే ఈ సృష్టి నంతను వివిధ రూపములలోను, వివిధాకృతులతోను ఏర్పడజేసి సక్రమముగా నెరవేరునట్లు చూచుచున్నది. మన మన్ని వేళల నీ అనంత శక్తిచే పరివృతులమై యున్నారము. మన కార్య కలాపము లన్నింటిలోను దాని ప్రభావము గోచరించును. ఒకొక్క మాటు మన దృష్టికి వచ్చిన యొక వస్తువునో మరొక వస్తువునో సత్యమని భావించి, దాని నంటి పెట్టుకొనిమాయాగోళమున మనము పరిభ్రమించుచున్నారము. మన ఇంద్రియములు, భావములు, ఉద్రేకములు నూతనరూప మొసగి రంగు పులిమి, మన చేతలను తదను గుణముగా రూపొందించును. మూల మందున్న అచంచల సత్యమువైపు మన దృష్టి మరలుకొను నంతవరకు బయటు పడుదుమను నాశయేలేక మాయాజాలమున మనము చిక్కువడి యుండెదము. మాయనుండి సూటిగా జనించిన ఈ విశాల భౌతిక సృష్టి వృత్తమనంతము. అందులో మనము చక్రపుటంచువోలె ఎడ తెగని చలనముతో పరిభ్రమించుచు కీలక స్థానము నుండి మఱిమఱి దూరమైపోవుచుందుము. ప్రతి వృత్తమునకు కేంద్ర మెట్లుండునో అట్లే ఈ విశాల సృష్టి వృత్తమునకు కూడ

(16)

కేంద్రముగాని, ఆధారముగాని యుండవలెను. దానిని కనుగొన గల్గితిమేని మన సమస్యా పరిష్కారమున కొక ఆధారము దొరికినట్లగును. గణితశాస్త్రము కూడ 'పూజ్యము' నే ఆధారము చేసికొని నిలిచి యున్నది. ఇప్పుడు మనమీ అనంత విశ్వమునకు చెందినట్టియే 'పూజ్యము' లేక 'మూలాధారము' నుండి అనేకాస్తిత్వ దశలు ప్రారంభమగునో దాని నన్వేషించవలెను. సూక్ష్మముగా పరిశీలించినచో వృత్త కేంద్రము కూడ మరొక బహు సూక్ష్మరూపమగు వృత్తమే. అందుచేత దానికి కూడ మరింత సూక్ష్మరూపమగు కేంద్రము ఉండి తీరవలెను. ఈ పద్ధతి అనంతము వరకు సాగి పోవును. వేరు మాటలలో చెప్పవలెనన్న చిన్న వృత్తము ప్రతి యొక్కటియు దాని నావరించిన బాహ్య వృత్తమునకు కేంద్రమగును. వివేచన గాని, ఊహా శక్తిగాని దీనికి ఆదిగాని, అంతమునుగాని కనుగొన లేకున్నది. ఈ విధముగా ఈ ఘన భౌతిక రూపమగు విశ్వము వెనుక మరొక సూక్ష్మతరమగు విశ్వమున్నది. ఈబాహ్య జగత్తునకది హేతువు లేక కేంద్రము.మరల ఆ సూక్ష్మతర వృత్తమునకు మరియొక కేంద్రముండవలెను. అదిఇంకను సూక్ష్మతరమైన వృత్తరూపమునకు ప్రతీకగానుండును. ఇట్లే అనంతముగా సాగును.దీనినేఇంకొకతీరున చూచినచో భావనాతీతమైన సూక్ష్మ బిందువు కేంద్రముకాగా దాని నొకటి వెనుక నొకటిగా అసంఖ్యాకములగు వృత్తములు చుట్టి యుండి, అందులో ప్రతి వృత్తమును దాని తర్వాతి బాహ్య వృత్తమునకు కేంద్రముగా

నొప్పారుచు, నీ రీతిగా మనము ఘన రూపమగు ప్రస్తుత స్థితికి వచ్చునంత వరకున్నవి. మన మిప్పుడు చేయువలసినదేమనగా అడుగులు వెనుకకువైచి ప్రస్తుత స్థూల రూపమగు స్థితి నుండి మునుపటి సూక్ష్మ, సూక్ష్మతర రూపముల పొందుచు మానవ సాధ్యమగు సుదూరమైన అంతిమ స్థితి వరకు పయనించవలెను. మనమున్న ఈ ప్రస్తుత స్థితి యందు స్థౌల్య వృత్తము నందే పరిభ్రమించుచున్నారము. ఈ సూక్ష్మవృత్తముల నొకటి వెనుక నొకటిగా దాటుచు, కేంద్రమునకు లేక మూల కారణమునకు చొచ్చుకొనుచు పోవుట మనకు తరుణోపాయము. ఇదియే ఆధ్యాత్మిక శాస్త్రములోని సారాంశము. అతి సూక్ష్మరూపము మొదలు అతి స్థూల రూపము వరకుగల యీ సమస్త విశ్వమునకు మూలకారణము అంతరతమమగు కేంద్రము. మూలాధారము లేక పూజ్యము. మనము దానిని భగవంతుడని, బ్రహ్మమని అనవచ్చును.

మానవ నిర్మాణము కూడ చక్కగా విశ్వ నిర్మాణమును పోలియున్నది. ఏ విధముగా ఈ ఘనరూపమగు బాహ్య విశ్వము వెనుక నసంఖ్యాకములగు నితర సూక్ష్మాతి సూక్ష్మ రూపములగు విశ్వము లున్నవో అట్లే మానవుని యీ స్థూల భౌతికరూపము వెనుక నసంఖ్యాకములగు సూక్ష్మాతి సూక్ష్మము లగు రూపములు గలవు. అన్నిటి కంటెను వెలుపలనున్న రూపమీ స్థూల శరీరము, దాని వెనుక సూక్ష్మ శరీరమును, కారణ శరీరమును ఉన్నవి. ఈ మూడు బాహ్య రూపములేకాక లెక్క

లేనన్ని యితర రూపములు కలవు. అవి యెంత సూక్ష్మరూపము లైనవనగా వాటిని విజ్ఞులు శరీరములనక ఆత్మను చుట్టియున్న సన్నని పొరలందురు. లెక్కకు మిక్కుటముగా నున్న వీటి కొక్కొక్క దానికి పేరుపెట్టుట నిజముగా బహుదుర్ఘటము. అతిసూక్ష్మమైనదానినుండిఅతిస్థూలమైన దాని వరకు గల లెక్క లేనన్ని యీ రూపములతో మానవుడు, విశ్వమునకు- ఒక యదార్థమైన ప్రతిరూపముగా ఈ భౌతిక ప్రపంచమున వెలు గొందుచున్నాడు. అట్టి విశ్వము అన్నింటి కన్నను బయట నున్న పరధినుండి అన్నింటికన్నా అంతరతమమగు కేంద్రము లేక పూజ్యము వరకుగల సంపూర్ణ వృత్తముగా నొప్పారెడి సమస్త భగవత్సృష్టి. మానవుని యునికికి చెందిన అంతర తమమగు కేంద్రము లేక పూజ్యమును, భగవత్సృష్టి, యదార్థ ముగా నొకటే. భగవత్సాక్షాత్కారము అనగా ఆత్మ సాక్షా త్కారమే. ఆత్మ సాక్షాత్కారమనగా భగవత్సాక్షాత్కారమే. సమస్త విశ్వమును ఒకే బిందువు, పూజ్యమునుండి పరిణామ క్రమమున నేర్పడినది. అట్లే మానవుని యునికి కూడ నదే బిందువు నుండి వృద్ధి చెందినది.

సృష్టి కాలమునకు పూర్వము కేవలము మూలకారణమే యుండినది. సకల వస్తువులును తమ తమ ప్రత్యేకతలను కోల్పోయి మనకు నేడు కానవచ్చు సృష్టి సర్వము ఆ మూల కారణములోనే లీనమయి బహు సూక్ష్మరూపమున నుండెడిది. మహావృక్షపు చిన్న బీజము నందు వలె అత్యంత సూక్ష్మ రూప

మున కేంద్రము సర్వ సృష్టిని అంతర్లీనము కావించుకొని యుండెను. ఇట్లు, అత్యంత లఘు రూపము గొని యుండిన మూల కారణమే మన మీనాడు కాంచుచున్న విశాల సృష్టి కేంద్రము. గుప్త స్థితిలోనున్న చలనములు, అతి సూక్ష్మ రూపమున నుండు సర్వ సృష్టి—ఇవి యన్నియు నొకటిగా సమీకృతమై, సమయమాసన్నమయి నంతట సృష్టికి కారణ భూతములైనవి. సృష్టి కాలమున ప్రతియొక్కటియును రూపము దాల్చ నారంభించినది. మానవుడు కూడ తన ప్రత్యేక రూపమును దాల్చినాడు. మానవ నిర్మాణంలో వ్యక్తిత్వమును గూర్చిన ఎరుకయే తొట్టతొలి పొర. అటుపై నొకటి తర్వాత నొకటిగా పొరలు చేరుచుపోయినవి. అహంకారము అభివృద్ధి కాదొడగినది. చివరికది యొక స్థూలరూపము ధరించినది. మనస్సు, ఇంద్రియములు, బుద్ధిశక్తులు పనిచేయుచు మరికొంత స్థూలత్వము ఏర్పడుటకు దోహదకారులైనవి. శారీరక మానసిక చేష్టలు సంస్కారము లేర్పడుటకు దారి తీసినవి. చివరికిప్పుడు మానవుడత్యంత స్థూల రూపములో నున్నాడు. ఈ స్థూల రూపము బయట స్థూల శరీరమును, లోపల సూక్ష్మ శరీరములు మరియు పొరలు కలిసి యేర్పడి యున్నది. ఈ వెలుపలి ఘనస్థితి నుండి మనము ఒకటి తర్వాత నొకటిగా సూక్ష్మ స్థితులు దాటుకొనుచు తిన్నగా కేంద్రము వైపు పోవుదుము. స్థూల శరీరము నుండి మన శ్శరీరమునకును, అటుపై కారణ శరీరమునకును అడుగడుగున

సూక్ష్మ తరమగుచు తక్కిన పొరలను దాటుకొనుచు పోవు దుము.

ఇందుకు సాధారణముగా ననుసరించబడు విధానము కర్మ, ఉపాసన, జ్ఞానము అని మూడుగా విభజించబడినది. వివిధ మతములకు నిది ఒకే ఆధారముగా నున్నది. ఈ విషయమున అనుసరించబడు ప్రాథమిక సాధనలు నాలుగు [సాధన చతుష్టయము] దాదాపు నంతట ఒక్కటే.

ఈ సాధనలలో మొదటిది వివేకము. మనము ప్రపంచములో చాల వస్తువులను చూచు చున్నాము. కాని, వాటి స్థితిని గమనించితిమేని యవి చంచల మైనవని——అనగా మనము సాధారణముగా పిలుచునట్టి మాయ యొక్క వివిధ రూపములే యవి యని—గ్రహింతుము. ఈ తీరున లోతుకు వెళ్ళి దీని కారణము గుర్తించుటకు మన మంత రంగమున ప్రేరేపింప బడుదుము. ఇట్లు మన దృష్టి చంచలమైన వస్తువుల మీది నుండి ఆ అచంచలము లేక శాశ్వత తత్వముపైకి మరలును. ప్రాపంచిక వస్తువులపై ఆసక్తి పోవును. వాటితో మనకు సంబంధము లేనట్లు భావింతుము. ఇది మనలను సాధన చతుష్టయములోని రెండవది యగు వైరాగ్యమునకు తీసికొని పోవును. ఇతర కారణముల వలన కూడ వైరాగ్య స్థితి కలుగ వచ్చును. దృష్టాంతముగా, ప్రాపంచిక వస్తువులను మనసుదీర అనుభవించిన మీదట కొన్ని సమయములందు మన మాంతరంగికముగా వాటి యెడ విముఖత్వము

చెందెదము. అట్టి తరుణములలో మనదృష్టి స్వాభావికము గానే యొక ఉన్నతాశయము వైపు మొగ్గు చూపగా మనము దైవ చింతనకు జాగృతమైనట్లు అనుభూతి చెందెదము. రెండవది ప్రపంచములోని దుర్మార్గము, విశ్వాస ద్రోహముల వలన గాఢముగా విచలితమైనచో మనము విసుగు పుట్టి, అంతరంగికముగా ప్రాపంచిక వస్తువులపై విముఖత్వము చెందెదము. అసంతృప్తి, వైరాగ్య భావములు మనము మన సన్నిహితులను పోగొట్టుకొని, వియోగ దుఃఖమున మ్రగ్గు చున్నపుడును కలుగును. కాని అట్టి సమయములందు కలిగిన వైరాగ్యము ఎప్పుడో గాని నిక్కమైనది గాను, నిలుచునది గాను ఉండదు. ఆ కష్ట పరిస్థితులు పోవుట తోడనే అవియును మాయమగును. ఒకానొక వ్యక్తి కబీరుదాసుని చూడ గోరినట్లు వివరించు కథ ఒకటి ఉన్నది. అతడు కబీరుదాసు గృహమునకు చేరగా కబీరు తన బంధువులలో నొకడు చని పోయినందున వానిని దహనము కావించుటకై శ్మశాన వాటికకు పోయెనని తెలియ పరుపబడెను. ఆ వ్యక్తి కబీరును చూచుటకు శ్మశానమున కరిగెను. కాని, అతడు కబీరుదాసు నింతకు మున్నెప్పుడును చూడక పోవుటచే నాతనిని అందరిలో గుర్తించుట కష్టమని తలచెను. అందుచే ఆతనిని సులువుగా గుర్తించుటకై శ్మశాన వాటిక వద్ద నున్న ఏ యొకని ముఖము చూచినను దాని చుట్టును తేజోమండలము కనిపించును. శ్మశానవాటికకు పోవు నపుడు ఆ పరివేషములో ప్రతి యొకరి ముఖము చుట్టును

ప్రకాశమానముగా కాన్పించును. వారు తిరిగి వచ్చునప్పుడు రాను రాను అవి కాంతి తరిగి చివరకు మటు మాయమగును. కాని, కబీరు ముఖమును చుట్టియుండు పరివేషము మాత్రము సర్వదా ఒకే కాంతితో ప్రకాశించును. దీనిని బట్టి యట్టి హఠాత్సంభవముల మూలమున కలెడి వైరాగ్యభావము సాధారణముగా క్షణిక మనియు, అది పరిస్థితులలో మార్పు వచ్చిన తోడనే మారిపోవు ననియు తెలియును. ఏలన, అ హఠాత్తయిన అఘాతము తాత్కాలికముగా వైరాగ్య భావమును కల్గించి నప్పటికిని, ఆశలు, భోగలాలసతలు బీజ రూపమున నింకను హృదయాంతరమున గాఢముగా నాటుకడి యుండి, అనుకూల వాతావరణ మేర్పడిన వెంటనే భేదించుకొని పైకి రావచ్చును. యథార్థ రూపమున కలకాలముండెడి ఫలితములతో వైరాగ్య భావమును పెంపొందించు కొనుటు కేవలము అంతరంగమును పూర్తిగా పరిశుద్ధ పరచి, తగిన రీతి మిత భావము నెలకొన జేసిన మీదటనే వీలగును.

వేదాంతులు వైరాగ్యమును వేరు తీరుగాసాధన చేయుదురు. కానవచ్చునదంతయు మాయయనియు, అందుచేత క్షణికము, అసత్యము అనియు భావించి, మూల సత్యము బ్రహ్మమని వారు ఊహా కల్పిత నిర్ణయమునకు వత్తురు. అది కేవలము బాహ్య కర్మల లోను అలవాట్లలోను మాత్రమే మార్పు తెచ్చునంత వరకు వారు ఇచ్ఛాబలమును ప్రయోగింతురు. అందువలన, ఫలితము చాల వరకు కేవలము బాహ్యమైనదే దీర్ఘ

కాల నిరంతర సాధనల వలన అది యే కొలదిగానో లోనికి ప్రతి బింబించ వచ్చును. అదే విధముగా అనుభవ లేశమైనను లేనిది, కేవలము భావనా బలము చేత కలిగినది యగు వివేకమునకు చక్కని ఆధారములేదు. ఈ విషయమును తరచి పరిశీలించినచో వాస్తవముగా వివేక వైరాగ్యములు సాధనలు కావనియు, అవి కేవలము కొన్ని సాధనల ఫలితములనియు తెలియ వచ్చును. భక్తి, ప్రేమ సంస్మరణల వంటి కొన్ని యోగసాధనలను నిరంతరము చేయునపుడు వివిధ దశల యందు వృద్ధి చెందెడి మానసిక స్థితియే వివేకము లేక వైరాగ్యము. ఇంద్రియము లన్నియు సమూలముగా పరిశుద్ధము కావింపబడిననే తప్ప వివేకము యదార్థముగా వృద్ధి పొందదు. మనస్సు చక్కగా క్రమ బద్ధము, సుశిక్షితము కావింపబడి, అహంకారము పరిశుద్ధ స్థితిని పొందిననే ఇది సంభవించును. కాబట్టి వివేకమనునది కోరిన ఫలితములను పొందుట కనుసరించిన సాధనల ఫలితము. వేదాంతుల ద్వితీయ సాధన యగు వైరాగ్యము కూడ నీ విధముగానే వివేకము యొక్క ఫలితమే. ఈ రీతిగా నివి యోగమున ప్రాథమిక సిద్ధులు మాత్రమే. అంతేగాని వివిధ దశలను సాధించు సాధనోపాయములు మాత్రముకావు. సహజ మార్గ యోగ విధానమున వివేక వైరాగ్యములు అభ్యాసి పొందవలసిన సాధనలుగా చూడబడక అతని పురోగమనావసరమున అప్రయత్నముగా నుత్పన్నమగుటకు వదలి వేయబడును. వేదాం

తుల తృతీయ సాధనగా పిలువబడునట్టి దాని నుండి యిది యారంభమగును. అది షట్సంపత్తి యనబడు ఆరు విధములైన ఆధ్యాత్మిక సిద్ధుల రూపమున నుండును. ఈ సంపదలలో మొదటిది శమము. ఇది ప్రశాంతతకు, నిశ్చలతకు దారి తీసెడి ప్రశాంత మానసిక స్థితి. మనము దీనికొరకు సాధన చేసినచో వివేక వైరాగ్యములు అప్రయత్నముగా కలుగును. వైరాగ్యమును సర్వము మిథ్య అను భావముతో చూచుట నాయుద్దేశ్యమున కడు దుష్కరమైన పద్ధతి. ఏలయన ఇందులో నీవు నిషేధాత్మక దృక్పథము చేపట్టి, నీ దృష్టికి వచ్చిన ప్రతిదానిని తిరస్కరించవలెను. అట్లుగాక నిశ్చితాత్మక దృక్పథముతో ఒకటే విషయమును సత్యమని గ్రహించి, హృదయ పూర్వకముగా దాని నంటి పెట్టుకొని యున్నచో నితర విషయములు సహజముగానే అప్రధానము లై పోవుటతో క్రమేపి నీవు వాటిని గమనించనే గమనించని స్థితికి వత్తువు. ఇందు మూలమున వాటితో నీ సంబంధము క్రమముగా మాసిపోవుట కారంభమగును. దానితో అతి సులభ మార్గమున వైరాగ్యమును పొందుట సమకూడును. ఇట్లు, యోగాభ్యాసమున నిలకడలేని మనస్సును క్రమబద్ధము చేయుటే ప్రాథమిక విషయము. మనస్సు పెక్కు భావములను, యోచనలను పుట్టించును. ఇంద్రియములకు, మానసిక శక్తులకు ఉద్వేగము కల్గించును. శరీరమును కార్యోన్ముఖము కావించును. ప్రతి మేలును, కీడును మనస్సునుండే ఉద్భవించును. మనస్సే మన సమస్త భావములను, ఉద్రేకములను, ఉద్వేగములను పాలించును. విజ్ఞులు

మానసిక ప్రవృత్తులను అయిదు విధములుగా విభజించిరి. ఇందులో మొదటిది "క్షిప్తము" అనునది. ఇది ఆకలి, దప్పి, కోపముదుఃఖమువంటి భావములు, కీర్తిసంపదలవంటికోరికలు కలిగిన విచలిత మానసిక స్థితి. రెండవది "మూఢము". ఇందు సోమరి తనము, మాంద్యమును పెంపొందించు ప్రవృత్తులు చేర్చబడినవి. మూడవది అయిన "విక్షిప్తము" మనస్సును పవిత్ర భావములనుండి దూరముచేసి, ధ్యానకాలమున ఆలోచనలను పుట్టించు నట్టిది. నాల్గవదియగు 'ఏకాగ్రవృత్తి' అనునది మన దృష్టిని ఏకైక విషయములపై లగ్నము చేయించును. చివరిది "నిరోధము." ఇది మనస్సునుండి చిక్కులనుకలతలను తొలగించి, మనస్సును పరిపూర్ణమగు "ఆత్మ-తుష్టి స్థితికి తీసికొని వచ్చును. ఈ చివరి దశను పొందుటకు సాధారణముగా మహర్షులు సుప్రసిద్ధమైన అష్టాంగయోగమును (యమ,నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులనబడు వాటిని) నిర్దేశించిరి. సహజ మార్గ శిక్షణా విధానమున ధ్యానాచరణమునకై మనస్సు నొకే విషయముపై లగ్నము చేసి యోగదశలలో ఏడవదియగు ధ్యానము నారంభింతుము. అంతకు ముందు దశలను ప్రత్యేకముగా చేపట్టుట లేదు. అవి మనము ధ్యానము చేయుచున్నచో అప్రయత్నముగా అనుభవములోనికి వచ్చును. ఇట్టి మార్గమున మనకు శ్రమ, సమయము చాల వరకు కలసి వచ్చును.

క్లుప్తముగా చెప్పవలెనన్న వేదాంతుల తృతీయ సాధనయగు షట్సంపత్తిలో మొగటిదయిన శమము నుండి మన

సాధన మొదలిడుదుము. అట్లు మొదలిడి, మనస్సును క్రమబద్ధము చేసి, చక్కగా రూపొందించుటపై మన దృష్టిని కేంద్రీకరింతుము. ఇది సమర్థుడయిన గురువర్యుని నుండి ప్రసారితమైన శక్తి మూలమున తేలికగా సమకూడును. ఏకైక సత్పదార్థముపై మన మనస్సును నిలిపి, తది తరములన్నింటిని సరకు చేయక పోయినచో ఇంద్రియ నిగ్రహము [దమము] అప్రయత్నముగనే సమకూడును. సాధారణముగా చాల మంది మహర్షులీ పద్ధతినే అవలంభింతురు. కొన్ని తెగలకు చెందిన వారు కర్మ సాధన ద్వారా శమమునకు పోజూతురు. ఇతరులు భక్తి ద్వారా శమనమునకు పోజూతురు. ఇంకను కొందరున్నారు. వారు వీటి రెంటిని వీడి సాధన ద్వారా ముందుకు పోవుదురు. నిజమునకు కర్మ, ఉపాసన, జ్ఞానములను నవి యొక దాని కంటే ఇంకొకటి వేరైనది కాదు. అవి పరస్పరము సన్నిహిత సంబంధము గలిగి అన్నియునునొకే స్థితియందిమిడి యున్నవి. ఉదాహరణముగా ఉపాసనమందు మనస్సును నిగ్రహించునది కర్మ; నిగ్రహ మానసిక స్థితి ఉపాసనము, దాని యెఱుకయే జ్ఞానము. జ్ఞాన మార్గమందు ఆలోచనా క్రమము కర్మ; ఆలోచించెడి విషయముపై నిలకడ పాటించుట ఉపాసనము; తత్ఫలమగు స్థితియే జ్ఞానము. మఱి కర్మ పద్ధతి యందు ఆచరణ గూర్చి తీర్మానించు కొనుట కర్మ; దానిని యాచరణలోనికి తీసుకొని వచ్చుట ఉపాసనము; సాధిత స్థితిని గూర్చిన యెఱుకయే జ్ఞానము. ఈ విధముగా సహజ మార్గ శిక్షణా విధానమున వివేక వైరాగ్యములు యదార్థముగా

అప్రయత్నముగానే పుట్టు చుండగా అవి యన్నియు అత్యంత సమర్థ వంతము గాను, సమష్టిగాను చేకొనబడు చున్నవి. వివేక వైరాగ్యములను సహజముగా చేకూర్చని యేసాధన వలనను నిజముగా ప్రయోజనము లేదు. ఒక వ్యక్తి తన తప్పులు, లోపములు గుర్తించ నారంభించి, తన హృదయాంతరాళమున వాటికై పశ్చాత్తాప పడుటయే వివేకము యొక్క వాస్తవ రూపము.

మొదట రెండు సంపత్తుల గూర్చి ప్రస్తావించితిమి. ఇప్పుడు మనము మూడవది యగు ఉపరతి సంపత్తికి వత్తుము. ఉపరతి యనగా ఆత్మ నిస్సంగత్వము. ఈ స్థితి యందు మానవుడు అన్ని కోరికలకు; పరలోకమునకు సంబంధించిన కోరికలకు కూడా అతీతుడై యుండును. ఈ ప్రపంచమున నేదియు అతనిని ముగ్ధుని కావింపదు; ఆకర్షింపదు. అతని మనస్సు సర్వదా ఒకే దానిపై కేంద్రీకృతమై యుండును— అదే సత్యము. ఇది వైరాగ్య స్థితికంటే భిన్నము. వైరాగ్యము ప్రాపంచిక విషయములపై వైముఖ్య భావమును కల్గించగా ఉపరతి స్థితి యందు ఆకర్షణ వికర్షణ భావములు రెండును కానరావు. వాస్తవముగా ఉన్నత తరమును, ఉదాత్త తరమును అయిన ఈ స్థితి యొక్క అసంపూర్ణ రూపమే వైరాగ్యము. ఈ దశయందు మన మనస్సు, ఇంద్రియములు సమగ్రముగా పరిశుద్ధ మగును. సమస్త బాహ్య వస్తువుల మీదను విసువు జనించి, అవి ఏమాత్రము గమనించవలసినవి కావని భావించుచు

వాటి నుండి దూరమయి పోవుదుము. ప్రాపంచిక సంబంధము వలని ప్రభావము నుండి మనము స్వేచ్ఛ పొందుదుము. అట్టి వానికి స్వర్గ సౌఖ్యముల మీద కూడ వ్యామోహము లేదు. సద్గతి, మోక్షము లేక తదితర ఉన్నత ఆదర్శముల చేత కూడా అతడాకర్షింప బడడు.

నాల్గవ సంపత్తి తితీక్ష. ఈ దశయందు మానవుడు తనకు దేవుడిచ్చిన దానితో సంపూర్ణ సంతృప్తిని పొంది యుండును. బాధావమానములు, దూషణ భూషణలు అతనిని చలింప చేయలేవు.

అయిదవది శ్రద్ధ. ఇది చాలా ఉన్నతమైన స్థితి. ప్రాథమిక శ్రద్ధ కృత్రిమ శ్రద్ధ కంటె ఇది కడు భిన్నమైనది. ఈ విషయము శ్రద్ధ అను అధ్యాయమున చర్చించ బడినది.

చివరిది సమాధాన సంపత్తి. ఇది ప్రభుని యిచ్ఛతో సమాధాన పడి, ఆ యొఱుక కూడ లేకుండ ఉండు స్థితి. ఈ దశయందు మానవుడు ఆ సర్వోత్కృష్ట ప్రభునికి సంపూర్ణముగా భక్తుడై ఇతరాలోచన లేమియు లేకుండును.

మనము తృతీయ సాధనలోని వివిధ స్థితులను చర్చించితిమి. ఇప్పుడు చతుస్సాధనములలో చివరి దయిన ముముక్షు స్థితిని గూర్చి ముచ్చటింతము. ఈ దశకు వచ్చిన పిమ్మట మానవుడు సాధించ వలసినది పరిపూర్ణ సత్యముతో సన్నిహిత సమ్మేళనము పెంపొందించు కొనుట లేక శూన్య స్థితితో నైక్యము సాధించుట తప్ప ఇంకేమియు లేదు. ఇది

సాక్షాత్కారమున అనుభవ సాధ్యమగు దశ. ప్రాచీన యోగ పద్ధతిలోని ప్రాథమిక సాధనలను శ్రద్ధతో ననుష్ఠించి దీనిని సాధించనగును. ఆధునిక సహజ మార్గ విధామున అష్టాంగ యోగ పద్ధతిలోని వివిధ దశలను ఒక్కొక్కటిగా సాధించుటకు సమకట్టక పోవుటచే పాత మార్గమున కంటె భిన్నమైన మార్గమును అనుసరించు చున్నది. ఈ విధానమున ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులన్నియు ధ్యానములో ఒకే మాఱు చేపట్టబడు చున్నవి. ధ్యానము కొంత కాలము సాగించిన మీద ఏకాగ్రతకు, లేక సమాధి స్థితికి కొని పోవును. ఇట్లు యోగమున అంతిమ దశయగు సమాధి స్థితికి సహజముగానే మనము చేరుకొందుము.

సమాధి లేక ఏకాగ్రతలోని స్థితులు మూడు రకములు. మొదటి దానిలో మానవుడు తన్ను తాను కోలుపోయినట్లు గాని, మునిగి పోయినట్లుగాని భావించును. అతని ఇంద్రియ ములు, భావములు, ఉద్రేకములు తాత్కాలికముగా స్తబ్ధము కావింపబడుటతో అప్పటికి మాత్రమవి చచ్చిపోయినట్లుండును. అతడు మృత ప్రాయమైన నిద్రావస్థలో నున్న చైతన్య రహితుని పోలి ఉండును. రెండవరకమునందు మానవుడు ఒక అంశము మీద గాఢముగా మనస్సు నిలిపిన వాడైనప్పటికిని, అందు నిమగ్నమైనట్లు అనుభూతి చెందడు. దీనిని ఎఱుక లేని స్థితిలోని యెఱుక గల స్థితిగా వర్ణించ వచ్చును. స్పష్టముగా నతనికి ఏ యెరుకయు లేదుగాని ఛాయరూప మాత్రమై లోన

ఎరుక కలదు. ఒక డొక సమస్యను గూర్చి దీర్ఘముగా నాలో చించుచు వీధివెంబడి పోవుచుండును. అతడందులో సంపూర్ణముగా నిమగ్నుయి పోయి, ఇతర మేదియు గుర్తించుట లేదు. దారిలో నేమియు చూచుట కూడ లేదు. చుట్టును వినవచ్చు శబ్దములను కూడ వినుట లేదు. అతడొక స్పృహలేని మానసిక స్థితిలో సాగిపోవును. అయినప్పటికిని అతడు దారి ప్రక్క నున్న చెట్టుకు ఢీకొనడు; ఆ దారి వెంట వచ్చు మోటారు కారు అతనిని పడగొట్టుటయు లేదు. అతని యీ స్పృహలేని స్థితిలో అతడు తనకు తెలియకుండగనే ఈ అవసరములను గమనించి, తదనుగుణముగా ప్రవర్తించు చున్నాడు. అతనికి ఈ చర్యలను గూర్చిన స్పృహ లేదు. ఇది స్పృహలేని స్థితి లోనే స్పృహ గల ఒకానొక స్థితి. ఈ మానసిక స్థితియందు ఇతర వస్తువుల గూర్చిన జ్ఞానము నిద్రాణ స్థితి యందున్నట్లు కాన్పించి మనస్సుపై ఎట్టి ప్రభావము లేకుండును. మూడవ రూపము సహజ సమాధి రూపము. ఇది మనస్సును కేంద్రీకరించుట యందు అత్యుత్తమ పద్ధతి. ఈ స్థితియందు మానవుడు తన పని తాను చూచుకొను చుండును. మనస్సు కూడ పనిలో లీనమయి యుండును. కాని అతని హృదయాంత రాళములో సత్య పదార్థముపైనే అతని మనస్సు లగ్నమై యుండును. అతని బాహ్య మనస్సుతో నాతడు బయటి పనులను చక్కబెట్టు చున్నాడు. అదే సమయమున అతని అంతర్మనస్సు దైవసంబంధమైన ఆలోచనలతో నిండియుండును. అతడు ప్రాపంచిక కార్యములలో నిమగ్నుడై యున్నట్లు కాన్పించినను అతడు

సర్వదా సమాధి స్థితియందుండును. ఇది అత్యంతోన్నతమైన సమాధి స్థితి. ఈ స్థితిలో శాశ్వతముగా ప్రవేశించిన పిమ్మట చేయవలసినది లేదు.

సాధన కాలమున గడించు వివిధాధ్యాత్మిక దశలును ప్రకృతి కార్యమును చక్క బెట్టుటకుత్పన్న మగు ప్రత్యేక శక్తి సామర్థ్యములతో నిండి ఉండును. ఉరః భాగము నందు అత్యంత నిమ్నమయి పిండదేశ మనబడు ప్రదేశము వివిధములైన ఉపస్థానములతో కూడి యున్నది. ప్రాచీన హిందూ మత సాహిత్యమున సాధారణముగా పంచాగ్ని విద్యయని పేర్కొనబడు దానికిది కేంద్రస్థానము. ఈ స్థానముపై సర్వాధి కారము సంపాదించిన పిదప మానవుడు అప్రయత్నముగానే తనలో పదార్థ విజ్ఞానమునకు సంబంధించిన జ్ఞానమును అంతరంగికముగా పొందును. దీని నాతడు తగు మాత్రపు సాధన అనుభవముల పొందిన మీదట తన యిచ్ఛ వచ్చిన రీతిని ఉపయోగించుకొనవచ్చును. కాని, ఆధ్యాత్మికతకు చెందినంత వరకు ఈ సిద్ధులు అతనికి పనికిరావు. సమర్థవంతమైన శిక్షణా విధానమునందు అభ్యాసి బాహ్యమైన శక్తుల గూర్చి యెఱుగని స్థితిలో నుంచబడి, గురువు నుండి ప్రసారితమైన శక్తి సహాయపడుచుండగా స్వచ్ఛమైన ఆధ్యాత్మిక తత్వము తప్ప తదితరము అతని నాకర్షించకుండునట్లు చేయఁబడును. అప్పుడాతడు తన కప్పగించిన చిన్నచిన్న దైవకార్యము

లొనరించుటకు తగి యుండును. ఈ దశయందాతని కార్య రంగము ఒక చిన్న ప్రదేశము. ఉదాహరణమునకు, ఒక పట్టణముగాని, ఒక జిల్లాగాని అటుగాక కొంతపెద్ద విభాగము గాని కావచ్చును. అతని పని యెట్టి దనిన అతని యాజమాన్యము క్రిందనున్న ప్రదేశ మంతటను సంపూర్ణ ప్రకృతి ధర్మాను సారముగ ప్రతి దానిని చక్క దిద్దుటే. అతని పరిధిలో అవసరమైనవాటిని అతడు పూరించును. అవాంఛితము లున్నవాటిని తొలగించును. అతడు ఋషియని పిలువబడును. అతని పదవి "వసువు" అనబడును.

"ధ్రువుని" స్థానము దీని కంటె ఉన్నతమైనది. అతడు బ్రహ్మాండ మండలముపై యాజమాన్యము వహించును. అతడు మునుల వర్గమునకు చెందును. అతని కార్యరంగము చాల విస్తృత మైనది. అతడు "వసువు"లపై నెల్ల అధికారము వహించును. అతని కర్తవ్యమేమన అంతరంగమున నున్న వాతావరణమును అవాంఛనీయ భావముల నుండియు, ఆలోచనల నుండియు పరిశుద్ధము కావించుట. దైవందిన కార్య క్రమమునకు తోడు అతడు తాత్కాలికముగా తన కప్పగింప బడిన పెక్కితర కార్యములుకూడ నిర్వహింపవలసి యుండును. శరీర నిర్మాణమునగల "హృదయనికట స్థానము" (Hylem shadow)లో నున్న ప్రదేశమును సంపూర్ణముగా ప్రకాశింపజేసి ఈ స్థితిని పొందవలెను.

దీనికిపైన "ధ్రువాధిపతి" స్థానము కలదు. అతడు "ధ్రువుల" కార్యకలాపములను నిర్దేశించును. ఈ స్థితి నాభీ స్థానముపై యాజమాన్యము గడించిన మీదట సాధింప నగును. ఇతని కార్య రంగము ప్రపంచమున కంతకు వ్యాపించును. కాని పని మాత్రము "ధ్రువుని" పనిని పోలినది. వాతావరణమును పరిశుద్ధి పరచుటకు సంబంధించిన దైనందిన కార్యక్రమమునకు తోడు ఇతడును వివిధ కాలములలో సంభవించెడి సాధారణ సంఘటనలను, సంభవములను గమనించవలెను. ఈ దైవీయ కార్య కర్తలు మహాశక్తి సంపన్నులైన గొప్ప పరిణతి చెందిన ఆత్మలు. వారు తాను, నేను, అను భావముగాని, వ్యక్తిత్వముగాని లేకుండ ప్రకృతి యొక్క యిచ్ఛాను సారముగా పని చేయుదురు. వారి పనులు అప్రయత్నముగా యాంత్రికముగా జరిగి పోవును. ఏ విషయము నందును వారికి వ్యక్తిగత స్వేచ్ఛగాని, నిర్ణయాధికారము గాని లేదు.

ప్రకృతి కత్యంతావశ్యకమైనట్టి ప్రత్యేక పరిస్థితులందే ధ్రువాధి పతి కంటె ఉన్నతమైన "పారిషద" పదవి యొసగబడును. ఇతడు పైన పేర్కొనిన వివిధ కార్యకర్తల కార్యకలాపములన్నియు క్రమ బద్ధము చేయుచు, మార్గదర్శకత్వము నెఱపి ముఖ్యమైన పనులను తాను నిర్వర్తించుచు వివిధ కార్యములను వారికి నిర్దేశించు చుండును. మహా కార్యములను యుద్ధములవంటి అన్ని ముఖ్య విషయములందును, విధి

విధాయకఫలితముల సమకూర్చుటకై అతని యిచ్ఛాశక్తి పని చేయును. నిర్మాణాత్మక వినాశాత్మక ప్రకృతి ప్రణాళిక లన్నియు అతడే నిర్వహించును. అతని కార్యరంగమీ ప్రపంచమునకు మాత్రమే పరిమితమైనది. మానవుడు "సహస్రదళ కమలము" యొక్క కేంద్ర బిందువుపై యాజమాన్యము గడించిన మీదట ఈ స్థితి సంపాదింప నగును.

'మహాపారిషద' పదవి పదవులలోకెల్ల ఉన్నతమైనది. అది చిట్ట చివరి దైవీయపదవి. చాల అరుదుగా పొందదగినది. ప్రకృతి అత్యంతావశ్యకముగా పరిణామము చెందవలసి యున్నపుడుగాని, ప్రపంచమును పరిశుద్ధి కావింప వలసి వచ్చినపుడుగాని, ఈ పదవి యొసగబడును. ఈ పదవినందిన యాతడు అత్యంతోన్నత శక్తి సంపన్నత అనుభవించును. రాజయోగ ప్రభావము నాల్గవ సంపుటి, పటము 5, పుట 36న వివరించినట్లు (Occipital bone) అను కపాల ఎముక యొక్క కుడి భాగము నందు ఇది మొదలిడును.

రాజయోగమున పొందదగు అద్భుతమైన సిద్ధులు ఇట్టివి. శ్రద్ధగల ప్రతి యొక్కడును సరియైన మార్గమును, మార్గదర్శకత్వమును అనుసరించినచో వీటిని పొందనగును.

# 10

# నా భవిష్య దృష్టి

ప్రపంచము నేడు క్లిష్టదశలో సాగుచున్నది. రోజు రోజుకు రాజకీయ పరిస్థితి చాల క్లిష్టమై పోవుచున్నది. ఆర్థికస్థితి కడు నిరుత్సాహకరముగా నున్నది. నైతిక, మతపర సాంఘిక పతనము క్రమా క్రమి గా చివరి దశ నందుకొన్నది. అంతట అశాంతి, భద్రతారాహిత్య, విద్వేష వాతావరణముతో నిండి పోయినది. ప్రతి దేశము తన పొరుగు దేశమును అసూయా దృష్టితో చూచుచు, తన సమస్త శక్తులను పొరుగు దేశమును దోచుకొను మార్గములు వెదకుటకై వినియోగించు చున్నది. ప్రపంచ రాజకీయ నాయకులకీ విషయములు తెలియకపోలేదు. వారు ప్రపంచము నెదుర్కొనుచున్న వివిధ సమస్యలను సంతృప్తి కరముగా పరిష్కరించుటకు మార్గముల వెదకు చున్నారు. కాని, ఈ విషయమున నెలకొల్పబడిన సమస్త సంస్థలును మొత్తము మీద ప్రోత్సాహకర ఫలితములను సాధించినట్లు కానవచ్చుటలేదు. గొప్ప రాజకీయ వేత్తలు, నాయకులు మనస్సులలో ప్రధాన స్థానము పొందియున్న ప్రపంచ

శాంతి సమస్య కేవలము భ్రాంతి లేక ఎండమావులవలె నుండి పోయినది.

భారతదేశ వ్యవహారముల పరిస్థితి కూడ ఏమంత తృప్తికరముగా లేదు. దేశ మంతటను విభేదములు, స్వ పక్షపాత భావములు ముమ్మరముగా నున్నవి. స్వార్థ పరత ప్రముఖ పాత్ర వహించి యున్నది. నైతిక సూత్ర ములు నిరాదరింప బడినవి. ఆహార సమస్య చాల కఠిన సమస్యగా నున్నది. ఇన్ని యున్నప్పటికిని దేశము పురోగ మించుచున్నదని మనలో కొందరు భావించు చున్నారు. మన దేశము అచ్చముగా భౌతిక వాదముపై నాధార పడిన పాశ్చాత్య దేశముల నాగరికతా విధానమువైపు క్రమ క్రమ ముగా సాగిపోవుటే పురోగమనమునకు గుర్తుగా వారు తీసి కొందురు. ఇక భౌతికవాద శకము పరి సమాప్తి కావలెను. పాత పద్ధతులు మారి క్రొత్త పద్ధతులునెలకొన వలసియున్నది. విద్యుచ్ఛక్తి అణు శక్తులపై నాధారపడియున్న నేటి ప్రపంచ నాగరికతా నిర్మాణము ఇంకెంతో కాలము నిలువబోదు. త్వరలోనే అది కూలి పోవలసి యున్నది. వాతావరణము యావత్తును సంపూర్ణ భౌతికతా భావము యొక్క విష పూరిత ప్రభావముతో నిండి నిబిడీ కృతమైపోయి, తన్నిర్మూ లనము మానవ సాధ్యము కానంతమేరకు పోయినది. మార్పు తీసికొని వచ్చుటకు కాలము రమారమిగా పక్వదశ నందినది. అనివార్యమగు పరివర్తన ఆసన్నమగు చున్నది. ఇందు

కొరకు నేను నా పుస్తకము (Efficacy of Rajyoga) రాజయోగ ప్రభావములో చెప్పినట్లు మానవ రూపమున నున్న భగవచ్ఛక్తి పని చేయుచున్నది. ఇది కొందరికి నమ్మదగినదిగా కన్పించక పోవచ్చును. కాని, ఇది అనుమానాతీతమైన వాస్తవాంశము. అతనిని గూర్చి, యీ విషయమున అతని కృత్యముల గూర్చి కొలది కాలము పిమ్మట, విషయములు చక్కగా వెలుగునకు వచ్చినపుడు, ప్రపంచమునకు తెలియ వచ్చును. దైవకార్యమెప్పుడును గొప్ప శక్తి సంపన్నత గల మానవునిద్వారా నిర్వహింపబడును గాని నేరుగా కాదు. దీనికి కారణమేమన కార్య నిర్వహణకు కావలసిన ఏకైక ఉపకరణమగు మనస్సు దేవుని యందు లేదు. మానవుని యందు మనస్సు గలదు. దాని నీ పనికి ఉపయోగించుకోవచ్చును. కాని, అతడు తన వ్యక్తిత్వ భావమును పూర్తిగా కోల్పోయిన వెనుకనే యిది వీలగును. ఆత్మభావ రాహిత్య స్థితిని సాధించిన మీదట అతనిలో మిగిలి యుండునది మానవ మనస్సుకాదు; అది స్వచ్ఛ సంపూర్ణ స్థితి యందున్న దివ్యమానసము. ఈ దివ్య మానసముమానవాకృతిలో నిమిడియున్నట్లుగా పైకి కాన్పించునప్పటికి ప్రకృతి దీనిద్వారా పని చేయును.

నా భవిష్య దృగ్గోచరమగు ప్రపంచ స్వరూపమును చదువరులకు చూచాయగా కనబఱతును. మీరు నమ్ముడు, నమ్మకపొండు. నే నతీంద్రియ స్థితిలో ప్రకృతిని గమనించి

చెప్పునది ఇది. ప్రపంచమునగల అవాంఛనీయాంశముల వినాశమును సూచించు గురుతులప్పుడే మొదలయినట్లు కానవచ్చు చున్నవి. ఇట్టి దృష్టాంతములు ప్రపంచ చరిత్రలో నింతకు మునుపెన్నియోమార్లు కానవచ్చి యున్నవి. రాముడు రావణునితో చేసినయుద్ధము, నోవావరదలు (Noah's Flood), మహాభారత యుద్ధము- ఇవి, పెక్కు నిదర్శనములలో కొన్ని. ఇట్టి వినాశము జరుగుటకు మార్గములు బహుళములు. అది యుద్ధము ద్వారా జరుగ వచ్చును లేదా అంతఃకలహముల ద్వారా కానవచ్చును. అగ్ని పర్వత స్ఫోటనము మొదలగు దైవిక విపత్తుల వలన కావచ్చును లేదా యిట్టిదే యింకేదైన జరుగ వచ్చును. అంతిమ దశకు కాలము పక్వము చెంది యున్నది. ప్రపంచము అంతిమ దశను చేరుటకు వేగాతి వేగముగా పయనించుచున్నది. ఈ శతాబ్దాంతములోననే ఈ కార్యము పరిపూర్ణ స్థాయికి రావచ్చును. కాని క్రింది పేర్కొనిన కొన్ని సంఘటనలు సంభవించుటకు చాలకాలము పట్టవచ్చును.

కొలది కాలముగా సూర్యునిలోని వేడిమి క్రమేపి తగ్గుచు వచ్చుచున్నది. సూర్యునిలో వేడిమి చాలనందున భూమి మీద కొంతకాలము పిమ్మట జీవకోటి జీవించుట దుర్భరమై పోవచ్చును. ఇది శాస్త్రజ్ఞులకు తీరని సమస్య అయిపోవచ్చును. భౌతిక శక్తులన్నీ వారి వశమం దున్నప్పటికినీ ఈ సమస్యా పరిష్కారము వారి బుద్ధి కందరానిది.

ఇపుడే ఆ స్థితి వరకు అది తగ్గిపోదని నేను వారికి హామీ ఇవ్వగలను. ఇప్పటి సూర్యుని వేడిలోని తరుగుదల ప్రకృతి పరివర్తన క్రమమును త్వర పరచుటకే. ఈ కార్య నిర్వహణకై నియమితుడైన మహాపురుషుడు దాని నీపనికి వినియోగించుకొనుచున్నాడు. ఇది ప్రపంచ నిర్మాణ సర్వస్వమునందు ఆసన్నమయిన మహా పరివర్తనమును సూచించు అమోఘమైన గుర్తు. దాని తర్వాత సూర్యుడు తన పూర్వపు సంపూర్ణ ప్రకాశమును పొందును. మహాప్రళయ సమయమున మరల నిదే గుర్తు కనవచ్చును. కాని, అది చాలకాలము తర్వాత రాబోవు చున్నది కనుక దానిని గూర్చి యిచట చర్చింప నిచ్ఛగించను. పాఠకుల అభిరుచిని గుర్తించి ఈ సందర్భమున నొక విషయము మాత్రము వెలువరింతును. మహా ప్రళయ కాలమున ధ్రువ నక్షత్రము తన స్థానము నుండి కొన్ని డిగ్రీలు దూరమయి, కొంత వేడిగా నగును. వాయు రూపమున నొక ప్రబలమైన శక్తి దాని నుండి వేగముగా వెలువడి తుదకు ప్రపంచమును, తదితరము నంతను నాశన మొనర్చివైచును. వినాశన కార్యము ఉత్తర ధ్రువమందు ఆరంభమగును.

ప్రస్తుత మహా పరివర్తన ఫలితముగా దారుణమగు మార్పులు సంభవించును. క్రొత్త ప్రపంచపు తీరు తెన్నులు నేడు మనము చూచు దాని కంటెను కడు భిన్నముగా

నుండును. గ్రేట్ బ్రిటన్ దశ దుఃఖ జనకముగా నుండును. అందులో కొంతభాగము. అనగా దక్షిణభాగము సముద్రములో మునిగి పోవును. లండను నడుమ అగ్ని పర్వత శక్తి గుప్త స్థితిలో పనిచేయుచున్నది. కొంతకాలమున కది అగ్ని పర్వత స్ఫోటనముగా పైకి పొంగును. గల్ఫ్ స్ట్రీమ్ తనదారి మార్చి వైచును. దేశము విపరీతముగా చల్లబడి పోవును. యూరప్ ఖండము స్థితికూడ అట్లేయుండును. చిన్న దేశములు రూపు మాసి పోవును. రష్యా భవిష్యత్తు అంధకారమయమై యున్నది. అది నిలువ బోదు. రష్యాయొక్క ఆయుధమే దాని తల దగ్గర పిస్తోలుగా పనిచేయును. కమ్యూనిజమును దాని మాతృభూమి లోనే శ్మశాన వాటి కాచుకొని యున్నది. అమెరికా తన యావత్సంపత్తిని కోల్పోవు నాపత్సమయమును దగ్గరగు చున్నది. కొంత కాలమునకు ఆదేశము బికారిగా తయారు కాగలదు. దాని శక్తి గొప్పతనమును దానితో పాటే మునిగి పోనున్నవి. భారతదేశము తన ప్రాచీన వైభవమును తిరిగి పొందనున్నది. అది తన ప్రభుత్వము క్రిందనే ప్రాముఖ్యము నందుకో గలదు. దాని ఆధిక్యము బహుదూరము వ్యాపించును. ప్రపంచ మంతయు దానివైపు మార్గదర్శకత్వమునకై ఎదురు చూడనున్నది. కాని భారతదేశమునకు కూడ ప్రపంచ మహా పరివర్తనలో భాగ ముండును. తిరుగుబాటు సూచనలు దేశములో తలయెత్తుచున్నవి. దేశములో నొక భాగము, అనగా బెంగాలులో తూర్పు భాగము సముద్రములో మునిగి

పోవును. అగ్ని పర్వత శక్తి కూడ క్రియాశీలమైయుండి, అది కొన్ని భాగములకు, ముఖ్యముగా బీహారు రాష్ట్రమునకు విపరీత నష్టము కలిగించును. సుదూర భవిష్యత్తులో దక్షిణ పీఠ భూమి ఒక ద్వీపముగా మారిపోవచ్చును. ప్రపంచమంతటను విపరీతముగా రక్త ప్లావము జరుగవచ్చును. బహు కారణముల మూలమున ప్రాణ నష్టమెంత అధికముగా జరుగనున్నదనగా ప్రపంచ జనసంఖ్య చాలవరకు తగ్గిపోవును. శిధిలాలపై ప్రపంచ పునర్నిర్మాణము జరుగును. భారతదేశమున అధ్యాత్మికతపై నాధారపడిన నొక నూతన నాగరికత అవిర్భ వించును. కొంత కాలమునకది ప్రపంచ నాగరికతగా పరిణ మించును. అధ్యాత్మికత నాధారము చేసికొనక ఏ దేశము గాని, ఏ జాతిగాని జీవింపజాలదు. ప్రతి జాతియు తన అస్తి త్వము నిలుపుకొనుటకై ఎప్పుడైనను అదే మార్గమవలం బించి తీరవలెను.

ओ३म् तत्सत्

सत्यपद

IN MEMORY OF SAMARTH GURU SHRI RAM CHANDRA JI MAHARAJ OF FATEGARH (U.P.)

SHRI RAM CHANDRA MISSION SHAJAHANPUR

U.P.

# చిహ్నము

ఉత్తరప్రదేశ్‌లోని ఫతేగఢ్ నగరమునకు చెందిన సమర్థగురుమహాత్మ రామచంద్రజీయను దివ్యాత్మ పేర వారి పూజ్యస్మృతి చిహ్నముగా 'శ్రీ రామచంద్ర మిషన్' అను ఆధ్యాత్మిక సంస్థ స్థాపింప బడినది. ఈ సంస్థ అనుసరించు విధానమునకు సంబంధించిన సమగ్ర రేఖా చిత్రమే ఈ చిహ్నము. ఈ సంస్థ అనుసరించు విధానము సహజమార్గ మన బడుచున్నది.

అడుగున నున్న స్వస్తిక చిహ్నము మనము ఆధ్యాత్మిక యానము మొదలు పెట్టు స్థానము. కష్టములు అడ్డంకులనెడి పర్వతములను ఛేదించి, ప్రకృతిస్వయముగా వైచిన బాటయే సహజ మార్గము. ఈ మార్గము ననుసరించి పురోగమించుట యందు మన మాచరించు పలురకములైన విధులు, విధాన ములు, సాధనలయొక్క స్థానమీచిహ్నము. మానవసాధ్యమగు మహోన్నత స్థానమును పొందువరకు అడుగడుగున సూక్ష్మ తరమగుచు సూర్యచంద్ర మండలములకు కడుంగడు ఉన్నతమై మనము భిన్నరూపములు ధరించిన స్థూలత్వమునకు సంబం ధించిన వివిధములైన ఛాయా కాంతి గోళముల ద్వారా పయనింతుము. ఉదయించుచున్న సూర్యుని వలన జనించిన కాంతిగోళము పవిత్రమూర్తియగు సమర్థగురు రామచంద్రజీచే

ప్రారంభింపబడిన నూతనాధ్యాత్మిక శకమును సూచించును. సహజ మార్గమును చేపట్టి పయనించు నపుడు మొదటి నుండి గల మండలములన్నిటిని నాక్రమించుచు, ఇది విశ్వమంతయు వ్యాప్తమైయున్నది.

సృష్టికి పూర్వమంతటను వ్యాపించియున్నది అంధకార మని చెప్పవచ్చును. అంధకారమనగా కాంతి లేమి—కాంతి లేమి యనగా అంధకారము. కాంతిలేని చోట ఏముండును? దానిని అంధకార మనవచ్చును. సమస్తము సమాప్తమయిన చోట నేమి కానవచ్చును? శూన్యమను టొక్కటే దానిని తెలుపుటకు గల మాటయనవచ్చును. కాని అంధకారము, శూన్యమను మాటలయందు, ఏదో యింకను అచ్చట నున్న దను భావముండుటచే యదార్థ విషయమునకు కడు దూరమే. పైన చెప్పిన పరివర్తన రహిత శాశ్వత విషయమును సూచించుటకు 'కాంతి లేమియు', 'అంధకార రాహిత్యమును' అనుట బహుశః సరిపోవచ్చును; అట్టి స్వచ్ఛ పరిపూర్ణ స్థితి నుండి ప్రస్తుత స్థితికి మనము పరిణామము చెందితిమి. చిహ్నము యొక్క పైభాగమున కనబరచిన ఆ స్వచ్ఛ పరిపూర్ణ స్థితిని శాశ్వత ప్రశాంత గోళమని పిలువ వచ్చును. అచ్చట కాంతి గాని, అంధకారము గాని లేదు. దాని క్రిందుగా 'సత్యపధము' కలదు. అచ్చట సత్యమే ప్రధానముగా నుండును. అందువలన అది కాంతివంతమైన ప్రదేశము అయినను ఆ కాంతి అతి సూక్ష్మము.

# దశ నియమములు

1. ప్రొద్దు పొడవక ముందే నిద్రలెమ్ము. నిర్ణీత సమయమున-సూర్యోదయమునకు ముందయినచో మంచిది - ఒకే ఆసనమున కూర్చొని ప్రార్థన, పూజాదికములను కావింపుము. మానసిక శారీరక పారిశుద్ధ్యమును ప్రత్యేకముగా పాటింపుము.
2. ప్రేమ, భక్తి పూర్వకమైన హృదయముతో అధ్యాత్మికోన్నతి కొరకు ప్రార్థన జరిపి, పూజ నారంభింపుము.
3. భగవంతునితో సంపూర్ణ ఐక్యము పొందుటయే నీ గమ్యముగా నిర్ణయించుకొనుము. దానిని సాధించునంత వరకు విశ్రమింపకుము.
4. ప్రకృతితో సారూప్యము పొందుటకు నిష్కపటముగాను, నిరాడంబరముగాను ఉండుము.
5. సత్యసంధత కలిగి యుండుము. దుఃఖములను దివ్యమైన దీవెనలుగా భావించి, అవి నీ మేలు కొరకే కలుగుచున్నవని కృతజ్ఞతా భావముతో నుండుము.
6. అందరిని సోదరులుగా భావించి, అట్లే వారి నాదరింపుము.
7. ఇతరులు కీడు చేసినచో ప్రతీకారబుద్ధి పూనకుము. దానిని దివ్య బహూకృతిగా కృతజ్ఞతతో స్వీకరింపుము.
8. ఋజువర్తన తోడను, భక్తి భావముతోడను ఆర్జించిన దానితో తృప్తి చెంది, నిరంతర దివ్య భావములతో దాని నారగింపుము.
9. ఇతరులలో భక్తి ప్రేమ భావముల మొలకెత్తించునట్లుగా నీ జీవనమును మలచుకొనుము.
10. పడుకొనబోవు సమయమున, దైవసాన్నిధ్య భావనతో, నీ వొనర్చిన తప్పుల గూర్చి పరితప్తుడవు కమ్ము. వాటిని మరి చేయనని వినమ్ర భావముతో భగవంతుని క్షమాపణ కోరుము.

SHRI RAM CHANDRA MISSION SHAJAHANPUR